PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 43 సంచిక : 234 | విజయవాడ, శుక్రవారం 29 మార్చి 2024 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Friday 29 March 2024 | Rs

ఆదుకున్న రియాన్

- 45 బంతుల్లో 84 పరుగులు
- ఢిల్లీపై 12పరుగుల తేడాతో రాజస్తాన్ గెలుపు

8

రాష్ట్రానికి ముగ్గురు ప్రత్యేక ఎన్నికల పరిశీలకులు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రానికి ముగ్గురు ప్రత్యేక ఎన్నికల పరిశీలకులను కేంద్ర ఎన్నికల సంఘం నియమిం చింది. 1987 బ్యాచ్‌కు చెందిన రిటైర్డు ఐఎఎస్ అధికారి రామ్మోహన్ మిశ్రాను ప్రత్యేక సాధారణ పరిశీలకులుగా, 1984 ఐపిఎస్ బ్యాచ్‌కు చెందిన రిటైర్డు ఐపిఎస్ అధికారి దీపక్ మిశ్రాను స్పెషల్ పోలీస్ పరిశీలకులుగా, 1983 బ్యాచ్‌కు చెందిన రిటైర్డు ఐఆర్‌ఎస్ అధికారి నీనా నిగమ్‌ను స్పెషల్ ప్రత్యేక ఎన్నికల వ్యయ పరిశీలకులుగా నియమిస్తూ గురువారం నిర్ణయం తీసుకుంది. ఎన్నికల నిర్వహణకు చేస్తున్న ముందస్తు ఏర్పాట్లను పరిశీలించటం, ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను పటిష్టంగా అమలుపరిచేలా చూడటం, రాష్ట్ర సరిహద్దు ప్రాంతాలు, సమస్యాత్మకమైన ప్రాంతాలతోపాటు ఓటర్లను ఆకర్షించే, ప్రేరేపించే తాయిలాల నియంత్రణ, తదితర అంశాలపైనా వీరు ప్రత్యేక దృష్టి సారించనున్నారు. ఈ ముగ్గురూ వచ్చేవారం నుంచి రాష్ట్రంలో పర్యటించబోతున్నట్లు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా తెలిపారు.

ఇదో పెద్ద కుట్ర

బిజెపి స్క్రిప్టు ప్రకారమే మాగుంట నా పేరు ఇరికించారు

- ఆధారాలేకుండా అరెస్టు చేశారు
- 6 వాంగ్మూలాల్లో నాకు వ్యతిరేకంగా ఒక్క మాట కూడా లేదు
- అప్రూవర్‌గా మారాకనే ప్రస్తావన
- ఆ వెంటనే రాఘవకు బెయిలు
- తండ్రీ కొడుకులు ఇప్పుడు బిజెపి కూటమిలోని టిడిపిలో చేరారు
- ఢిల్లీ కోర్టులో అరవింద కేజ్రీవాల్ ప్రకటన



ప్రజాశక్తి- న్యూఢిల్లీ బ్యూరో

నన్ను , నా పార్టీని నాశనం చేయడమే లక్ష్యంగా బిజెపి కుట్ర పన్నిందని ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ తీవ్రంగా విమర్శించారు. బిజెపి రచించిన స్క్రిప్టు ప్రకారమే ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) యాక్ట్ చేస్తోందన్నారు. ఇందుకు ఆంధ్రప్రదేశ్‌కు చెందిన లిక్కర్ వ్యాపారి మాగుంట కుటుంబం చేత ఇడి ఎలా తప్పుడు వాంగ్మూలం ఇప్పించిందీ ఆయన వివరించారు. గురువారం నాడు ఇడి ఢిల్లీ కోర్టులో కేజ్రీవాల్ స్వయంగా తన వాదనను వినిపించేందుకు అనుమతి కోరగా, న్యాయమూర్తి అందుకు అనుమతించారు. ముఖ్యమంత్రి కేజ్రీవాల్ హిందీలో తన వాదనను వినిపిస్తూ మద్యం పాలసీ వ్యవహారంలో ఎప్పుడైతే ఇడి జోక్యం చేసుకుందో అప్పుడే అసలైన స్కాము మొదలైందన్నారు. ఇడి ప్రస్తుతం రెండు లక్ష్యాలు పెట్టుకొందని, అందులో ఒకటి ఆప్ పార్టీని నాశనం చేయడం, మరొకటి డబ్బుల దందాను సాగించడం అని ఆరోపించారు. ఎలాంటి ఆధారాలు లేకున్నా తనను ఇరికించడమే ఇడి ఏకైక లక్ష్యంగా పెట్టుకుందన్నారు. ఇడి కస్టడీని తాను వ్యతిరేకించడం లేదు. ఎన్ని రోజులు కావాలంటే అన్ని రోజులు కస్టడీ లోకి తీసుకోమనండి. రెండేళ్ల క్రితం నుంచి ఈ కేసు నడుస్తోంది. 2022 ఆగస్టులో సిబిఐ కేసు నమోదైంది. అప్పుడు ఇసిఐఆర్ ఫైల్ చేశారు. దాదాపు 25,000 పేజీల ఛార్జ్‌షీట్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా లిక్కర్ వ్యాపారి, రాజకీయ నాయకుడు మాగుంట శ్రీనివాసులు, రాఘవ గురించి కేజ్రీవాల్ ప్రస్తావించారు. వారు గత నెలలోనే బిజెపి మిత్రపక్షమైన టిడిపిలో చేరి ఆ కూటమి తరపున బిజీగా ప్రచారం చేస్తున్నారు. వీరిలో ఒకరు అప్రూవర్‌గా మారిన తరువాత ఇచ్చిన వాంగ్మూలాన్ని ఆధారంగా చేసుకుని తనను ఈ కేసులో ఇరికించారని కేజ్రీవాల్ అన్నారు. మాగుంట రాఘవను అరెస్టు చేయడంతో శ్రీనివాసులు రెడ్డి ఒక్కసారిగా బాణీ మార్చారని అన్నారు. శ్రీనివాసులు రెడ్డి ఇడికి ఏడు సార్లు వాంగ్మూలాలిచ్చారని వాటిలో ఆరింటిలో తనకు వ్యతిరేకంగా ఒక్క మాట కూడా లేదని, అప్రూవర్‌గా మారిన తరువాత ఇచ్చిన ఒకే ఒక వాంగ్మూలంలో తన గురించి ప్రస్తావించారని, ఆ వెనువెంటనే రాఘవకు బెయిలు లభించిందని కేజ్రీవాల్ కోర్టుకు వివరించారు. మాగుంట సౌత్ గ్రూపునకు చెందిన నెల్లూరు, మిగతా 2లో

జోక్యం చేసుకోలేం

- కేజ్రీవాల్ సిఎం గా కొనసాగడంపై దాఖలైన పిల్‌ను కొట్టేసిన ఢిల్లీ హైకోర్టు

కేజ్రీవాల్‌ను అరెస్టు చేసిన నేపథ్యంలో ఆయనను ముఖ్యమంత్రి పదవి నుండి తొలగించడానికి ఢిల్లీ హైకోర్టు తిరస్కరించింది. ఈ విషయంలో న్యాయపరంగా జోక్యం చేసుకోవడానికి ఎలాంటి అవకాశం లేదని, పాలనా పరమైన జోక్యం చేసుకోలేమని వ్యాఖ్యానించింది. ఢిల్లీ మద్యం విధానం కేసులో అరెస్టయిన కేజ్రీవాల్ ఇడి కస్టడీలో వుంటూనే పాలన కొనసాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఏ అధికారంతో ఆయన ముఖ్యమంత్రి బాధ్యతలు నిర్వహిస్తున్నారో వివరణ ఇవ్వాలంటూ సూర్జిత్ సింగ్ యాదవ్ అనే వ్యక్తి ఢిల్లీ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలు వేశారు. ముఖ్యమంత్రిగా కేజ్రీవాల్‌ను కొనసాగించడం వల్ల శాంతి భద్రతలకు విఘాతం కలుగుతుందని, రాష్ట్రంలో రాజ్యాంగ వ్యవస్థ కూలిపోవడానికి దారి తీస్తుందని యాదవ్ తన పిటిషన్‌లో పేర్కొన్నారు. దీనిపైకోర్టు స్పందిస్తూ, 'ఇందులో న్యాయపరమైన జోక్యానికి అవకాశం లేదని కోర్టు అభిప్రాయపడుతోందని తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి మన్మోహన్, జస్టిస్ మమీత్ అరోరాలతోకూడిన బెంచ్ మిగతా 2లో

ఖరీఫ్ బీమా ఎప్పుడు?

- కరువు, తుపాన్ వలన భారీగా పంట నష్టం
- 2022 రబీ ఇన్సూరెన్స్ దిక్కులేదు
- 2023 రబీలో ప్రక్రియే మొదలు కాలేదు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి- అమరావతి

విపత్తులతో పంట నష్టం వాటిల్లిన రైతులకు బీమా ప్రశ్నార్థకమైంది. గతేడాది రబీ సీజన్‌లో వైపరీత్యాల వలన పంటలు దెబ్బతిన్న అన్నదాతలకు ఇప్పటికీ ఇన్సూరెన్స్ సొమ్ము అందలేదు. 2023 ఖరీఫ్‌లో కరువు, తుపాన్లతో పంటలు నష్టపోగా బీమా ఊసే లేదు. అదేంటంటే, ఎన్నికల అనంతరం జూన్‌లో క్లెయిములొచ్చే అవకాశం ఉందంటున్నారు. ఇక ప్రస్తుత 2023-24 రబీ సాగు ముగిసినా బీమా ప్రక్రియ మొదలు కాలేదు. కేంద్రానికి ఇప్పటి వరకు ప్రభుత్వం ప్రీమియం చెల్లించలేదు. జరుగుతున్న రబీలో కరువు తీవ్ర రూపం దాల్చింది. లక్షల ఎకరాల్లో సాగు లేదు. వేసిన పంటలు ఎండుతున్నాయి. రైతుల్లో ధీమా నింపాల్సిన బీమా సందేహాస్పదం కావడంతో ఆందోళన చెందుతున్నారు. పంటలు నష్టపోయిన తరుణంలో అరకొరగా ఇచ్చే బీమా అయినా దక్కేనా అన్న ఆశతో ఎదురు చూస్తున్నారు.

బీమా లేదు

రైతులందరికీ ఉచిత పంటల బీమా అమలు చేస్తామని నవరత్నాల్లో వైసిపి సర్కారు హామీ ఇవ్వగా అరకొరగా తప్ప నాలుగేళ్లల్లో ఎప్పుడూ అన్నదాతలకు సరిగ్గా బీమా దక్కింది లేదు. తొలుత కంపెనీలతో సంబంధం లేకుండా, కేంద్ర పథకాలతో నిమిత్తం లేకుండా బీమా అన్నారు. కేంద్రం ఒత్తిడితో 2022 నుంచి తిరిగి సెంటర్ పథకాల్లో చేరారు. ఆ ఏడాది ఖరీఫ్‌లో దిగుబడి ఆధారిత బీమా (ఫసల్)ను కంపెనీలకు అప్పగించగా, వాతావరణ ఆధారిత బీమాను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసింది. 2022 ఖరీఫ్ క్లెయిములు 2023 మధ్యలో రైతులకు వచ్చాయి. అవీ అరకొరగానే. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఫసల్ కోసం చెల్లించిన ప్రీమియంలో పట్టుమని సగం కూడా రైతులకు ఇన్సూరెన్స్ అందలేదు. వాతావరణ ఆధారిత బీమా సొమ్మును రాష్ట్ర ప్రభుత్వం తానే కొంతవరకు చెల్లించింది. 2022-23 రబీలో పంటలు నష్టపోయినా రైతులకు ఇప్పటి వరకు ఫసల్, వాతావరణ బీమా ఇవ్వలేదు.

కేంద్రం నిధుల విదిలింపు

2023-24 కు వచ్చేసరికి ఫసల్, వాతావరణ రెండింటినీ కంపెనీలకు అప్పగించారు. ఖరీఫ్‌లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇన్సూరెన్స్ కంపెనీలకు సుమారు రూ.557 కోట్ల ప్రీమియం కట్టాయి. రాష్ట్ర ప్రభుత్వం 390 కోట్లు చెల్లించగా, అంతే మొత్తంలో కేంద్రం చెల్లించాల్సి ఉండగా 95 కోట్లే బదిలీ చేసింది. అదనంగా రాష్ట్రం రైతులు చెల్లించాల్సిన ప్రీమియం 71 కోట్లు కూడా చెల్లించింది. ఉచిత బీమా అన్నందున రైతుల వాటా ప్రీమియం కూడా జమ చేసింది. సీజన్‌లో 50 లక్షల ఎకరాలకు ఫసల్ బీమా చేశారు. ఖరీఫ్‌లో వాతావరణ బీమాకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ.628 కోట్లు కట్టాయి. రాష్ట్రం 428 కోట్లు కట్టగా కేంద్రం 179 కోట్లు ఇచ్చింది. అదనంగా రైతుల తరపున రాష్ట్ర సర్కారు 28 కోట్లు కట్టింది. వాతావరణ బీమా 18 లక్షల ఎకరాలకు చేశారు. ఖరీఫ్‌లో కరువు, మిచౌంగ్ తుపాను వలన లక్షల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి. ప్రభుత్వం 103 కరువు మండలాలను ప్రకటించి వాటిలో జరిగిన పంట నష్టాలకు ఇన్‌పుట్ సబ్సిడీ మార్చిలో ఇచ్చింది. బీమాకు కరువు మండలాల ప్రకటనలతో సంబంధం లేదు. ఇ-క్రాప్‌లో ఎక్కితే సరిపోతుంది. ఆ లెక్కన ఇన్‌పుట్ కంటే ఎక్కువ విస్తీర్ణానికి బీమా రావాలి. మిచౌంగ్ తుపాన్‌కూ పంటలు దెబ్బతిన్నాయి. కానీ ఖరీఫ్ బీమా ఎప్పుడొస్తుందో ఎవ్వరూ చెప్పలేకపోతున్నారు. జూన్‌లో వస్తుందని అంచనా వేస్తున్నారు. 2023-24 రబీలో ఇంకా బీమా ప్రక్రియ ప్రారంభం కాలేదు. 2022-23 రబీ బీమాయే లేదు. ప్రస్తుత రబీ బీమా ఎప్పటికి వస్తుందో, అసలు వస్తుందో లేదో అనుమానమే. కాగా రబీలోనూ రాష్ట్ర వ్యాప్తంగా తీవ్ర కరువుంది. ప్రభుత్వం 87 మండలాలనే ప్రకటించింది.



రాష్ట్ర వ్యాప్తంగా వడగాడ్పులు

- అప్రమత్తంగా ఉండండి
- విపత్తుల నిర్వహణ సంస్థ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో గత రెండు రోజులుగా ఎండలు తీవ్రమయ్యాయి. గురువారం పలు జిల్లాల్లో 42 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రాయలసీమ ప్రాంతంలోని అనంతపురం, కడప, కర్నూలు జిల్లాల్లో అత్యధికంగా 42 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అలాగే విజయ వాడ, రాజమండ్రి, ఏలూరు జిల్లాల్లోనూ అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రాష్ట్ర వ్యాప్తంగా పగటిపూట ఉష్ణోగ్రతలు గణనీయంగా పెరుగు తుండటంతో రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఎమ్‌డి రోణంకి కూర్మానాథ్ ఒక ప్రకటన విడుదల చేశారు. ఎండ తీవ్రతతోపాటు వడగాడ్పుల ప్రభావం ఎక్కువగా వుంటుందని, ప్రజలు అప్రమ త్తంగా వుండాలని సూచించారు. రాష్ట్రంలోని 42 మండలాల్లో శుక్రవారం, మరో 44 మండలాల్లో శనివారం వడగాడ్పులు వీచే అవకాశం ఉందని తెలిపారు. వైఎస్‌ఆర్ కడప జిల్లాలోని 18 మండ లాలు, నంద్యాల 8, పార్వతీపురం మన్యం 8, ఎన్‌టిఆర్ జిల్లా ఆరు, గుంటూరు, పల్నాడు జిల్లాల్లో ఒక్కో మండలంలో వడగాడ్పులు వీచే అవకాశం వుందన్నారు. ప్రధానంగా వృద్ధులు, చిన్న పిల్లలు, మహిళలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఆరుగురు దుర్మరణం

- వివాహ వేడుకకు వెళ్లి వస్తుండగా కారు పల్టీ కొట్టి ముగ్గురు మృతి
- ద్విచక్ర వాహనాలు ఢీకొని మరో ముగ్గురు మరణం 2

వృథా.. వృథా

- ప్రపంచంలో ఐదో వంతు ఆహారం వ్యర్థం
- యుఎన్ఇపి ఆహార వ్యర్థాల సూచిక నివేదిక 2024 7

రూ.56 లక్షలు స్వాధీనం

3

సరిహద్దుల నుంచి

బలగాల పూర్తి ఉపసంహారణ

- ఇతర సమస్యలపైనా దృష్టి
- భారత్, చైనా వర్కింగ్ గ్రూప్ సమావేశంలో అంగీకారం



న్యూఢిల్లీ : వాస్తవాధీన రేఖ (ఎల్‌ఎసి) వద్ద భద్రతా బలగాలను పూర్తిగా ఉపసంహరించుకోవడం, ఇతర అంశాలను పరిష్కరించుకోవడంపై ప్రస్తుతం భారత్, చైనా దృష్టి సారించాయి. బుధవారం నాడు బీజింగ్‌లో జరిగిన ఈ రెండు దేశాల వర్కింగ్ గ్రూపు మెకానిజం 29వ సమావేశంలో ఈ మేరకు అంగీకారం కుదిరింది. కేంద్ర విదేశాంగ శాఖ గురువారం నాడిక్కడ ఈమేరకు ఒక ప్రకటన విడుదలజేస్తూ, భారత్-చైనా సరిహద్దు ప్రాంతాల పశ్చిమ సెక్టార్‌లోని ఎస్ఎసి వెంబడి బలగాలను పూర్తిగా వెనక్కి తీసుకోవడం, మిగిలిన సమస్యలపై ఎలా ముందుకెళ్లాలనే దానిపై ఇరు దేశాలు పరస్పరం అభిప్రాయాలు తెలియజేసుకున్నట్లు తెలియజేసింది. ఈ సమావేశంలో పాల్గొన్న భారత బృందానికి కేంద్ర విదేశాంగ శాఖ సంయుక్త కార్యదర్శి (తూర్పు ఆసియా) నేతృత్వం వహించగా, చైనా బృందానికి ఆ దేశ విదేశాంగ శాఖకు చెందిన డైరక్టర్ జనరల్ (సరిహద్దు, సముద్రాల విభాగం) నాయకత్వం వహించారని ప్రకటన తెలిపింది. 'రాబోయే కాలంలో, దౌత్య, సైనిక మార్గాల్లో క్రమం తప్పకుండా సంప్రదింపులు కొనసాగించడానికి, ఇప్పటికే కుదిరిన ద్వైపాక్షిక ఒప్పందాలు, ప్రోటోకాల్‌లకు అనుగుణంగా సరిహద్దు ప్రాంతాల్లో శాంతి, సామరస్యం కొనసాగించాల్సిన ఆవశ్యకతను ఇరు దేశాలు గుర్తించాయి' అని ప్రకటన తెలిపింది. భారత్-చైనా సరిహద్దు వ్యవహారాలపై కన్సల్టేషన్ అండ్ కోఆర్డినేషన్ కోసం వర్కింగ్ మెకానిజం 28వ సమావేశం గతేడాది నవంబర్ 30న జరిగింది.

ఎన్నికల బహిష్కరణ

- కుకీ సంఘాల నిర్ణయం

కోల్‌కతా : త్వరలో జరిగే లోక్‌సభ ఎన్నికలను బహిష్కరించాలని పలు కుకీ యువజన, మహిళా సంఘాలు నిర్ణయించాయి. మణిపూర్‌లో సుమారు ఏడాదిగా తమపై సాగుతున్న హింసాకాండకు వ్యతిరేకంగా ఈ నిర్ణయానికి వచ్చినట్లు ఒక ప్రకటన విడుదల చేశాయి. హింసాకాండ తీవ్రంగా సాగుతున్నా.. హింసాకాండకు పాల్పడుతున్న వారిని శిక్షించడంలో మణిపూర్ ప్రభుత్వం విఫలమైందని విమర్శించాయి. విధ్వంసం, హింసలో బాధితులుగా మారిన కుకీలకు తగిన మద్దతు లభించడం లేదని ఆవేదన వ్యక్తం చేశాయి. ఎన్నికల బహిష్కరణ 'కుకీల దుస్థితిపై తక్షణమే దృష్టి పెట్టాలనే విజ్ఞప్తిగా భావించాలి' అని సంఘాలు పేర్కొన్నాయి. 'మాకు న్యాయం కోసం, మా హక్కుల పరిరక్షణ కోసం, మా బాధలు, ఉనికి గుర్తించడం కోసం ఈ పిలుపునిస్తున్నాం' అని ఆ సంఘాలు తెలిపాయి. సమస్యల పరిష్కారానికి కేంద్రంతో అర్థవంతమైన చర్చల కోసం సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నాయి. 'మైతీల దురాగతాలపై ఎన్ఐఎ లేదా సిబిఐ విచారణ లేదు. దాదాపు 360 కుకీల ప్రార్థనా మందిరాలను, ఏడు వేలకు పైగా ఇళ్లను తగలబెట్టారు' అని ప్రకటన తెలిపింది. మా గ్రామాలపై మైతి దాడుల నుంచి ఎవరూ రక్షించలేరు' అని కుకీ సంఘాలు పేర్కొన్నాయి.

అభివృద్ధి - సంక్షేమం..

చేసి చూపించాం

అధర్మంపై ధర్మ యుద్ధానికి సిద్ధం కండి ● నంద్యాల సభలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి



సభలో ప్రజలకు అభివాదం చేస్తున్న సిఎం జగన్

ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి

ఐదేళ్ల తమ పాలనలో ప్రతి గ్రామంలోనూ అభివృద్ధి, సంక్షేమం చేసి చూపించామని రాష్ట్ర ముఖ్యమంత్రి, వైసిపి అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అన్నారు. 'మేమంతా సిద్ధం' పేరుతో ఆయన చేపట్టిన బస్సు యాత్ర రెండో రోజు నంద్యాల జిల్లాలో సాగింది. నంద్యాల జిల్లా ఆళ్లగడ్డలో గురువారం బస్సు యాత్ర ప్రారంభమైంది. సిరివెళ్ళ మండలం ఎర్రగుంట్లలో గ్రామస్తులతో జగన్ ముఖాముఖి నిర్వహించారు. గ్రామానికి వైసిపి ప్రభుత్వం చేసిన అభివృద్ధి గురించి ప్రజలకు వివరించారు. అనంతరం యాత్ర నంద్యాలకు చేరుకుంది. నంద్యాల డిగ్రీ కళాశాల మైదానంలో నిర్వహించిన బహిరంగ సభలో జగన్ మాట్లాడుతూ . ప్రతి నెలా ఒకటో తేదీనే పెన్షన్ ఇస్తున్నామని, లంచాలు, వివక్ష లేకుండా పాలన అందిస్తున్నామని తెలిపారు. నాడు-నేడుతో ప్రభుత్వ స్కూళ్ల రూపురేఖలు మార్చామని గుర్తు చేశారు. ఇన్ని చేస్తున్న ఒక్క జగన్‌ను ఎదుర్కునేందుకు ఎన్నో కుట్రలు సాగుతున్నాయ చెప్పారు. కుట్రలు, కుతంత్రాలను ఎదుర్కొనేందుకు అందరూ సిద్ధం కావాలన్నారు. 175కు 175 అసెంబ్లీ స్థానాలు, 25కు 25 ఎంపీ స్థానాలు సాధించి డబుల్ సెంచరీ సర్కారును ఏర్పాటు చేయాలన్నారు. అధర్మంపై ధర్మ యుద్ధానికి సిద్ధం కావాల్సిన సమయం వచ్చిందన్నారు. బాబు మోసాలకు చివరి ఎన్నికలు మిగతా 2లో

దళిత సంక్షేమం ఎక్కడ?

- 27 పథకాలు రద్దుచేశారు
- ఏడు ప్రశ్నలకు సమాధానం చెప్పాలని జగన్‌కు సవాల్
- అనంత ప్రజాగళం సభలో నారా చంద్రబాబునాయుడు



రాప్తాడు బహిరంగ సభలో ప్రసంగిస్తున్న నారా చంద్రబాబు నాయుడు

ప్రజాశక్తి - అనంతపురం ప్రతినిధి

రాష్ట్రంలో దళిత సంక్షేమం ఎక్కడుందని తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబునాయుడు ప్రశ్నించారు. . మదనపల్లి నుంచి ప్రత్యేక హెలికాప్టర్‌లో గురువారం అనంతపురం విచ్చేసిన చంద్రబాబు మొదట రాప్తాడు నియోజకవర్గం రాప్తాడు మండల కేంద్రంలో జరిగిన ప్రజాగళం సభలో పాల్గొన్నారు. అనంతరం శింగనమల నియోజకవర్గం బుక్కరాయసముద్రం మండల కేంద్రంలో, కదిరి పట్టణంలో నిర్వహించిన సభల్లో పాల్గొన్నారు. ఆయా సభల్లో చంద్రబాబు ప్రసంగిస్తూ పెద్ద ఎత్తున సంక్షేమ పథకాలను అమలు చేశానని చెప్పుకుంటున్న జగన్‌మోహన్‌రెడ్డి దళితుల సంక్షేమానిన విస్మరించారని చెప్పారు. 27 రకాల దళిత సంక్షేమ పథకాలను జగన్ రద్దు చేశారని అన్నారు. ఎస్‌సి సబ్ ప్లాన్ నిధులను సైతం దారి మళ్లించారని మండిపడ్డారు. ఆరు వేల మంది దళితులపై తప్పుడు కేసులు బనాయించారని, 180 మంది దళితులు వైసిపి హయాంలో హత్యకు గురయ్యారన్నారు. 90 శాతం హామీలు నెరవేర్చానని చెబుతున్న జగన్.. తన ఏడు ప్రశ్నలకు సమాధానం చెప్పాలని సవాల్ విసిరారు. ప్రత్యేక హోదా, సిపిఎస్ రద్దు, మద్య నిషేధం, ఏటా జాబ్ క్యాలెండర్, మెగా డిఎస్‌సి, కరెంటు ఛార్జీల తగ్గింపు, పోలవరం పూర్తి తదితర హామీలను ఎందుకు నెరవేర్చలేదని ప్రశ్నించారు. తాము అధికారంలోకి వస్తే గోదావరి జలాలను రాయలసీమకు తీసుకువస్తామని చెప్పారు. వైఎస్ వివేకాను ఎవరో హత్య చేసి తనపై బనాయించే ప్రయత్నం చేస్తున్నారని సిఎం జగన్ మాయమాటలు చెబుతున్నారని ఎద్దేవా చేశారు. పెనుకొండ వద్ద తమ హయాంలో కియా పరిశ్రమను తీసుకొస్తే... జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో జాకీ పరిశ్రమ పక్క రాష్ట్రానికి తరలివెళ్లిందని చెప్పారు. తాము అధికారంలోకి వస్తే తొలి సంతకం మెగా డిఎస్‌సిపైనే చేయనున్నట్టు హామీనిచ్చారు. సాగునీటి ప్రాజెక్టులన్నింటినీ మిగతా 2లో

ఆలిండియా పోలీస్ బ్యాడ్మింటన్‌లో 2 సిల్వర్ మెడల్స్

- అభినంధించిన డిజిపి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఇటీవల హైదరాబాద్‌లో నిర్వహించిన 16వ ఆలిండియా పోలీస్ బ్యాడ్మింటన్ ఛాంపియన్షిప్ 2023-2024 పోటీల్లో రాష్ట్ర పోలీసులు రెండు సిల్వర్ పథకాలను సాధించడం పట్ల డిజిపి కెవి రాజేంద్రనాథ్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. మార్చి 17 నుంచి 23 వరకు హైదరాబాద్‌లోని గచ్చిబౌలి పుల్లెల గోపిచంద్ అకాడమీలో నిర్వహించిన 16వ ఆలిండియా పోలీస్ బ్యాడ్మింటన్ ఛాంపియన్షిప్ 2023-2024 పోటీల్లో 18 రాష్ట్రాలు, 2 కేంద్రపాలిత రాష్ట్రాలు, కేంద్ర బలగాలకు చెందిన మొత్తం 499 మంది పోలీస్ క్రీడాకారులు పాల్గొన్నారు. డిఐజి రాహుల్ దేవ్ శర్మ నేతృత్వంలో పాల్గొన్న రాష్ట్ర పోలీసుల్లో సిఐడి డిఎస్‌పి ఎస్‌బివి సుధాకర్, సిఐ డిఎస్‌పి పివి మారుతిరావు సిల్వర్ పథకాలు సాధించారు. ఈ పోటీల్లో రాణించిన ఇద్దరినీ గురువారం మంగళగిరిలోని పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో డిజిపి కెవి రాజేంద్రనాథ్‌రెడ్డి ప్రత్యేకంగా అభినంధించారు.

ఎపి ఆర్‌సెట్ దరఖాస్తు గడువు పొడిగింపు

ప్రజాశక్తి - ఎస్‌వియు క్యాంపస్

ఎపి ఆర్‌సెట్ 2023-24 దరఖాస్తు గడువును పొడిగించారు. రూ. రెండు వేల అపరాధ రుసుంతో ఏప్రిల్ మూడు వరకూ అవకాశం కల్పిస్తున్నట్టు ఎపి ఆర్‌సెట్ 2023- 24 కన్వీనర్ ప్రొఫెసర్ బి. దేవప్రసాద రాజు తెలిపారు. రూ ఐదు వేల అపరాధ రుసుంతో ఏప్రిల్ ఆరు వరకూ దరఖాస్తుకు గడువు ఉందన్నారు. విద్యార్థుల అభ్యర్ధన మేరకూ, రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ హేమచంద్రారెడ్డి సూచన మేరకు దరఖాస్తు గడువు పొడిగించినట్లు చెప్పారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ప్రొఫెసర్ దేవప్రసాద రాజు కోరారు.



చింతలపూడిలో 563 సైకిళ్ళు స్వాధీనం

ప్రజాశక్తి - పొన్నూరు రూరల్ (గుంటూరు జిల్లా)

గుంటూరు జిల్లా పొన్నూరు మండలం చింతలపూడి గ్రామంలోని ఓ రైస్ మిల్లులో గురువారం సాయంత్రం ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు తెలుగుదేశం అభ్యర్థి దూళిపాళ్ల నరేంద్ర కుమార్ స్టిక్కర్లు అంటించి ఉన్న 563 సైకిళ్లను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. పొన్నూరు ఎంపిడిఒ రత్నజ్యోతి సిబ్బందితో వెళ్లి వివరాలు సేకరించారు. తెలుగుదేశం పార్టీ నాయకులు సైకిళ్లను పంపిణీ చేసేందుకు సిద్ధంగా ఉంచినట్లు సమాచారం అందడంతో ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు రైస్ మిల్లులో తనిఖీలు చేపట్టి పంపిణీకి సిద్ధంగా ఉంచిన సైకిళ్లనున స్వాధీనం చేసుకున్నారు. తెనాలి డిఎస్‌పి రమేష్ పర్యవేక్షణలో పొన్నూరు రూరల్ ఇంచార్జ్ ఎస్ఐ మహేష్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దళిత సంక్షేమం ఎక్కడ?

మొదటిపేజి తరువాయి

అటకెక్కించారని దుయ్యబట్టారు. ఈ ఐదేళ్ల పాలనలో సాగునీటి ప్రాజెక్టుల కోసం రూ. రెండు వేల కోట్లు కూడా ఖర్చు పెట్టలేదని విమర్శించారు. మరోవైపు ప్రజలపై విపరీతమైన భారాలు మోపారన్నారు. తొమ్మిది సార్లు విద్యుత్ ఛార్జీలు పెంచారని చెప్పారు. తాము అధికారంలోకి వస్తే బిసిలకు 50 ఏళ్లకే ఫించను సౌకర్యం కల్పిస్తానని హామీ ఇచ్చారు. బిసిలకు రక్షణ చట్టం తీసుకొస్తానని హామీనిచ్చారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఆరుగురు దుర్మరణం

- వివాహ వేడుకకు వెళ్లి వస్తుండగా కారు పల్టీ కొట్టి ముగ్గురు
- ద్విచక్ర వాహనాలు ఢీకొని మరో ముగ్గురు మృతి

ప్రజాశక్తి-యంత్రాంగం

ప్రకాశం, విజయనగరం జిల్లాల్లో గురువారం జరిగిన రెండు ఘోర రోడ్డు ప్రమాదాల్లో ఆరుగురు దుర్మరణం పాలయ్యారు. డ్రైవర్ నిద్రమత్తు కారణంగా కారు బోల్తా కొట్టిన ప్రమాదంలో ముగ్గురు మృత్యువాత పడగా.. రెండు ద్విచక్రవాహనలు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో మరో ముగ్గురు మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..

నెల్లూరు జిల్లా కందుకూరు పట్టణం గుర్రంవారిపాలెంకు చెందిన రాయని అరుణ(50) కుమార్తె వివాహం తెలంగాణ రాష్ట్రం పాల్వంచకు చెందిన వ్యక్తితో బుధవారం రాత్రి భద్రాచలంలో జరిగింది. కుటుంబ సభ్యులందరూ పెళ్లి వేడుకలో పాల్గొన్నారు. వివాహం అనంతరం పెళ్లి కుమార్తె తల్లి అరుణ, తన బంధువులతో కలిసి సొంతూరుకు కారులో తిరుగు ప్రయాణమయ్యారు. వీరు ప్రయాణిస్తున్న కారు ప్రకాశం జిల్లా టంగుటూరు మండలం తూర్పు నాయుడుపాలెం జాతీయ రహదారి ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్దకు చేరుకోగానే డ్రైవర్ నిద్రమత్తులోకి జారుకున్నారు. దీంతో కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టి ఫ్లైఓవర్ నుండి కింద పడింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న అరుణ, తల్లపనేని దివ్య (28), గుళ్ళాపల్లి శ్రావణి (22) అక్కడికక్కడే మృతి చెందారు. పెళ్లి కుమార్తె సోదరుడు రాయని వేణు, డ్రైవర్ తల్లపనేని వినోద్, ఆయన కుమారుడు అభిలాష్ తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు



ఫ్లై ఓవర్ పై నుండి బోల్తా కొట్టడంతో నుజ్జునుజ్జయిన కారు

ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. క్షతగాత్రులను మెరుగైన వైద్యం కోసం ప్రయివేట్ ఆస్పత్రికి తరలించారు. డ్రైవర్ నిద్రమత్తు వల్లే ఈ రోడ్డు ప్రమాదం జరిగిందని సింగరాయకొండ సిఐ దాచేపల్లి రంగనాథ్ తెలిపారు.

విజయనగరం జిల్లా రామభద్రపురం మండలంలోని కొట్టక్కి బస్సు షెల్టర్ సమీపాన జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు యువకులు దుర్మరణం చెందారు. ఎదురెదురుగా వస్తున్న రెండు బైకులు బలంగా ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందారు. మరో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. మృతుల్లో సాలూరు పట్టణంలోని గొల్లవీధికి చెందిన గొంటుబోయన యశోద కృష్ణ (22), గొట్టేడ శ్రీను (45), రామభద్రపురం మండలం జన్నివలసకు చెందిన జొన్నాడ పురుషోత్తం (26)గా గుర్తించారు. తీవ్రంగా గాయపడిన జన్నివలసకు చెందిన జి.రామప్రసాద్, జి.శరత్‌గణేష్‌ను చికిత్స నిమిత్తం విజయనగరం సర్వజన ఆస్పత్రికి తరలించారు. రామభద్రపురం ఎస్ఐ జ్ఞానప్రసాద్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.



ఐకార్-ఐఐఆర్‌ఆర్‌కు రూ.4.5 కోట్ల మద్దతు

- మంచికళలు ఎన్‌జిఒకు సాయం
- అందించిన ఎస్‌బిఐ ఎమ్‌డి చల్లా శ్రీనివాసులు

హైదరాబాద్ : స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తన కార్పొరేట్ సామాజిక బాధ్యత (సిఎస్‌ఆర్)ను కొనసాగిస్తోంది. బుధవారం హైదరాబాద్‌కు అధికారిక పర్యటనకు వచ్చిన ఎస్‌బిఐ మేనేజింగ్ డైరెక్టర్ (ఇంటర్నేషనల్ బ్యాంకింగ్, గ్లోబల్ మార్కెట్స్ అండ్ టెక్నాలజీ) చల్లా శ్రీనివాసులు శెట్టి పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కోటిలోని లోకల్ హెడ్ ఆఫీసులో ఐకార్-ఐఐఆర్‌ఆర్‌తో జరిగిన ఎస్‌బిఐ ఫౌండేషన్ ఒప్పందానికి హాజరయ్యారు. సికింద్రాబాద్‌లోని మారేడుపల్లిలో అనాథ పిల్లలకు ఆశ్రయం కల్పించే 'మంచికళలు' ఎన్‌జిఒకు టాటా వింగర్ మినీబస్‌ను అందించారు. మంచికళలు ఫౌండర్ ప్రెసిడెంట్ శరత్ కుమార్ పుప్పలకు వాహన తాళం చెవులను బహుకరించారు. "శరత్ కుమార్ సేవలు ప్రశంసనీయం. కార్పొరేట్ సామాజిక సేవ కోసం చెక్కులు రాయడం సులభమే.. కానీ సరైనా ఎన్‌జిఒను గుర్తించి సాయం చేయడమే క్లిష్టమైన అంశం. ఎస్‌బిఐ ఫౌండేషన్ ద్వారా అడవి ప్రాంతాల్లోని 112 జిల్లాల్లో మొబైల్ హాస్పిటళ్లను ఏర్పాటు చేయాలనేది మా సంకల్పం." అని సిఎస్ శెట్టి అన్నారు. ఐకార్-ఐఐఆర్‌ఆర్‌కు ప్రొమోషన్ ఆఫ్ డైరెక్ట్ సీడెడ్ రైస్ (డిఎస్‌ఆర్) కోసం ఏకంగా రూ.4.5 కోట్ల విలువ చేసే చెక్కును ఆయన అందజేశారు. ఈ కార్యక్రమానికి ఎస్‌బిఐ హైదరాబాద్ సర్కిల్ సిజిఎం రాజేష్ కుమార్, ఎస్‌బిఐ ఫౌండేషన్ ఎండి సంజయ్ ప్రకాష్, ఉన్నతాధికారులు మంజూ శర్మ, దేబాశిష్ మిశ్రా, విద్యా రాజా, వి ప్రేమ్‌జీ తదితరులు హాజరయ్యారు.

నాన్ టీచింగ్ స్టాఫ్‌కు ప్రిన్సిపల్స్‌గా ఎలా ప్రమోషన్ కల్పిస్తారు?

- హైకోర్టు ఆగ్రహం

ప్రజాశక్తి-అమరావతి

ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో నాన్ టీచింగ్ స్టాఫ్ (ఫిజికల్ డైరెక్టర్/లైబ్రేరియన్) లోని వారిని ప్రిన్సిపల్స్‌గా ప్రమోషన్‌కు వీలు కల్పిస్తూ జిఓ జారీ చేసిన ప్రభుత్వంపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. టీచింగ్‌లో అనుభవం లేని వారిని ప్రన్సిపల్స్‌గా ఎలా నియమిస్తారని ప్రశ్నించింది. ప్రభుత్వం 2021 డిసెంబరు 8న జారీ చేసిన జిఓ 76పై విస్మయం వ్యక్తం చేసింది. జిఓ జారీ చేసిన పాఠశాల విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీని జైలుకు పంపుతామని హెచ్చరించింది. ఏప్రిల్ ఒకటిన జరిగే విచారణకు ఆయన హాజరై వివరణ ఇవ్వాలంది. లారీలు నడిపేవాళ్లకు విమానాలు నడింపేందుకు అవకాశం ఇస్తే ఎలా ఉంటుందో, ఇదీ అలాగే ఉందని ఘాటు వ్యాఖ్య చేసింది. జూనియర్ గవర్నర్‌మెంట్ కాలేజీల్లో 197 మంది జూనియర్ లెక్చరర్లకు ప్రిన్సిపల్స్‌గా ప్రమోషన్ కల్పిస్తూ ఇంటర్ విద్యాశాఖ కమిషనరు జారీ చేసిన ప్రొసీడింగ్స్‌ను డివిజన్ బెంచ్ సస్పెండ్ చేసింది. ఈ మేరకు జస్టిస్ జి నరేందర్, జస్టిస్ హరినాథ్‌తో కూడిన డివిజన్ బెంచ్ గురువారం ఆదేశాలిచ్చింది. 197 మంది లెక్చరర్లకు ప్రిన్సిపల్స్‌గా ప్రమోషన్స్ కల్పిస్తూ వెలువడిన ఉత్తర్వులను రద్దు చేయాలంటూ ప్రభుత్వ లెక్చరర్స్ - లైబ్రెరీ సైన్స్ అసోసియేషన్ అధ్యక్షులు సంజీవరావు ఇతరులు హైకోర్టును ఆశ్రయించారు.

పోలవరం వైసిపి అభ్యర్థిని ఎస్‌టి కాదు

- హైకోర్టులో పిటిషన్

ప్రజాశక్తి-అమరావతి

వైసిపి పోలవరం (ఎస్‌టి) అభ్యర్థి తెల్లం రాజ్యలక్ష్మి ఎస్‌టి కాదంటూ దాఖలైన పిటిషన్‌ను హైకోర్టు గురువారం విచారణ జరిపింది. రాజ్యలక్ష్మి, గిరిజన సంక్షేమశాఖ ముఖ్యకార్యదర్శి, ఏలూరు జిల్లా కలెక్టరు, ఆర్‌డిఒ, బుట్టాయిగూడెం తహశీల్దారుకు నోటీసులు జారీ చేసింది. కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. విచారణను ఏప్రిల్ 25కు వాయిదా వేస్తూ జస్టిస్ బి కృష్ణమోహన్ ఆదేశాలు జారీ చేశారు. రాజ్యలక్ష్మి ఎస్‌టి కాదంటూ మడకం వెంకటేశ్వరరావు పిటిషన్ దాఖలు చేశారు. ఆమె బిసి అని, తప్పుడు ఎస్‌టి పత్రాన్ని పొందారని పిటిషనర్ వాదన. బుట్టాయిగూడెం తహశీల్దారు తప్పుడు సర్టిఫికెట్ ఇచ్చారన్నారు.

ఫోన్ ట్యాపింగ్ కేసులో బిగుస్తున్న ఉచ్చు

- పోలీసుల అదుపులో మాజీ డిసిపి రాధాకిషన్‌రావు, సిఐ గట్టుమల్లులను బుజంగరావు, తిరుపతన్నలను 5 రోజుల పాటు కస్టడీకిచ్చిన కోర్టు
- ప్రణీత్‌రావు కస్టడీకి నిరాకరణ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో సంచలనం రేపిన ఫోన్‌ట్యాపింగ్ కేసులో నిందితులైన హైదరాబాద్ మాజీ టాస్క్‌ఫోర్స్ డిసిపి రాధాకిషన్‌రావు, రాచకొండ కమిషనరేట్‌లో ఇన్‌స్పెక్టర్ గట్టుమల్లులను ప్రత్యేక దర్యాప్తు అధికారులు గురువారం అదుపులోకి తీసుకొని ప్రశ్నిస్తున్నారు. ఈ కేసు వెలుగు చూడగానే.. మాజీ డిసిపి రాధాకిషన్‌రావు అమెరికాకు వెళ్లిపోయిన విషయం తెలిసిందే. అయితే, రాధాకిషన్‌రావు ఆచూకీ కోసం పంజాగుట్ట పోలీసులు లుకౌట్ నోటీసులను జారీ చేసిన నేపథ్యంలో బుధవారం రాత్రి నాటకీయంగా అమెరికా నుంచి తన నివాసానికి చేరుకున్నారు. ఈ విషయమై సమాచారం అందుకున్న స్పెషల్ టీమ్ పోలీసులు రాత్రి రాధాకిషన్‌రావు నివాసానికి వెళ్లి విచారణకు హాజరు కావాలని నోటీసులిచ్చారు. అదే సమయంలో మరో అనుమానితుడు ఇన్‌స్పెక్టర్ గట్టుమల్లు నివాసానికి వెళ్లి విచారణకు హాజరు కావాలని అతనికి కూడా నోటీసులిచ్చారు.

ఈ నేపథ్యంలో ఈ ఇద్దరు అధికారులు గురువారం ఉదయం బంజారాహిల్స్‌లోని స్పెషల్ టీం కార్యాలయానికి చేరుకున్నారు. దాంతో వారిని విచారణ నిమిత్తం అదుపులోకి తీసుకున్నట్టు వారికి దర్యాప్తు అధికారులు ప్రకటించినట్టు సమాచారం. అలాగే, ప్రణీత్‌రావు డ్రైవర్‌ను కూడా స్పెషల్ టీం అదుపులోకి తీసుకొని ప్రశ్నిస్తున్నది. ముఖ్యంగా, మాజీ ఐజీ ప్రభాకర్‌రావుతో పాటు రాధాకిషన్‌రావు, గట్టుమల్లులు సైతం ప్రతిపక్ష రాజకీయ ప్రముఖులతో పాటు ప్రముఖ వ్యాపారులకు సంబంధించిన ఫోన్లను ట్యాపింగ్ చేసి బెదిరింపు చర్యలు, డబ్బులు దండుకోవటం వంటి చర్యలకు పాల్పడినట్టు ఆరోపణలున్నాయి. దీంతో, ఆ దిశగానే స్పెషల్ టీం అధికారులు ఈ ఇద్దరు ఆఫీసర్లను విచారిస్తున్నట్టు సమాచారం. తమ వద్ద అప్పటి వరకు సేకరించిన కొన్ని ఆధారాలను ముందు పెట్టి మరీ ఈ ఇద్దరు అధికారులను స్పెషల్ టీం ఆఫీసర్లు ప్రశ్నించినట్టు తెలుస్తున్నది.

ముఖ్యంగా, ప్రణీత్‌రావు ఇచ్చిన అనేక ఆధారాలు.. ఈ ఇద్దరు అధికారుల పాత్ర ఉన్నట్టు కూడా రూఢీ అవుతున్నట్టు స్పెషల్ టీమ్ అధికారులు భావిస్తున్నారు. అలాగే, ఫోన్‌ట్యాపింగ్‌కు సంబంధించిన సాంకేతిక పరికరాలను ధ్వంసం చేయడంలోనూ వీరిచ్చిన ఆదేశాలు కూడా పని చేశాయనీ, అదే సమయంలో ప్రణీత్‌రావు డ్రైవర్ కూడా ఈ ఆధారాలను ధ్వంసం చేయటంలో కీలక పాత్ర వహించారని అధికారులు అనుమానిస్తున్నారు. మొత్తమ్మీద, ప్రభాకర్‌రావును విచారిస్తే మరిన్ని ఆధారాలు ఫోన్‌ట్యాపింగ్‌కు సంబంధించి బయటపడ్తాయని స్పెషల్ టీం భావిస్తున్నది.

ఇప్పటికే అరెస్టయిన ఇద్దరు అదనపు ఎస్‌పిలు బుజంగరావు, తిరుపతన్న, డిఎస్‌పి ప్రణీత్‌రావులలో ఇద్దరు అదనపు ఎస్‌పిలను మాత్రమే విచారించటానికి నాంపల్లి కోర్టు గురువారం అనుమతించింది. వారం పాటు వీరిని కస్టడీకి ఇవ్వాలని పంజాగుట్ట పోలీసులు కోరగా.. కేవలం ఐదు రోజులు మాత్రమే కస్టడీకిస్తూ న్యాయమూర్తి ఆదేశాలు జారీ చేశారు. అయితే, ప్రణీత్‌రావును కస్టడీకివ్వటానికి మాత్రం కోర్టు నిరాకరించింది. వీరిని శుక్రవారం నుంచి ఏప్రిల్ 2 వరకు పంజాగుట్ట స్పెషల్ టీం పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించనున్నారు. ఇప్పటికే అదుపులో ఉన్న రాధాకిషన్‌రావు, గట్టుమల్లులతో పాటు ఈ ఇద్దరు అదనపు ఎస్‌పిలను కూడా కలిపి విచారించే అవకాశమున్నదని తెలుస్తున్నది. మరోవైపు, ఈ కేసులో మొదటి ముద్దాయిగా చేర్చబడిన ప్రభాకర్‌రావును ఏ విధంగా అమెరికా నుంచి ఇక్కడకు తీసుకురావాలనే విషయమై సీనియర్ పోలీసు అధికారులు తర్జన, భర్జన పడుతున్నట్టు తెలుస్తున్నది. అవసరమైతే ఇంటర్‌పోల్ సాయాన్ని కూడా తీసుకోవాలని యోచిస్తున్నట్టు సమాచారం.

స్టీల్ ప్లాంట్‌ను నష్టాల్లోకి నెట్టే కుట్ర

- విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ

ప్రజాశక్తి-ఉక్కునగరం (విశాఖపట్నం)



విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను నష్టాల్లోకి నెట్టేందుకే కేంద్ర ప్రభుత్వం సొంత గనులు కేటాయించడంలేదని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ కో-కన్వీనర్ జె.అయోధ్యరాం అన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా పోరాట కమిటీ ఆధ్వర్యాన కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు గురువారం నాటికి 1141వ రోజుకు చేరాయి. దీక్షలో స్టీల్‌ప్లాంట్ ట్రాఫిక్, ఆర్‌ఎండి, కన్‌స్ట్రక్షన్ విభాగాల కార్మికులు కూర్చున్నారు. ఈ సందర్భంగా అయోధ్యరామ్ మాట్లాడుతూ.. కార్మికులను మానసికంగా కృంగతీయటానికి కూడా కేంద్రంలోని బిజెపి అనేక కుట్రలు పన్నుతోందని, ఈ చర్యలకు భయపడేది లేదని స్పష్టం చేశారు. విశాఖ ఉక్కు పరిరక్షణకు కార్మికులు చేస్తున్న ఈ పోరాటం చరిత్రలో నిలిచిపోతుందని తెలిపారు. పోరాట కమిటీ చైర్మన్లు డి.ఆదినారాయణ, ఎం.రాజశేఖర్ మాట్లాడుతూ.. ఉద్యోగులు, నిర్వాసితులు అంతా కలిసి ఐక్యంగా పోరాటంలో పాల్గొనాలని కోరారు. స్టీల్‌ప్లాంట్‌ను కాపాడే వారికే రానున్న ఎన్నికల్లో ఓటు వేస్తామని రాజకీయ పార్టీలకు హెచ్చరికలు పంపాలన్నారు.

వాహన తనిఖీల్లో రూ.8 లక్షలు స్వాధీనం

ప్రజాశక్తి -యంత్రాంగం

వాహన తనిఖీలను పోలీసులు ముమ్మరం చేశారు. ఎలాంటి పత్రాలు లేకుండా తరలిస్తున్న రూ.8 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. వైఎస్‌ఆర్ జిల్లా లింగాలలో ఎలాంటి రసీదులు లేకుండా కారులో తీసుకెళుతున్న రూ.7 లక్షల నగదును సీజ్ చేసినట్లు ఎస్ఐ కృష్ణయ్య యాదవ్ తెలిపారు. వాహన తనిఖీల్లో భాగంగా అనంతపురం జిల్లా ముదిగుబ్బ నుంచి గుంటూరుకు వెళుతున్న కారును పరిశీలించగా అందులో నగదు పట్టుబడిందన్నారు. పట్టుబడిన నగదును సీజ్ చేసి పోలీసు స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. విశాఖపట్నం జిల్లా పెదగంట్యాడ మండల పరిధిలోని సమతానగర్ జంక్షన్ వద్ద తనిఖీలు నిర్వహించిన ఫ్లైయింగ్ స్క్వాడ్ ఓ వ్యక్తి నుంచి రూ.లక్ష నగదును స్వాధీనం చేసుకుంది. గాజువాక ఆటోనగర్‌లో నివాసముంటున్న రాహుల్ పాత్రో తన కారులో పెదగంట్యాడ వైపు వెళుతుండగా సమతానగర్ జంక్షన్ వద్ద తనిఖీలు చేపట్టగా నగదు ఉండడంతో ఫ్లైయింగ్ స్క్వాడ్ సభ్యులు పట్టుకున్నారు. రిజిస్ట్రేషన్ నిమిత్తం పెదగంట్యాడ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళుతున్నానని ఆ వ్యక్తి వివరించారు. వాటికి సంబంధించిన ఆధారాలు చూపకపోవడంతో నగదును స్వాధీనం చేసుకుని, అతనిపై కేసు నమోదు చేసినట్లు ఫ్లైయింగ్ స్క్వాడ్ సభ్యులు తెలిపారు.

ఇదో పెద్ద కుట్ర

మొదటిపేజి తరువాయి

చెన్నై, ఢిల్లీ కార్యాలయాలపై దాడులు చేసిన ఇడి వారిని నిందితులుగా పేర్కొనకపోవడం, అప్రూవర్‌గా మారిన తరువాత క్షమాభిక్ష ఇవ్వడం, సిబిఐ దాఖలు చేసిన ఒక కేసులో మందుస్తు బెయిలు మంజూరు చేశారని అన్నారు. మాగుంట శ్రీనివాసులు ఇచ్చిన చివరి స్టేట్‌మెంట్ ఆధారంగా ఇడి తనను అరెస్టు చేసిందన్నారు. రాజ్యాంగ బద్ధంగా ఎన్నికైన ఒక ముఖ్యమంత్రిని అరెస్ట్ చేసేందుకు ఈ వాంగ్మూలాలు సరిపోతాయా అని ఆయన ప్రశ్నించారు. అవినీతి జరిగిందంటున్నారు. ఆ అవినీతి డబ్బు ఎక్కడికి వెళ్లిందో ఇడి చెప్పాలన్నారు. ఈ వ్యాఖ్యలపై జోక్యం చేసుకొన్న న్యాయమూర్తి... ఈ అంశాలను లిఖితపూర్వకంగా ఇవ్వగలరా? రికార్డులోకి తీసుకుంటామని అన్నారు.

ఏం లేదు..ఏం లేదు : మాగుంట

ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ గురువారం నాడు కోర్టులో తనపై చేసిన ఆరోపణలపై స్పందించాలని ప్రజాశక్తి కోరగా, ఏం లేదు..ఏం లేదు అని మాగుంట శ్రీనివాసులు దాటేశారు. శ్రీనివాసులు రెడ్డి 2014 సార్వత్రిక ఎన్నికల్లో టిడిపి తరపున పోటీ చేసి ఓడిపోయారు. ఆ తరువాత వైసిపి తరపున 2019లో ఎంపిగా పోటీ చేసి గెలుపొందారు. అయిదు సంవత్సరాల పాటు ఆ పార్టీ ఎంపిగా ఉండి గత నెలలో టిడిపిలోకి ఫిరాయించారు.

శరత్ చంద్రారెడ్డి బిజెపికి రూ.55 కోట్లు విరాళం

ఇడి ఫైల్‌లో ఉన్న లక్ష పేజీలు తమకు అనుకూలంగా ఉన్నా రికార్డుల్లోకి తీసుకురాలేదని కేజ్రీవాల్ కోర్టుకు నివేదించారు. ఇడి ఆరోపిస్తున్నట్లు ఎక్కడా రూ.100 కోట్లు వాస్తవంగా లేవన్నారు. ఇడి విచారణ తరువాత అసలు మద్యం కుంభకోణం ప్రారంభమైందని అన్నారు. మద్యం కుంభకోణంలో నిందితులుగా ఉన్న శరత్ చంద్రారెడ్డి బిజెపికి రూ.55 కోట్లు విరాళం ఇచ్చారని కోర్టుకు తెలిపారు. ఈ దందా సాగుతున్నట్లు తన దగ్గర ఆధారాలు ఉన్నాయన్నారు. మనీ ట్రయల్ జరిగిందన్నారు. అరెస్ట్ తర్వాతే శరత్‌చంద్రారెడ్డి బిజెపికి రూ.50 కోట్లు విరాళంగా ఇచ్చినట్లు తెలిపారు.

కేజ్రీవాల్ ఆరోపణలను ప్రభుత్వ తరపు న్యాయవాది అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్‌వి రాజు ఖండించారు. గోవా ఎన్నికల్లో వినియోగించిన లంచం మొత్తాలను ఆప్ స్వీకరించిందని ఆరోపించారు. ఆ డబ్బు సౌత్ గ్రూప్ నుంచి హవాలా రూపంలో వచ్చాయని చెప్పడానికి ఇడి దగ్గర ఆధారాలు ఉన్నాయన్నారు. లిక్కర్ స్కాంకు బిజెపికి వచ్చిన డబ్బులకు సంబంధం లేదన్నారు. మద్యం విధానాన్ని రూపొందించే హక్కు ఢిల్లీ ప్రభుత్వానికి తప్ప మరెవరికీ లేదన్నారు. సిఎం అయినంత మాత్రాన అరెస్ట్ చెయ్యకూడదని లేదని కోర్టుకు వివరించారు. సిఎంకు భిన్నమైన ప్రమాణాలు లేవని, సామాన్యుల లాగానే సిఎంను అరెస్ట్ చేసే అధికారం ఉందన్నారు. ఈ వ్యాఖ్యలపై కేజ్రీవాల్ తరపు న్యాయవాది రమేశ్ గుప్తా స్పందిస్తూ.. ఎలక్టోరల్ బాండ్స్‌తో ఈ కేసుతో సంబంధం లేకపోతే, దీనిపై కూడా విచారణ జరిపేలా కోర్టు ఆదేశాలు ఇవ్వాలని కోరారు. ఇరువైపులా వాదనలు విన్న ప్రత్యేక న్యాయమూర్తి కావేరి బవేజా తీర్పు రిజర్వ్ చేశారు. సాయంత్రం 4 గంటల తరువాత ఇచ్చిన ఉత్తర్వుల్లో కేజ్రీవాల్‌కు ఏప్రిల్ ఒకటి వరకు ఇడి కస్టడీకి ఇస్తున్నట్లు వెల్లడించారు.

జోక్యం చేసుకోలేం

మొదటిపేజి తరువాయి

వ్యాఖ్యానించింది. జైలు నుండి ముఖ్యమంత్రి బాధ్యతలు నిర్వహించకపోవడానికి అడ్డుపడుతున్న చట్టపరమైన కారణాలు ఏమైనా వుంటే అవి చూపించాలని కోర్టు యాదవ్‌ను కోరింది. రాజ్యాంగ వైఫల్యం వున్నట్లైతే, రాష్ట్రపతి దానిపై చర్య తీసుకుంటారు. లేదా గవర్నర్ పరిశీలిస్తారు, అంతేకానీ న్యాయ స్థానాలు ఏ చర్య తీసుకోలేవని హైకోర్టు పేర్కొంది. ఆచరణాత్మకమైన ఇబ్బందులు వుండి వుండవచ్చు, ఈ రోజు కూడా ముఖ్యమంత్రి ముందు ఫైల్ వుంచమని చీఫ్ సెక్రటరీని కోరిన విషయం తెలుసు, ఇది ఎలా జరుగుతుందన్నది మాకు తెలియదు,కానీ ఇవి ఆచరణలో ఇబ్బందులేనని కోర్టు పేర్కొంది. 239ఎబి నిబంధనను హైకోర్టు ఉపయోగించలేదు. అది గవర్నర్ అధీనంలో వున్న విషయం, అవసరమైతే రాష్ట్రపతి దగ్గరకు వెళ్లాల్సిన అంశం. కానీ మీరు (పిటిషనర్) మమ్మల్ని కోరుతున్నారు. కానీ ఇది మా పరిధిలో లేదు." అని బెంచ్ పేర్కొంది.

నా భర్తను వేధిస్తున్నారు : సునీత కేజ్రీవాల్

మద్యం విధానం కేసులో అరెస్టు చేసిన తన భర్తను ఇడి అధికారులు తీవ్రంగా వేధిస్తున్నారని అరవింద్ కేజ్రీవాల్ భార్య సునీతా కేజ్రీవాల్ చెప్పారు. తన భర్త ఆరోగ్యం బాగా లేదని, షుగర్ లెవెల్స్ ఒడిదుడుకులకు గురవుతున్నాయని తెలిపారు. ప్రతి రోజూ రెండు పరీక్షలు చేయడానికి అనుమతించారని, డాక్టర్ల సలహా ప్రకారం ఇంటి భోజనానికి కూడా అనుమతించారని చెప్పారు. అరవింద్ చాలా ధైర్యవంతుడని, దేశభక్తిపరుడని, ఆయన పట్టుదల, దీక్ష కూడా చాలా బలంగా వుంటాయని ఆమె పేర్కొన్నారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వ పాలన ఇక ఎన్నాళ్ళో సాగదని, ప్రజలు తగిన బుద్ధి చెబుతారని ఆమె వ్యాఖ్యానించారు. గురువారంతో ఇడి కస్టడీ ముగియనుండడంతో కేజ్రీవాల్‌ను కోర్టులో హాజరుపరిచేందుకు తీసుకువచ్చారు. అక్కడకు వచ్చిన సునీత విలేకర్లతో మాట్లాడారు.

అభివృద్ధి - సంక్షేమం.. చేసి చూపించాం

మొదటిపేజి తరువాయి

కావాలని చెప్పారు. ఐదేళ్లలో గ్రామాల్లో వచ్చిన మార్పును గమనించాలని, వైసిపి ఐదేళ్ల పాలనపై అందరితోనూ చర్చించాలన్నారు. ఈ ఎన్నికలు ప్రజల భవిష్యత్తును నిర్ణయిస్తాయని చెప్పారు. తమ ప్రభుత్వం వల్ల మేలు జరిగి ఉంటే ఓటు వేయాలని కోరారు. చంద్రబాబు హయాంలో మంచి పనులు చేసిన దాఖలాల్లేవని ఆరోపించారు. ప్రతి అక్కా, చెల్లెమ్మల కుటుంబాల్లో సంతోషాలను చూడాలనే ఏకైక ఉద్దేశంతో బటన్లు నొక్కినట్లు చెప్పారు. నంద్యాల నుండి బయలు దేరి పాణ్యం మీదుగా కర్నూలు జిల్లా నాగలాపురం బస కేంద్రానికి చేరుకున్నారు. బహిరంగ సభలో మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి, ముఖ్యమంత్రి కార్యక్రమాల సమన్వయకర్త తలశిల రఘురాం, ఎమ్మెల్సీ ఇసాక్ బాషా, జలవనరుల శాఖ సలహాదారు గంగుల ప్రభాకర్ రెడ్డి, మహిళా కమిషన్ మాజీ చైర్మన్ వాసిరెడ్డి పద్మ, శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి, ఎంపీ పోచా బ్రహ్మానంద రెడ్డి, ఎమ్మెల్యేలు, వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థులు పాల్గొన్నారు. ఎర్రగుంట్లలో వికలాంగ దంపతులు ప్రసాద్, అపర్ణలు సిఎంతో ఫోటో కావాలని అడగగా సిఎం కింద కూర్చుని ఫోటో దిగి వారితో మాట్లాడారు.

బిజెపికి భారతీ గ్రూపు భారీ విరాళాలు

- ఇబిల ద్వారా రూ.150 కోట్లు
- 'టెలికాం'లో భారతీకి అనుకూలంగా మోడీ సర్కారు నిర్ణయాలు
- హడావిడిగా కొత్త చట్టం
- విస్మయం కలిగిస్తున్న డొనేషన్లు

దేశంలో ఎలక్టోరల్ బాండ్ల(ఇబి) విరాళాల వెనకున్న గుట్టు క్రమక్రమంగా రట్టవుతున్నది. నీకిది, నాకది (క్విడ్ ప్రో కో) ఉద్దేశంతోనే ఈ ఈబీ విరాళాలు జరిగినట్టు తెలుస్తున్నది. ముఖ్యంగా, కేంద్రంలోని అధికార బీజేపీకి ఈ విధంగానే విరాళాలు వచ్చి చేరినట్టు అర్థమవుతున్నది. బెదిరింపుల ద్వారానో, అనుకూలంగా వ్యవహరించటం ద్వారానో కాషాయపార్టీ పెద్ద ఎత్తున ఈబీల ద్వారా నిధులను సమీకిరించుకోగలిగింది. భారతీ గ్రూపు బీజేపీకి రూ.150 కోట్ల విరాళాన్ని అందించటం, టెలికాం విషయంలో ఆ సంస్థకు లాభం చేకూరేలా మోడీ ప్రభుత్వం నిర్ణయాలు తీసుకోవటం ఒకదాని తర్వాత ఒకటి జరగటం చర్చనీయాంశంగా మారింది.

న్యూఢిల్లీ : కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ పాలనలో 2012లో ప్రభుత్వం కేటాయించిన 122 టెలికాం లైసెన్సులను సుప్రీంకోర్టు రద్దు చేసి.. దానికి బదులుగా టెలికాం స్పెక్ట్రమ్‌ను వేలం వేయాలని ఆదేశించింది. ఆ సమయంలో మీడియా నివేదికలు ఈ తీర్పును"అవినీతిపై నిర్ణయాత్మక దెబ్బ"గా అభివర్ణించాయి.

అయితే స్పెక్ట్రమ్‌ను తప్పనిసరి వేలం వేయాలని సుప్రీంకోర్టు 2012లో ఆదేశించినప్పటికీ, మోడీ ప్రభుత్వం కాంగ్రెస్ అనుసరించిన అదే మార్గాన్ని అనుసరించాలని నిర్ణయించుకున్నది. డిసెంబరు, 2023లో, పోటీ వేలం అవసరం లేకుండా శాటిలైట్ స్పెక్ట్రమ్‌ను అడ్మినిస్ట్రేటివ్ ఆర్డర్ ద్వారా కేటాయించటానికి అనుమతించే కొత్త టెలికాం చట్టాన్ని పార్లమెంటు ద్వారా హడావిడిగా తీసుకొచ్చింది. వేలం నుంచి వైదొలగటానికి న్యాయపరమైన ఆమోదం కోరుతూ సుప్రీంకోర్టులో రిఫరెన్స్ కూడా దాఖలు చేసింది. వన్‌వెబ్ ఇండియా స్పెక్ట్రమ్ కోసం దరఖాస్తు చేయటానికి అవసరమైన లైసెన్స్, స్పేస్ అథరైజేషన్ రెండింటినీ పొందింది.

వన్‌వెబ్ అనేది అంతర్జాతీయ శాటిలైట్ సంస్థ యూటెల్‌శాట్ భారతీయ అనుబంధ సంస్థ. దీని ప్రధాన కార్యాలయం లండన్‌లో ఉన్నది. యూటెల్‌శాట్ అతిపెద్ద వాటాదారు టెలికాం సర్వీస్ ప్రొవైడర్ ఎయిర్‌టెల్ మాతృ సంస్థ భారతి ఎంటర్‌ప్రైజెస్. దీని ప్రధాన కార్యాలయం ఢిల్లీలో ఉన్నది. టెలికాం, డిజిటల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, స్పేస్ కమ్యూనికేషన్స్, ఫైనాన్షియల్ సర్వీసెస్, రియల్ ఎస్టేట్ వంటి విభిన్న శ్రేణి పరిశ్రమలలో దీనికి వాటా ఉన్నది. ఆగస్ట్ 24, 2021న వన్‌వెబ్ అనేది డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెలికమ్యూనికేషన్స్ విభాగం నుంచి శాటిలైట్ ద్వారా గ్లోబల్ మొబైల్ పర్సనల్ కమ్యూనికేషన్స్ (జీఎంపీసీఎస్)ను పొందిన మొదటి కంపెనీగా అవతరించింది. నవంబర్ 21, 2023న శాటిలైట్ సామర్థ్యాన్ని ఉపయోగించటం కోసం ఇండియన్ నేషనల్ స్పేస్ ప్రమోషన్ అండ్ ఆథరైజేషన్ సెంటర్(ఇన్-స్పేస్) ద్వారా దీనికి అథారిటీ మంజూరైంది. ఇప్పటివరకు ఈ అధికారాన్ని పొందిన ఏకైక సంస్థ ఇదే కావటం గమనార్హం.

పలు సందేహాలు, ప్రశ్నలు

శాటిలైట్ స్పెక్ట్రమ్‌ను ప్రభుత్వం ఇంకా కేటాయించనప్పటికీ, ఇటీవల విడుదల చేసిన ఎలక్టోరల్ బాండ్ల డేటా మాత్రం పలు సందేహాలను, ప్రశ్నలను కలిగిస్తున్నది. శాటిలైట్ స్పెక్ట్రమ్ వేలం అవసరం లేకుండా ప్రభుత్వం కొత్త చట్టాన్ని ప్రవేశపెట్టడానికి ముందు, తర్వాత కొనుగోలు చేసిన రెండు సెట్ల బాండ్ల ద్వారా భారతి గ్రూప్ బీజేపీకి రూ. 150 కోట్లను విరాళంగా అందించింది. అయితే, ఒక నెల తర్వాత మోడీ సర్కారు స్పెక్ట్రమ్ పొందటం కోసం వన్‌వెబ్‌కు స్పేస్ ఆథరైజేషన్‌ను మంజూరు చేయటం గమనార్హం.


2023 టెలికాం బిల్లు స్పెక్ట్రమ్‌ను వేలం వేయాలన్న సుప్రీంకోర్టు ఆదేశం మోడీ ప్రభుత్వంపై ఎలాంటి ప్రభావమూ చూపలేదు. డిసెంబర్ 18, 2023న లోక్‌సభలో కొత్త టెలికమ్యూనికేషన్స్ బిల్లును కేంద్రం ప్రవేశపెట్టింది. ఈ బిల్లు ఇంటర్నెట్ సస్పెన్షన్, నిఘా కోసం కఠినమైన అధికారాలను కలిగి ఉండటమే కాకుండా, స్పెక్ట్రమ్ నిర్వహణకు భారత దేశ విధానాన్ని మారుస్తుంది. వేలం ద్వారా కాకుండా "నిర్దిష్ట ఉపగ్రహ ఆధారిత సేవల" కోసం స్పెక్ట్రమ్ అడ్మినిస్ట్రేటివ్ కేటాయింపులకు మార్గం సుగమం చేస్తుంది. 143 మంది ప్రతిపక్ష ఎంపీలను ఉభయ సభల నుంచి సస్పెండ్ చేయటంతో బిల్లు డిసెంబర్ 20న లోక్‌సభలో వాయిస్ ఓటింగ్ ద్వారా ఆమోదించబడింది. ఒకరోజు తర్వాత రాజ్యసభ బిల్లును ఆమోదించింది. క్రిస్మస్ వేళ భారత రాష్ట్రపతి ఈ బిల్లుపై సంతకం చేసి చట్టం చేశారు.

150 కోట్ల విలువైన బాండ్లు

ఈ చట్టం భారతీ గ్రూపునకు అనుకూలంగానే ఉన్నది. చట్టాన్ని అమలు చేస్తున్న క్రమంలో ఆసక్తికరమైన మరో ఘటన చోటు చేసుకున్నది. నవంబర్ 9న, భారతీ ఎయిర్‌టెల్ లిమిటెడ్ రూ. 100 కోట్ల విలువైన ఎలక్టోరల్ బాండ్లను కొనుగోలు చేసి, మొత్తాన్ని బీజేపీకి విరాళంగా ఇచ్చింది. నాలుగు రోజుల తర్వాత నవంబర్ 13న బీజేపీ అన్ని బాండ్లనూ ఎన్‌క్యాష్ చేసుకున్నది. ఎనిమిది రోజుల తర్వాత (నవంబర్ 21న) వన్‌వెబ్.. భారత్ నుంచి శాటిలైట్ ఆథరైజేషన్‌ను పొందిన మొదటి కంపెనీగా అవతరించింది. కొత్త సంవత్సరం ప్రారంభం కాగానే, భారతీ ఎయిర్‌టెల్ లిమిటెడ్ మరో రూ. 50 కోట్ల విలువైన ఎలక్టోరల్ బాండ్‌లను కొనుగోలు చేసింది. వీటిని బీజేపీ జనవరి 12న ఎన్‌క్యాష్ చేసుకుంది. యుటెల్‌శాట్ వన్‌వెబ్ కోసం.. ప్రభుత్వం నుంచి లైసెన్స్, స్పేస్ ఆథరైజేషన్ రెండింటినీ పొందటం శాటిలైట్ బ్రాడ్‌బ్యాండ్ సెక్టార్‌లో చర్చనీయాంశంగా మారింది.

బాండ్లు, ట్రస్టులతో 'భారతి గ్రూపు'

భారతి ఎంటర్‌ప్రైజెస్ భారతీయ రాజకీయ పార్టీలకు అధికారికంగా నిధులు సమకూర్చటానికి రెండు మార్గాలను ఉపయోగించింది. అవి ఎలక్టోరల్ బాండ్‌లు, ఎలక్టోరల్ ట్రస్ట్‌లు. ఎలక్టోరల్ ట్రస్ట్ అనేది లాభాపేక్ష లేని సంస్థ. దీని ద్వారా కార్పొరేషన్‌లు, వ్యక్తులు తమ విరాళాలను రాజకీయ పార్టీలకు పంపవచ్చు. అయితే పన్ను మినహాయింపులు ఇందులో ఉంటాయి. "ప్రుడెంట్ ఎలక్టోరల్ ట్రస్ట్" అని పిలువబడే దేశంలో అతిపెద్ద ఎలక్టోరల్ ట్రస్ట్ 2013లో భారతి గ్రూప్ ద్వారా ప్రారంభించబడింది. ఇది అతిపెద్ద దాతలలో ఒకటిగా కొనసాగుతున్నది. ప్రుడెంట్ తన విరాళాలలో ఎక్కువ భాగాన్ని బీజేపీకి నిరంతరం అందజేస్తున్నది.



2019లో బీజేపీ ఎక్కువ మెజారిటీతో అధికారంలోకి వచ్చినప్పుడు ప్రుడెంట్ దాదాపు రూ. 218 కోట్లను పార్టీకి విరాళంగా అందించింది. ఆ ఏడాది ప్రుడెంట్‌కు భారతి రూ.27.25 కోట్లు విరాళంగా అందించింది. అదే ఏడాది ఎలక్టోరల్ బాండ్ల ద్వారా భారతి.. బీజేపీకి రూ.51.4 కోట్లు ఇచ్చింది. ఆ తర్వాతి సంవత్సరంలో భారతి.. ప్రూడెంట్‌కు రూ. 10 కోట్లు విరాళంగా ఇచ్చింది. కానీ ఎలాంటి ఎలక్టోరల్ బాండ్‌లనూ కొనుగోలు చేయలేదు. అలాగే, భారతి గ్రూపు 2021, 2022 ఏడాదుల్లో బాండ్ల ద్వారా బీజేపీకి రూ. 35 కోట్లు అందించింది. 2023లో ఈ సంఖ్య అకస్మాత్తుగా రూ. 100 కోట్లకు చేరుకున్నది. ఇవన్నీ యూటెల్‌సాట్ వన్‌వెబ్ బ్రాడ్‌బ్యాండ్ ఒప్పందాన్ని పొందే రోజుల ముందు కొనుగోలు చేయబడటం గమనార్హం.

2019-2024 మధ్య, గ్రూప్ కంపెనీలు భారతీ ఎయిర్‌టెల్ లిమిటెడ్, భారతీ ఇన్‌ఫ్రాటెల్ లిమిటెడ్, భారతీ టెలిమీడియా లిమిటెడ్ రూ. 247 కోట్ల విలువైన బాండ్లను కొనుగోలు చేశాయి. రూ. 236.4 కోట్లు(95 శాతానికి పైగా) విరాళం ఇచ్చాయి. ఎన్నికల సంఘం ఎలక్టోరల్ బాండ్ల డేటా విశ్లేషణ దీనిని స్పష్టం చేస్తున్నది. అయితే, ఈ విధమైన విరాళాల విషయంలో లోతైన దర్యాప్తు అవసరమున్నదని రాజకీయ విశ్లేషకులు, నిపుణులు, మేధావులు సూచిస్తున్నారు.

రూ.56 లక్షలు స్వాధీనం

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

టిడిపి బాపట్ల అభ్యర్థి నరేంద్రవర్మకు చెందిన రొయ్యల కంపెనీ (రాయల్ మెరైన్ ప్రయివేట్ లిమిటెడ్) కంటైనర్‌లోని రూ.56 లక్షల నగదును చీరాల పోలీసులు గురువారం స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల వివరాల మేరకు..భీమవరం నుంచి నిజాంపట్నం మీదుగా చీరాల మండలం, కావూరివారిపాలెం వద్ద ఉన్న రొయ్యల కంపెనీకి భారీ ఎత్తున నగదు వస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. రొయ్యల కంపెనీ వద్ద ఆ కంటైనర్‌ను పోలీసులు తనిఖీ చేశారు. రూ.56 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్‌కు సదరు నగదును పోలీసులు అప్పజెప్పారు. తమ కంపెనీ జీతాల కోసం సదరు నగదు తెప్పించడం జరిగిందని కంపెనీ యాజమాన్యం పేర్కొంది. సరైన ఆధారాలు లేకపోవడంతో ఆ సొమ్మును ట్రెజరీలో జమ చేస్తామని డిఎస్‌పి బేతపూడి ప్రసాద్ తెలిపారు.

తిరుమల నడకదారిలో చిరుత సంచారం

- ట్రాప్ కెమెరాల్లో రికార్డు

ప్రజాశక్తి - తిరుమల

తిరుమల నడకదారి సమీపంలో మరోసారి చిరుత, ఎలుగుబంటి సంచారం తీవ్ర కలకలం సృష్టించింది. మెట్ల మార్గానికి సమీపంలో చిరుతతో పాటు ఎలుగుబంటి సంచరిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. నడకదారికి సుమారు 150 మీటర్ల దూరంలోనే చిరుత, ఎలుగుబంటి సంచరిస్తున్న దృశ్యాలు ట్రాప్ కెమెరాల్లో రికార్డయ్యాయి. గత రెండు రోజులుగా రాత్రి సమయాల్లో ఇవి సంచరిస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో అప్రమత్తమైన అటవీశాఖ అధికారులు యాత్రికులను రాత్రి సమయాల్లో గుంపులు గుంపులుగా వెళ్లేందుకు మాత్రమే అనుమతి ఇస్తున్నారు.

గుండ్లకమ్మ డ్యామ్‌లో మొసలి

- మత్స్యకారుల వలకు చిక్కిన వైనం

ప్రజాశక్తి-మద్దిపాడు (ప్రకాశం జిల్లా)

ప్రకాశం జిల్లా మద్దిపాడు మండల పరిధిలోని మల్లవరం గుండ్లకమ్మ రిజర్వాయర్‌లో చేపల వలలో మొసలి కనిపించడం కలకలం రేపింది. అన్నంగి గ్రామానికి చెందిన మత్స్యకారుడు అనిల్.. బుధవారం రాత్రి రిజర్వాయర్‌లో చేపలు పట్టేందుకు వలవేసి వెళ్లారు. గురువారం ఆ వలను తీసుకునేందుకు వెళ్లగా అందులో మొసలి చిక్కుకొని.. చనిపోయి ఉంది. ఫారెస్ట్, మత్స్యశాఖ అధికారులు మొసలిని పరిశీలించారు. మృతదేహాన్ని ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ శశిభూషణ్ స్వాధీనం చేసుకున్నారు.

ఆరు ఎర్రచందనం దుంగలు స్వాధీనం

- వెల్లడించిన టాస్క్ ఫోర్స్ ఎస్‌పి, డిఎస్‌పి

ప్రజాశక్తి- మంగళం (తిరుపతి)

తిరుపతి మంగళం పరిధి తిమ్మినాయుడుపాలెం సమీపంలో ఆరు ఎర్రచందనం దుంగలను లోడ్ చేస్తున్న దోస్త్ లగేజీ వాహనం, మోటారు సైకిల్‌ను టాస్క్ ఫోర్స్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఒక స్మగ్లర్‌ను అరెస్ట్ చేశారు. టాస్క్ ఫోర్స్ ఎస్‌పి పి శ్రీనివాస్, డిఎస్‌పి చెంచుబాబు తెలిపిన వివరాల మేరకు.. ఆర్ఐ (రిజర్వు) సురేష్ కుమార్ రెడ్డికి చెందిన ఆర్ఎస్ఐ సురేష్ బాబు బృందం బుధవారం మంగళం భూపాల్ కాలనీల మీదుగా తిమ్మినాయుడు పాలెం అటవీప్రాంతంలో కూంబింగ్ నిర్వహించారు. గురువారం బయోట్రిమ్ వద్ద లగేజీ వాహనంలో కొందరు వ్యక్తులు ఎర్రచందనం దుంగలు లోడ్ చేస్తూ కనిపించారు. వాహనాన్ని పోలీసులు చుట్టుముట్టగా అక్కడున్న వ్యక్తులు పారిపోయే ప్రయత్నం చేశారు. అందులో ఓ వ్యక్తిని పట్టుకున్నారు. నిందితుడు చిత్తూరు రూరల్ తుమ్మందపాలెంకు చెందిన పవన్ (23)గా గుర్తించారు. ఈ దుంగలను తమిళనాడులోని తిరుత్తని మీదుగా కర్ణాటకలోని హోస్పేటకు తరలిస్తున్నామని నిందితుడు తెలిపాడు. దుంగలు, వాహనాలు స్వాధీనం చేసుకుని తిరుపతి టాస్క్ ఫోర్స్ పోలీసు స్టేషన్‌లో కేసు దర్యాప్తు చేస్తున్నామని సిఐ శ్రీనివాసులు తెలిపారు.

ప్యాంట్రీకార్‌పై దుష్ప్రచారం

- బిజెపి అభ్యర్థులందరూ చంద్రబాబు మనుషులే
- సజ్జల రామకృష్ణారెడ్డి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనలకు అన్ని అనుమతులూ వున్న ప్యాంట్రీకార్‌పై అనుమానాలు రేకెత్తించేలా మాట్లాడటం టిడిపికి అలవాటేనని వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి విమర్శించారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. పెన్షన్ వయోపరిమితిని 50 ఏళ్లకు తగ్గించడం, రూ.4 వేలు చంద్రబాబు ఇస్తామనడం అంతా అబద్ధమని అన్నారు. సిఎం కార్యాలయానికి వచ్చిన కంటెయినర్ ముఖ్యమంత్రి పర్యటనల కోసం ఎపిఎస్ఆర్‌టిసి నుంచి నిబంధనల మేరకు లీజుకు తీసుకున్నామన్నారు. ఈ ప్యాంట్రీ కార్‌కు ఇసి అనుమతి కూడా వుందని తెలిపారు. చంద్రబాబు, లోకేష్ ట్విట్టర్‌ను దుర్వినియోగం చేస్తున్నారని విమర్శించారు. బిజెపితో పొత్తుల కోసం ఢిల్లీ చుట్టూ ప్రదక్షిణలను చేసిన అంశాన్ని రాష్ట్ర ప్రజలు ఎవరూ మర్చిపోలేదన్నారు. కేసుల నుంచి బయటపడేందుకే బిజెపి దగ్గర సాగిలపడ్డారని విమర్శించారు. నరసాపురం పార్లమెంటు సీటు మినహా బిజెపిలో ఉన్న చంద్రబాబు మనుషులకే టికెట్లు ఇచ్చారని అన్నారు. బిజెపిలో వున్న టిడిపి ఏజెంట్లు ఇప్పుడు బిజెపిని నడిపిస్తున్నారని విమర్శించారు.

ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా

- నేటి నుంచి అందుబాటులోకి కొత్త యాప్
- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్ రెడ్డి



ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో నీటి ఎద్దడి అధికంగా గల ప్రాంతాలు, ఆవాసాలకు ట్యాంకర్ల ద్వారా మంచి నీటిని సరఫరా చేయాలని సంబంధిత అధికారులను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కెఎస్ జవహర్ రెడ్డి ఆదేశించారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో తాగునీటి సరఫరాపై జలవనరులు, పంచాయతీరాజ్, పట్టణ మంచినీటి సరఫరా విభాగాల అధికారులతో గురువారం ఆయన సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సిఎస్ మాట్లాడుతూ.. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటికి ఇబ్బందుల్లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. తాగునీటి కోసం సరఫరా చేసే నీటిని వాహనాలు, ఇళ్లు శుభ్రపరుచుకోవటం, గార్డెన్లకు ఉపయోగించటం చేయకూడదని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రజలకు నీటిని పొదుపుగా వాడటంపై అవగాహన కల్పించేందుకు విస్తృత ప్రచారం నిర్వహించాలని ఆదేశించారు. జలవనరులు, పంచాయతీరాజ్‌శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్ కుమార్ మాట్లాడుతూ.. 17 జిల్లాల్లో తాగునీటి సమస్యను అధిగమించేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరాపై ప్రత్యేక యాప్‌ను రూపొందించామని, శుక్రవారం నుంచి ఈ యాప్‌ను అందుబాటులోకి తీసుకొస్తున్నామని ప్రకటించారు. గ్రామాల్లో పనిచేసే ఇంజినీరింగ్ అసిస్టెంట్స్.. నీటి సరఫరా డిమాండ్‌ను యాప్‌లో అప్‌లోడ్ చేస్తే, ప్రభుత్వం ఆమోదం తెలిపి, ట్యాంకర్ల ద్వారా సంబంధిత ప్రాంతాలకు పంపుతుందని శశిభూషణ్ కుమార్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో సిడిఎంఎ శ్రీకేశ్ బాలాజీరావు, ఆర్థికశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్ఎస్ రావత్, కెవివి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మద్యం అక్రమ రవాణా, గంజాయి విక్రయాలపై ఉక్కుపాదం

రాష్ట్రంలో మద్యం అక్రమ రవాణా, గంజాయి సాగు, ఇతర మత్తు పదార్థాల రవాణా, విక్రయదారులపై ఉక్కుపాదం మోపాలని సిఎస్ జవహర్‌రెడ్డి ఆదేశించారు. సచివాలయంలో ఎక్సైజ్, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంటు బ్యూరో, పోలీస్‌శాఖల అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సరిహద్దు రాష్ట్రాల డిజిపిలతో సమన్వయం చేసుకోవాలని అధికారులకు సూచించారు. సరిహద్దు రాష్ట్రాల చెక్కు పోస్టుల్లో నిఘాను మరింత పటిష్టం చేయాలన్నారు. ఎస్ఇబి కమిషనరు ఎం రవిప్రకాశ్ మాట్లాడుతూ.. 90 శాతం గంజాయి ఒడిశా నుంచి రవాణా అవుతోందని గుర్తించినట్లు పేర్కొన్నారు. గంజాయి కేసులకు సంబంధించి రాష్ట్రంలో 35 మందిని కీలక వ్యక్తులుగా గుర్తించి, వారిలో 25 మందిని అరెస్టు చేశామన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులోకి వచ్చాక రాష్ట్రంలో ఇప్పటి వరకూ రూ.4.38 కోట్ల అక్రమ మద్యం, డ్రగ్స్, ఇతర వస్తువులను స్వాధీనం చేసుకున్నామన్నారు. సమావేశంలో ఎక్సైజ్‌శాఖ కమిషనరు వివేక్ యాదవ్, అదనపు కమిషనరు దేవ కుమార్, ఎపి బేవరేజస్ కార్పొరేషన్ ఎమ్‌డి వాసుదేవరావు తదితరులు పాల్గొన్నారు.



రమేష్ భౌతికకాయం వద్ద నివాళులు అర్పిస్తున్న సిపిఎం, వ్యకాసం నాయకులు (ఇన్‌సెట్‌లో రమేష్ (ఫైల్))

రోడ్డు ప్రమాదంలో సత్యసాయి జిల్లా వ్యకాసం నాయకుడు మృతి

ప్రజాశక్తి-చిలమత్తూరు

రోడ్డు ప్రమాదంలో శ్రీసత్యసాయి జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు రమేష్ (40) మరణించాడు. ఈ నెల 19న ఆయన ద్విచక్రవాహనంలో వెళ్తూ ప్రమాదవశాత్తు కిందపడ్డారు. చికిత్స పొందుతూ బుధవారం అర్ధరాత్రి మరణించారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.. శ్రీ సత్యసాయి జిల్లా నల్లచెరువు మండలం ఓరువాయి గ్రామానికి చెందిన రమేష్.. సిపిఎం అనుబంధ వ్యవసాయ కార్మిక సంఘంలో జిల్లా కోశాధికారిగా ఉన్నారు. ఈ నెల 19న ఆయన తన స్వగ్రామం నుంచి నల్లచెరువుకు ద్విచక్రవాహనంలో వెళ్తుండగా మార్గమధ్యంలో వాహనం అదుపు తప్పి బోల్తా పడింది. తలకు తీవ్ర గాయం కావడంతో చికిత్స నిమిత్తం కుటుంబ సభ్యులు బెంగుళూరుకు తరలించారు. మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలించారు.పరిస్థితి విషమించి బుధవారం అర్ధరాత్రి మరణించారు. రమేష్ భార్య కూడా మూడేళ్ల క్రితం అనారోగ్యంతో మరణించారు. ఈయనకు ఇద్దరు కుమారులు ఉన్నారు. పేదలు, రైతు కూలీల కోసం చేసిన భూ స్వాధీనం ఉద్యమాల్లో ఆయన ముందుండి పోరాటం సాగించారు. పాత్రికేయునిగా కూడా పనిచేసి ప్రజా సమస్యలపై కథనాలను రాశారు.

సిపిఎం, ప్రజాసంఘాల నేతల నివాళి

రమేష్ మృతి విషయం తెలుసుకున్న సిపిఎం, ప్రజాసంఘాల నాయకులు ఆయనకు నివాళి అర్పించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.ఇంతియాజ్, వ్యకాసం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఫిరంగి ప్రవీణ్‌కుమార్, పెద్దన్న తదితరులు ఓరువాయి గ్రామానికి వెళ్లి రమేష్ భౌతికకాయం వద్ద నివాళులు అర్పించారు. గురువారం సాయంత్రం రమేష్ అంత్యక్రియలను కుటుంబ సభ్యులు నిర్వహించారు.

వైసిపి హయాంలో అభివృద్ధి శూన్యం

- 'నిజం గెలవాలి' యాత్రలో భువనేశ్వరి

ప్రజాశక్తి - యంత్రాంగం

వైసిపి ప్రభుత్వ హయాంలో రాష్ట్ర అభివృద్ధి శూన్యమని, అవినీతి, మద్యం, ఇసుక, మాదకద్రవ్యాలతో రాష్ట్రాన్ని దోచుకోవడమే లక్ష్యంగా ఆ పార్టీ ప్రజాప్రతినిధులు పనిచేస్తున్నారని టిడిపి అధినేత నారా చంద్రబాబునాయుడు సతీమణి నారా భువనేశ్వరి విమర్శించారు. 'నిజయం గెలవాలి' యాత్రలో భాగంగా ఆమె గురువారం ఏలూరు, కృష్ణా జిల్లాలో పర్యటించారు. చంద్రబాబు అక్రమ అరెస్టును తట్టుకోలేక మృతి చెందిన బాధిత కుటుంబాలను ఆమె పరామర్శించారు. ఏలూరు జిల్లా ఆగిరిపల్లి మండలం తోటపల్లిలో బెజవాడ రామారావు, ఆగిరిపల్లిలో పల్లగాని చంద్రయ్య, కలవకొల్లు శ్రీరాములమ్మ, నూజివీడు మండలం గొల్లపల్లిలో వెనిగళ్ల పూర్ణచంద్రయ్య కుటుంబాలను పరామర్శించారు. కృష్ణా జిల్లా గుడివాడ మండలం మోటూరులో గుండెపోటుతో మృతి చెందిన యార్లగడ్డ శ్రీనివాసరావు కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. బాధిత కుటుంబాలను అన్ని విధాలుగా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రం అభివద్ధి చెందాలన్నా, నిజం గెలవాలన్నా చంద్రబాబును గెలిపించుకోవాలని కోరారు.



ఏలూరు జిల్లా నూజివీడు మండలం గొల్లపల్లిలో బాధిత కుటుంబాన్ని పరామర్శించిన భువనేశ్వరి

మేయర్ పదవిస్తామని ఎమ్మెల్యేనే హామీ ఇచ్చారు

- కార్పొరేటర్లు అన్నా సంధ్య, అనిత

ప్రజాశక్తి - మంగళం (తిరుపతి)

ఏనాడూ మేయర్ పదవి కోసం ఎవరి ఇంటి గడప తాము తొక్కలేదని, ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి తమ ఇంటికి వచ్చి మేయర్ పదవి ఇస్తామని చెప్పారని తిరుపతి 48, 49 డివిజన్ల కార్పొరేటర్లు అన్నా అనిత, అన్నా సంధ్యా యాదవ్ అన్నారు. ఇవేమీ తెలియని వైసిపిలో కొందరు నాయకులు నోటికొచ్చినట్లు విమర్శించడం తగదని అన్నారు. వైసిపి ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు తిరుపతి ప్రెస్ క్లబ్‌లో గురువారం ప్రకటించారు. తమ తండ్రి అన్నా రామచంద్రయ్యను ఇష్టం వచ్చినట్టు మాట్లాడడం పట్ల తీవ్ర మనస్తాపం చెంది పార్టీకి రాజీనామా చేస్తున్నామన్నారు. ఉద్దేశపూర్వకంగా టార్గెట్ చేసి విమర్శలు చేయడం ఇకనైనా మానుకోవాలని కోరారు. అన్నా రామచంద్రయ్య మాట్లాడుతూ తన బిడ్డకు మేయర్ పదవి ఇస్తానని ఎమ్మెల్యే భూమన హామీ ఇచ్చే సమయంలో పట్టణ అధ్యక్షులు పాలగిరి ప్రతాపరెడ్డి, సిద్ధారెడ్డి కూడా ఉన్నారన్నారు. వారు మీడియా ముఖంగా వచ్చి వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. తన కుమార్తెలపై ఆరోపణలు చేస్తే కార్పొరేటర్ల పదవులకూ రాజీనామా చేయడానికి సంసిద్ధంగా ఉన్నామన్నారు. ఇకనైనా ఇలాంటి బురదజల్లే నిరాధార ఆరోపణలు మానుకోవాలని, లేకుంటే వాస్తవాలను మీడియా ద్వారా ప్రజలకు తెలియజేయాల్సి వస్తుందని హెచ్చరించారు.

వివేకాను హత్య చేసిన వ్యక్తికి సునీత మద్దతు

- ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

ప్రజాశక్తి-కడప

వివేకానందరెడ్డిని హత్య చేసిన వ్యక్తికి సునీత మద్దతు ఇవ్వడం బాధాకరంగా ఉందని కమలాపురం ఎమ్మెల్యే పి రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. వైఎస్ఆర్ జిల్లా వైసిపి కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వివేక హత్య వెనుక ఎవరున్నారనేది అందరికీ బాగా తెలుసన్నారు. స్వయంగా హత్య చేశానని దస్తగిరి ఒప్పుకున్నాడని గుర్తుచేశారు. నేరుగా తానే చంపాను అంటున్న వ్యక్తికి మద్దతు ఇచ్చి బెయిల్ కూడా ఇప్పించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. టిడిపి ప్లాన్‌తోనే వివేకా హత్య జరిగిందని ఆరోపించారు. దస్తగిరికి బెయిల్ రావడానికి టిడిపి ప్రమేయం కూడా ఉందన్నారు. టిడిపికి జనసేన, బిజెపితో ప్రత్యక్షంగా పొత్తు, పరోక్షంగా కాంగ్రెస్‌తో బాబుకు పొత్తుందన్నారు. ఎన్ని పార్టీలు ఏకమైన వెసిపిని ఏమి చేయలేరని తెలిపారు. సమావేశంలో వైసిపి నాయకులు పులి సునీల్ కుమార్ పాల్గొన్నారు.

నరసాపురం ఎంపి సీటు నాదే

- ఎంపి రఘురామకృష్ణంరాజు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

టిడిపి, జనసేన, బిజెపి కూటమి తరపున నరసాపురం ఎంపి అభ్యర్థిగా తానే పోటీ చేస్తానని, త్వరలోనే దీనిపై ప్రకటన వస్తుందని నరసాపురం ఎంపి కనుమూరి రఘురామకృష్ణంరాజు తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరం విచ్చేసిన ఆయన తన నివాసంలో గురువారం విలేకరులతో మాట్లాడారు. ఇటీవల కూటమి అభ్యర్థుల జాబితాలో తన పేరు లేకపోవడంపై ఈ ప్రాంత ప్రజలు విస్మయానికి గురయ్యారన్నారు. త్వరలోనే తన పేరు కూటమి నేతలు ప్రకటిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఎవరికీ భయపడలేదని, తన ఒక్కడికే భయపడ్డారని అన్నారు.

ప్రస్తుతం ఈ ప్రాంతంలోని తన స్నేహితులను కలుస్తున్నానని, టికెట్ వచ్చిన వెంటనే ప్రచారంలో ఉంటానని తెలిపారు. తనకు సీటు రాకుండా జగన్ అన్ని ప్రయత్నాలూ చేస్తున్నారని ఆరోపించారు.

'వివేకా' హంతకులకు జగనే రక్షకుడు

- టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్య

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డిని హత్యచేసిన వారిని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రక్షిస్తున్నారని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్య విమర్శించారు. టిడిపి కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వివేకాను చంపిన హంతకులు జగన్ పక్కనే ఉన్నారనే విషయం రాష్ట్ర ప్రజలందరికీ తెలుసని అన్నారు. చంద్రబాబు గెలిస్తే సంక్షేమ పథకాలు ఆగిపోతాయని సిఎం జగన్, సజ్జల రామకృష్ణారెడ్డి తప్పుడు ప్రచారం చేస్తున్నారని, వీటిని ప్రజలు నమ్మొద్దని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు ఎంఎ షరీఫ్ కోరారు. సిఎం క్యాంపు కార్యాలయం నుంచి వెళ్లిన కంటెయినర్లలో ప్యాంట్రీ అని సజ్జల అబద్ధాలు చెబుతున్నారని అన్నారు. ఎపిఎమ్‌డిసి అసిస్టెంట్ మేనేజరు పి హేమంత్‌కుమార్ రెడ్డి ప్రజా సొమ్మును వేతనంగా తీసుకుంటూ వైసిపి ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్నారని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారికి షరీఫ్ లేఖ రాశారు.

తిరుపతి కలెక్టరుపై చర్యలు తీసుకోవాలి : కూటమి నేతలు

పెద్దయెత్తున వైసిపి తాయిళాలు బయటపడినా చూసీచూడనట్లు వ్యవహరించిన తిరుపతి జిల్లా కలెక్టరుపై చర్యలు తీసుకోవాలని టిడిపి, జనసేన, బిజెపి కూటమి నాయకులు.. రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్‌కుమార్ మీనాకు ఫిర్యాదు చేశారు. శ్రీకాళహస్తిలో గోడౌన్ గుట్టు రట్టు చేసినా కలెక్టరుకు చీమ కుట్టినట్లు కూడా లేదన్నారు. మీనాను కలిసిన వారిలో టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్య, ఆ పార్టీ అధికార ప్రతినిధి సయ్యద్ రఫీ, బిజెపి నేతలు పార్థసారథి, పాతూరి నాగభూషణం, జనసేన నేతలు చిల్లపల్లి శ్రీనివాసరావు, బేతపూడి విజయ్ శేఖర్ తదితరులు ఉన్నారు.

రేపటి నుంచి పవన్ ఎన్నికల శంఖారావం

- 3 రోజుల పాటు పిఠాపురంలోనే సమావేశాలు
- రాష్ట్ర వ్యాప్త పర్యటనకు సిద్ధమవుతున్న జనసేనాని



ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

తూర్పు సెంటిమెంట్‌తో జనసేన అధినేత పవన్ కల్యాణ్ కాకినాడ జిల్లా పిఠాపురం నుంచి ఎన్నికల శంఖారావం పూరించనున్నారు. ఈ నెల 30 నుంచి ఆయన ఎన్నికల ప్రచారానికి సన్నద్ధమవుతున్నారు. పవన్ కల్యాణ్ పోటీ చేస్తున్న నియోజకవర్గం కావడంతో పిఠాపురం కేంద్రంగానే రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నికల ప్రచారానికి వెళ్లనున్నారని పార్టీ శ్రేణులు తెలిపాయి. అందుకు అనుగుణంగా ఇప్పటికే పర్యటన షెడ్యూల్‌ను కూడా సిద్ధం చేశారు. తొలి మూడు రోజులూ పిఠాపురం నియోజకవర్గంలోనే ఉండి ముఖ్య నాయకులతో సమావేశాలు నిర్వహిస్తారు. ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కార్యకర్తలకు ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ దిశా, నిర్దేశం చేయనున్నారు. జనసేనలో పనిచేస్తున్న అన్ని విభాగాల నాయకులతో సమావేశం కానున్నారు. క్రియాశీలక కార్యకర్తలతో మండలాలవారీగా సమావేశాలు నిర్వహించనున్నారు. అలాగే కూటమి భాగంగా ఉన్న టిడిపి, బిజెపి నాయకులతోనూ ఆయన భేటీ కానున్నారు. మూడు విడతలుగా చేయనున్న ప్రచారం నేపథ్యంలో ప్రతి విడతలో జనసేన పోటీ చేసే నియోజకవర్గాలకు వెళ్లేలా షెడ్యూల్ రూపొందిస్తున్నారు. స్థానికంగా ఉన్న ప్రముఖ ఆలయాలను దర్శించి వారాహి వాహనానికి పూజలు చేయిస్తారని పార్టీ నాయకులు తెలిపారు. ఉగాది వేడుకలను సైతం పిఠాపురంలోనే నిర్వహించుకోబోతున్నారని తెలిపారు.

సరుకు రవాణాలో విశాఖ పోర్టు సరికొత్త రికార్డు

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ (విశాఖపట్నం)


విశాఖపట్నం పోర్టు అథారిటీ సరుకు రవాణాలో నూతన రికార్డును నెలకొల్పిందని పోర్టు కార్యదర్శి టి వేణుగోపాల్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆర్థిక సంవత్సరం ముగింపునకు మరో నాలుగు రోజులు మిగిలి ఉండగానే పోర్టు చరిత్రలోనే మొదటి సారి 80 (80.05ఎంఎంటిపిఎ) మిలియన్ మెట్రిక్ టన్నుల రికార్డును అధిగమించిందని పేర్కొన్నారు. ఈ ఏడాది క్రూడ్ ఆయిల్ రవాణాలో 27 శాతం, ఇనుప ఖనిజం 12 శాతం, ఎరువులు ఆరు శాతం పెరుగుదలను నమోదు చేశాయని తెలిపారు. 43 భీమ్ కలిగిన బేబీ కేప్ నౌకలు గత ఏడాదితో పోల్చుకుంటే అధికంగా ఇన్నర్ హార్బర్‌లో కార్యకలాపాలు నిర్వహించాయని వివరించారు. పోర్టులోనికి వచ్చిన నౌకలలో సైతం 35 శాతం పెరుగుదల నమోదైందని పేర్కొన్నారు. విశాఖ కంటైనర్ టెర్మినల్ సైతం 28 శాతం అధికంగా 6.65 లక్షల టిఇయులను హ్యాండిల్ చేసిందని తెలిపారు. ప్రి బెర్తింగ్ డిటెన్షన్‌లో 68 శాతం, టర్న్ అరౌండ్ టైం, అవుట్ పుట్ పర్ షిప్ బెర్త్ డేలో పది శాతం, ఐడల్ టైం బెర్తింగ్‌లో ఎనిమిది శాతం మెరుగుదలను నమోదు చేసిందన్నారు. 2023 మే, జూన్, అక్టోబర్, జనవరి 2024 నెలలో అత్యధిక సరుకు రవాణా రికార్డులను నమోదు చేసిందని తెలిపారు. 2023 జూన్ 17 చేసిన ఎగుమతులు, దిగుమతుల్లో 4,01,875 మిలియన్ టన్నుల ఒక్క రోజులో అత్యధిక సరుకు రవాణా రికార్డును తిరగరాసిందని పేర్కొన్నారు.

ఈ ఘనతను సాధించడం పట్ల పోర్టు చైర్మన్ డాక్టర్ ఎం అంగముత్తు సంతోషం వ్యక్తం చేశారు. నూతన రికార్డును సృష్టించడంలో కీలకంగా వ్యవహరించిన ట్రాఫిక్ మేనేజర్, అతని బృందాన్ని ప్రశంసించారు. పోర్టు ఉద్యోగులు మరింత శ్రమించడం ద్వారా నూతన రికార్డులను అధిగమించవచ్చని అభిప్రాయపడ్డారు.

అంబానీ, అదానీ తొలిసారి జట్టు

- అదానీ పవర్ ప్రాజెక్ట్‌లో రిలయన్స్‌కు 26% వాటా

న్యూఢిల్లీ : భారత కార్పొరేట్ దిగ్గజాలు, ఇప్పటి వరకు ప్రత్యర్థి కుబేరులుగా కనబడుతున్న అంబానీ, అదానీలు తొలిసారి జట్టు కట్టారు. గౌతం అదానీకి చెందిన మధ్యప్రదేశ్ పవర్ ప్రాజెక్ట్‌లో రిలయన్స్ ఇండస్ట్రీస్ 26 శాతం వాటాను సొంతం చేసుకుంది. అదానీ పవర్ లిమిటెడ్‌కు చెందిన పూర్తి అనుబంధ సంస్థ అయిన మహన్ ఎనర్జెన్ లిమిటెడ్ (ఎంఇఎల్)లో రిలయన్స్ 5 కోట్ల ఈక్విటీ షేర్లను రూ.10 ముఖ విలువతో తీసుకోవడం ద్వారా 26 శాతం వాటాను పొందింది.. అదే విధంగా క్యాప్టివ్ ఉపయోగం కోసం 500 మెగావాట్ల ఉత్పత్తి సామర్థ్యాన్ని ఉపయోగించుకోనుంది. ఇందుకోసం ఇరు సంస్థల మధ్య కీలక ఒప్పందం జరిగినట్లు ఆ సంస్థలు గురువారం స్టాక్ ఎక్సేంజీలకు సమాచారం ఇచ్చాయి. "అదానీ పవర్ లిమిటెడ్‌కు చెందిన ఎంఇఎల్‌తో రిలయన్స్ ఇండస్ట్రీస్ క్యాప్టివ్ యూజర్ కింద 500 మెగావాట్ల కోసం 20 సంవత్సరాల దీర్ఘకాలిక విద్యుత్ కొనుగోలు ఒప్పందం కుదుర్చుకుంది. ఎలక్ట్రిసిటీ రూల్స్ 2005 పాలసీ ప్రకారం ఈ నిర్ణయం జరిగింది." అని అని అదానీ పవర్ తన ఫైలింగ్‌లో తెలిపింది.



గుజరాత్‌కు చెందిన అంబానీ, అదానీలు ఇద్దరు తరచూ మీడియాలో ఒకరిపై ఒకరు పోటీ పడుతున్నట్లు కనిపిస్తుంటారు. సంపద ఆర్జనలో ఆసియాలో ఒక్కరిపై ఒక్కరు పోటీపోటీగా వ్యవహారిస్తున్నట్లు బయటికి కనిపించినప్పటికీ.. అంతర్గతంగా వీరిద్దరి మధ్యలో చాలా సక్యత ఉందని తాజా ఒప్పందం సహా పలు ఘటనలు రుజువు చేస్తున్నాయి. చమురు, గ్యాస్, రిటైల్, టెలికాం తదితర రంగాల్లో అంబానీ ఆదిపత్యం కలిగి ఉన్నారు. విమానాశ్రయాలు, బొగ్గు, మైనింగ్, మౌలిక వసతులు తదితర రంగాల్లో గుత్తాదిపత్యం కలిగి ఉన్నారు. ఇరువురు క్లీన్ ఎనర్జీ వ్యాపారంలో తప్పా మరే వ్యాపారాల్లోనూ పెద్దగా పోటీపడటం లేదు.

5జి స్పెక్ట్రం వేలంలో అదానీ గ్రూపు దరఖాస్తు చేసుకున్నప్పుడూ.. ఇరువురి మధ్య తీవ్ర పోటీ నెలకొననుందని అందరూ భావించారు. కానీ అంబానీలా కాకుండా, అదానీ 26 గిగాహెడ్జ్ బ్యాండ్‌లో కేవలం 400 మెగాహెడ్జ్ స్పెక్ట్రమ్‌ను మాత్రమే కొనుగోలు చేశారు. ఇదీ అదానీ కంపెనీల సొంత అవసరాలకు వినియోగించుకోవడానికి మాత్రమే. 2022లో ఎన్‌డిటివిని అదానీ స్వాధీనం చేసుకున్న సమయంలో ఇందులో అంబానీకి ఉన్న స్వల్ప వాటాలను అదానీకి స్వాధీనం చేయడం ద్వారా విక్రయ ప్రక్రియను సులభతరం చేశారు. మరోవైపు ఈ నెల ప్రారంభంలో జామ్‌నగర్‌లో అంబానీ చిన్న కుమారుడు అనంత్ ప్రీ వెడ్డింగ్ వేడుకలకు అదానీ కూడా హాజరయ్యారు. తాజా ఒప్పందం కార్పొరేట్ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశం అవుతోంది.

యుఎఇలోనూ ఇక ఫోన్‌పే చెల్లింపులు

- నియోపేతో ఒప్పందం

న్యూఢిల్లీ : ప్రముఖ డిజిటల్ చెల్లింపుల వేదిక ఫోన్‌పే సేవలు ఇకపై యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యుఎఇ) లో నూ ఉపయోగించుకోవడానికి వీలుంది. ఇందుకోసం ఆ సంస్థ అక్కడి నియోపేతో ఒప్పందం కుదుర్చుకుంది.



దీంతో యుఎఇలోని నియోపే టెర్మినల్స్‌లో చెల్లింపులు చేయవచ్చు. "ప్రతీ ఏడాది లక్షలాది మంది యుఎఇని సందర్శిస్తారు. తమ భాగస్వామ్యం ద్వారా అవాంతరాలు లేని లావాదేవీలకు దోహదం చేయనుంది." అని ఫోన్‌పే ఇంటర్నేషనల్ పేమెంట్స్ సిఇఒ రితేష్ పాయ్ పేర్కొన్నారు. ఇది రెండు దేశాల మధ్య ఇప్పటికే బలంగా ఉన్న ఆర్థిక సంబంధాలను మరింత సుస్థిరం చేయడానిక సహాయపడనుందని నియోపే సిఇఒ విభోర్ ముందాడ ఆశాభావం వ్యక్తం చేశారు.

సీనియర్ ఉద్యోగులకు అమెజాన్ మొండి చెయ్యి

న్యూయార్క్ : ప్రముఖ ఇ-కామర్స్ కంపెనీ అమెజాన్‌లో పని చేసే సీనియర్ ఉద్యోగులను ఆ కంపెనీ నిరాశపర్చనుందని సమాచారం. వారి మూల వేతనంలో ఎలాంటి పెంపు చేపట్టరాదని భావిస్తోందని రిపోర్టులు వస్తున్నాయి. గత ఏడాది కాలంగా అమెజాన్ షేర్ ధర పెరగడంతో పలువురు ఉద్యోగుల మొత్తం వేతనం ముందుగా అనుకున్న దాని కంటే భారీగా పెరుగుతున్నదని అమెజాన్ ప్రతినిధి పేర్కొన్నారు. దీంతో అమెజాన్ ప్రధానంగా స్టాక్ ఆప్షన్‌ల కంటే వేతనంపై ఆధారపడిన ఉద్యోగులకు మాత్రమే నగదు రూపంలో వేతన ప్రయోజనాలను అందించడంపై దృష్టి సారిస్తోందన్నారు.

టయోటా కార్ల ధరల పెంపు

న్యూఢిల్లీ : ప్రముఖ ప్రీమియం కార్ల తయారీ సంస్థ టయోటా కిర్లోస్కర్ మోటార్ (టికెఎం) ఈ ఏడాదిలో రెండో సారి కార్ల ధరలను పెంచుతున్నట్లు ప్రకటించింది. తాజాగా ఎంపిక చేసిన మోడళ్లపై 1 శాతం వరకు ధరలను హెచ్చిస్తున్నట్లు గురువారం తెలిపింది. కొత్త ధరలు ఏప్రిల్ ఒక్కటో తేది నుంచి అమల్లోకి వస్తాయని పేర్కొంది. ముడి సరకుల ధరలు, నిర్వహణ ఖర్చులు పెరిగిన కారణంగా ఈ పెంపు నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది. ఇంతక్రితం జనవరిలోనూ ధరలను పెంచింది.

మరిన్ని ఉత్పత్తుల్లో సామ్‌సంగ్ గెలాక్సీ ఎఐ ఫీచర్లు

న్యూఢిల్లీ : ప్రముఖ ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తుల కంపెనీ సామ్‌సంగ్ తన గెలాక్సీ ఎఐ ఫీచర్లను మరిన్ని ఉత్పత్తులకు విస్తరిస్తున్నట్లు తెలిపింది. ఇటీవలే గెలాక్సీ ఎస్24లో తొలుత నోట్ అసిస్ట్, లైవ్ ట్రాన్స్‌లేట్, జనరేటివ్ ఎడిట్ తదితర ఎఐ బహుళ ఫీచర్లను అందించింది. ఈ ఫీచర్లను గెలాక్సీ ఎస్23, సిరిస్, గెలాక్సీ జడ్ ఫోల్డ్5, జడ్ ఫ్లిప్5, టాప్ ఎస్9 సిరీస్‌లోనూ అందుబాటులోకి తెస్తున్నట్లు తెలిపింది.

సోలార్ ప్యానెల్స్ తయారీలోకి లూమినస్

రుద్రాపూర్ : లూమినస్ పవర్ టెక్నాలజీస్ కొత్తగా సోలార్ ప్యానెల్స్ తయారీలోకి ప్రవేశించింది. ఉత్తరాఖండ్‌లోని రుద్రాపూర్‌లో అత్యాధునిక తయారీ ప్లాంట్‌ను ఏర్పాటు చేసింది. దీనిని గురువారం ప్రముఖ క్రికెటర్ సచిన్ టెండుల్కర్ లాంచనంగా ప్రారంభించారు. తొలి దశలో రూ.120 కోట్లతో 250 మెగావాట్ సామర్థ్యంతో ఉత్పత్తిని ప్రారంభిస్తున్నట్లు లూమినస్ పవర్ టెక్నాలజీస్ ఎండి, సిఇఒ ప్రీతీ బజాజ్ తెలిపారు. ఈ ప్లాంట్‌ను 1గిగావాట్‌కు విస్తరించనున్నామన్నారు.

పిజిఐఎం నుంచి రిటైర్మెంట్ ఫండ్ ఆవిష్కరణ

ముంబయి : పిజిఐఎం ఇండియా మ్యూచువల్ ఫండ్ సంస్థ కొత్తగా రిటైర్మెంట్ ఫండ్‌ను ఆవిష్కరించినట్లు ప్రకటించింది. ఈ ఫండ్ ఐదేళ్లు లేదా పదవీ విరమణ వయస్సు వరకు లాక్-ఇన్ పిరియడ్ కలిగి ఉంటుందని పేర్కొంది. ఏప్రిల్ 09 వరకు తెరిచి ఉంచబడుతుందని ఆ సంస్థ తెలిపింది. ఈ నిధులను బిఎస్ఇలోని 500 సూచీల్లో పెట్టుబడిగా పెట్టనున్నట్లు పేర్కొంది.

సంపాదకీయం

మీడియా స్వేచ్ఛకు విఘాతం

ఒక సమాచారం ఇవ్వడం వల్ల ఎక్కువ నష్టం జరుగుతుందా? లేక ఆ సమాచారాన్ని వెల్లడించే హక్కును నిషేధించటం వల్ల ఎక్కువ నష్టం జరుగుతుందా? అన్న ప్రశ్నలకు సమాధానాన్ని వివేకంతో, విచక్షణతో బేరీజు వేసిన తరువాతనే మీడియాపై చర్యలకు పూనుకోవాలని దేశ అత్యున్నత న్యాయస్థానం గత వారం బ్లూమ్‌బెర్గ్ వెర్సస్ జీ ఎంటర్‌టైన్‌మెంట్స్ కేసులో వ్యాఖ్యానించింది. మన రాజ్యాంగంలోని 19 (1) అధికరణం కల్పించిన భావ ప్రకటన, వాక్ స్వాతంత్ర్య హక్కును పరిరక్షించటానికే ప్రప్రథమ ప్రాధాన్యం ఇవ్వాలని ప్రత్యేకించి ట్రయిల్ కోర్టులకు సూచించింది. మీడియాపై కత్తి కట్టి వ్యవహరిస్తూ, పత్రికాస్వేచ్ఛను కర్కశంగా అణచివేస్తున్న పాలకుల ఏలుబడిలో సుప్రీంకోర్టు ఈ తరహా వ్యాఖ్యలు చేయడం హర్షణీయం. ప్రజలకు అవసరమైన సమాచారాన్ని సేకరించటం, ప్రచురించటం, ప్రసారం చేయడం మీడియా బాధ్యత. ఇతరుల వ్యక్తిగత స్వేచ్ఛకు, గోప్యతకు భంగం కలక్కుండా ఎక్కడ, ఏం జరుగుతుందో తెలుసుకోవడం ప్రజల హక్కు. పౌరులకు ఉన్న సమాచార హక్కును, దానిని నెరవేర్చేందుకు దోహదపడే మీడియా స్వేచ్ఛను తగిన విధంగా పరిరక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వ, పాలక యంత్రాంగాలది. పాలనలో పారదర్శకత, ప్రవర్తనలో ప్రజా విధేయత ఉన్న పాలక పక్షాల నుంచి దాపరికం లేని సమాచారాన్ని ఆశించవచ్చు. కానీ, అందుకు భిన్నంగా వ్యవహరించే ప్రభుత్వాల నుంచి, నిజాలను మాట్లాడితే సహించలేని పాలకుల నుంచి సహకారాన్ని కాక, పచ్చి నిరంకుశ ధోరణులను ఎదుర్కోవల్సి వస్తోంది.

తాజాగా ఢిల్లీలో ముఖ్యమంత్రి కేజ్రీవాల్ అరెస్టుపై ఆ పార్టీ మద్దతుదారుల నిరసనను కవర్ చేస్తున్న జర్నలిస్టులపై పోలీసులు విరుచుకుపడ్డ తీరు తీవ్ర అభ్యంతరకరం. ఎన్నికలకు ముందు ప్రతిపక్షాలను బలహీనపర్చటమే ధ్యేయంగా పెట్టుకున్న బిజెపి రకరకాల రూపాల్లో నిర్బంధ చర్యలకు దిగుతోంది. ఇందుకోసం ఇడి, సిబిఐ, ఐటి తదితర అంగాలను వినియోగిస్తున్న తీరు దేశ ప్రజలను విస్మయపరుస్తూనే ఉంది. ఇలాంటి ఘటనలపై నిరసనలను సైతం నియంత్రించాలనుకోవడం, వాటిని నివేదించే జర్నలిస్టులపైనా అమానుషంగా దాడులకు తెగబడడం దారుణం. తమకు వ్యతిరేకంగా ఒక్క గొంతూ వినిపించకూడదనుకోవడం, బలవంతాన నొక్కేయాలనుకోవడం ప్రజాస్వామ్యానికి ప్రమాదకరం..

మోడీ ప్రభుత్వ హయాంలో మన దేశంలో పత్రికాస్వేచ్ఛ, భావ ప్రకటనా స్వేచ్ఛ దారుణాతిదారుణంగా హరించుకుపోయాయి. కోట్ల రూపాయల పెట్టుబడులతో నడిచే ప్రధాన మీడియాపై బిజెపి గట్టి నియంత్రణ సాధించింది. దాని ఏలుబడిలో ఎన్ని విధానపరమైన వైఫల్యాలు జరిగినా, ఎన్ని వ్యూహాత్మక విద్వేషాలు రగిలినా ... మీడియా నుంచి తందానతాన చందాన పొగడ్తలను, సమర్థింపులను మాత్రమే కోరుకుంటోంది. కొద్దిపాటి ప్రజాపక్ష మీడియా సంస్థలూ, కొంతమంది జనహిత జర్నలిస్టులూ బిజెపి వైఫల్యాలను, దుర్మార్గాలను గొంతెత్తి చెప్పబోతే దారుణమైన అణచివేతకు, వేధింపులకూ బరితెగిస్తోంది. హత్రాస్ ఘోరాన్ని కవర్ చేయటానికి వెళ్లబోతుంటే జర్నలిస్టు కప్పన్‌ను దారిలోనే అరెస్టు చేసి, ఉపా కేసు బనాయించి రెండేళ్ల పాటు జైల్లో ఉంచింది. అన్నదాతల ఆందోళనకు మద్దతుగా మాట్లాడిందని సామాజిక కార్యకర్త దిశారవిని తీవ్రంగా వేధించింది. రైతు ఉద్యమ వార్తలను రాసినందుకు న్యూస్‌క్లిక్ సంపాదకుడు పుర్కాయస్త తదితరులపై దేశద్రోహ కేసులు బనాయించి, జైల్లో పెట్టింది. ప్రజల పక్షాన రాసిన, మాట్లాడిన అనేకమంది జర్నలిస్టులను, సామాజిక కార్యకర్తలను వెంటాడి వేధించటం, దాడులు చేయించటం, తీవ్రమైన కేసులు మోపటం వంటి కక్షపూరిత చర్యలతో భయోత్పాతం సృష్టించటం ఒక విధానంగా కొనసాగిస్తోంది. ఈ కుట్రపూరిత ఆచరణ వల్లనే ప్రజాస్వామ్య దేశంగా చెప్పుకునే మనదేశం పత్రికాస్వేచ్ఛలో ప్రపంచంలో 161వ స్థానానికి దిగజారిపోయింది! భావ ప్రకటన, పత్రికాస్వేచ్ఛ రాజ్యాంగం కల్పించిన హక్కు. దానిని కఠినంగా తొక్కిపెట్టాలనుకోవడం నియంతృత్వానికి దారి తీస్తుంది. హిట్లర్ తదితర నియంతలు ఇలాంటి అణచివేత చర్యలకే పాల్పడి, చరిత్ర హీనులుగా మిగిలిపోయారు. బిజెపి పాలకులు కూడా ఆ దిశగానే పరుగులు పెడుతున్నారు.

మహనీయుల మాట



'నిజం' కూడా ప్రతి రోజు ప్రచారంలో ఉండాలి. లేకుంటే 'అబద్ధం' నిజంగా మారి రాష్ట్రాన్ని, దేశాన్నే కాదు ప్రపంచాన్నే నాశనం చేస్తుంది.

- డా॥ బి.ఆర్. అంబేద్కర్,
భారత రాజ్యాంగ నిర్మాత.

2024 ఎన్నికలు బిజెపికి కష్టమే


విశ్లేషణ



ఎం.వి. గోవిందన్

పద్దెనిమిదవ లోక్‌సభ ఎన్నికల తొలి దశగా ఏప్రిల్ 19న పోలింగ్ జరగనున్న 102 నియోజక వర్గాలకు నామినేషన్ పత్రాల సమర్పణ పూర్తయింది. రెండో దశలో ఎన్నికలు జరగనున్న కేరళ సహా నియోజకవర్గాల ఎన్నికల ప్రక్రియ కూడా ప్రారంభమైంది. ఈ పరిస్థితులలో ఎన్నికల చిత్రపటాన్ని సమీక్షించినట్లయితే ఒక్కటి మాత్రం స్పష్టంగా చెప్పవచ్చు. బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎ మూడోసారి గెలవడం కష్టమే. 400 పైగా సీట్లు గెలుస్తానని ప్రధాని మోడీ పదే పదే ప్రకటించడం కేవలం తన పార్టీ కార్యకర్తలను వెంట నిలుపుకోవడానికి చేస్తున్న జిమ్మిక్కేనని రోజురోజుకూ స్పష్టమవుతోంది.

గత రెండు లోక్‌సభ ఎన్నికల మాదిరిగా కాకుండా ఈసారి ఎన్‌డియేకు అనేక ప్రతికూల అంశాలు ఉన్నాయి. అందులో ముఖ్యమైనది ఎలక్టోరల్ బాండ్ స్కామ్. ఈ స్కామ్‌తో బిజెపి అవినీతి వ్యతిరేక ముసుగు తొలగిపోయింది. తప్పుడు ఎత్తుగడల ద్వారా కార్పొరేట్లకు లాభాలు కూడబెట్టుకునే అవకాశాలు కల్పించింది. అందుకుగాను క్విడ్ ప్రో కో (నీకు ఇంత నాకు అంత) పద్ధతుల్లో కార్పొరేట్ల నుంచి బిజెపికి భారీగా ముడుపులు అందాయని ప్రజలకు అర్థమైంది. సుప్రీంకోర్టు జోక్యం తర్వాత, ఎలక్టోరల్ బాండ్లకు సంబంధించిన మొత్తం సమాచారాన్ని ఎస్‌బిఐ విడుదల చేసింది. ప్రతిపక్ష ప్రభుత్వాలను పడగొట్టడానికి, ప్రతిపక్ష పార్టీలను చీల్చడానికి అవసరమైన ఎమ్మెల్యేలను కార్పొరేట్ల ద్వారా కొనుగోలు చేసిందనేది స్పష్టమైంది. ఇక్కడ ప్రజాస్వామ్యం ఖూనీ అవుతోంది. బిజెపి చేసిన ఈ మెగా స్కాం ఎన్నికల ప్రధాన అంశంగా మారింది.



ప్రతిపక్ష ప్రభుత్వాలను పడగొట్టడానికి, ప్రతిపక్ష పార్టీలను చీల్చడానికి అవసరమైన ఎమ్మెల్యేలను కార్పొరేట్ల ద్వారా కొనుగోలు చేసిందనేది స్పష్టమైంది. దీని నుంచి ప్రజల దృష్టిని మరల్చేందుకు ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత అరవింద్ కేజ్రీవాల్‌ను మద్యం అవినీతి కేసులో ఇ.డి అరెస్టు చేసి జైలుకు పంపింది. ఎన్నికల నియమావళి అమలులోకి వచ్చిన తర్వాత కేజ్రీవాల్ అరెస్ట్ జరిగింది. నిష్పక్షపాతంగా, పోలింగ్ నిర్వహించాల్సిన ఎన్నికల సంఘం మౌనం వహించడం పెద్ద మిస్టరీగా మారింది.

దీని నుంచి ప్రజల దృష్టిని మరల్చేందుకు ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత అరవింద్ కేజ్రీవాల్‌ను మద్యం అవినీతి కేసులో ఇ.డి అరెస్టు చేసి జైలుకు పంపింది. ఎన్నికల నియమావళి అమలులోకి వచ్చిన తర్వాత కేజ్రీవాల్ అరెస్ట్ జరిగింది. నిష్పక్షపాతంగా, పోలింగ్ నిర్వహించాల్సిన ఎన్నికల సంఘం మౌనం వహించడం పెద్ద మిస్టరీగా మారింది. బిజెపి డబ్బు పుచ్చుకుందన్న విషయం ఎస్‌బిఐ పత్రాల ద్వారా తెలుస్తున్నది. కానీ కేజ్రీవాల్ డబ్బు తీసుకున్నారన్న దానికి ఇ.డి ఇంతవరకు ఆధారాలు ఇవ్వలేకపోయింది. అయితే మద్యం కుంభకోణం కేసు నిందితుడి నుంచి బిజెపి డబ్బులు తీసుకున్నట్లు స్పష్టమైన ఆధారాలు ఉన్నాయి. అయినా నిందితులను, నిందితుల నుంచి డబ్బులు తీసుకున్న బిజెపి నాయకత్వాన్ని ప్రశ్నించడం లేదు, అరెస్టు చేయడం లేదు. కేజ్రీవాల్ మాత్రం జైల్లో ఉన్నారు. ఇక్కడ బిజెపి ద్వంద్వ నీతిని ప్రజలు గమనిస్తున్నారు. మార్చి 31న ఢిల్లీలోని రామ్ లీలా మైదాన్‌లో జరగనున్న ర్యాలీ... అవినీతిపరులను కాపాడుతూ, ప్రతి పక్షాలపై వేటు వేస్తున్న మోడీ ప్రభుత్వానికి ఓ హెచ్చరిక వంటిది. అంతేగాక, మోడీ ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డాయన్న స్పష్టమైన సందేశాన్ని ఇవ్వనుంది. 'ఇండియా' వేదికకు చెందిన ప్రముఖులందరూ ఈ ర్యాలీలో పాల్గొంటారు. గత రెండు లోక్‌సభ ఎన్నికలలో ఢిల్లీ నుంచి బిజెపి ఏడు స్థానాలను గెలుపొందిందిగాని, ఈ సారి ఆ పరిస్థితి లేదన్నది స్పష్టం.

గత రెండు లోక్‌సభ ఎన్నికలకు భిన్నమైన అంశం ఒకటి మన ముందుంది. 'ఇండియా' బ్లాక్ కొన్ని రాష్ట్రాలు మినహా దేశమంతటా బిజెపిని ఐక్యంగా ఎదుర్కొంటోంది. ఉత్తరప్రదేశ్, తమిళనాడు, హర్యానా, ఢిల్లీ, రాజస్థాన్, మధ్యప్రదేశ్‌లో సీట్ల ఒప్పందం కుదిరింది. బీహార్, మహారాష్ట్రలలో ఈ ఒప్పందాన్ని త్వరలో అమలు చేయనున్నారు. అంటే 300 పైగా స్థానాల్లో 'ఇండియా' బ్లాక్ బిజెపితో నేరుగా ఢీకొనే అవకాశం ఉంది. ఈ దెబ్బకు బిజెపి కంచుకోటలు బీటలు వారతాయనడంలో సందేహం లేదు.

ప్రస్తుత రాజకీయ పరిస్థితులను పరిశీలిస్తే హర్యానా, ఢిల్లీ, మహారాష్ట్ర, బీహార్, పశ్చిమ బెంగాల్, జార్ఖండ్ రాష్ట్రాల్లో బిజెపికి సీట్లు తగ్గవచ్చు. హర్యానా లోని జాట్ సామాజిక వర్గం బిజెపి కి వ్యతిరేకంగా మారి, ఆ పార్టీకి కునుకు లేకుండా చేస్తోంది. మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన బిజెపి ఎంపీకి మద్దతునివ్వడం, మద్దతు ధర కోరుతూ రైతులు చేస్తున్న సమ్మెకు వ్యతిరేక వైఖరి తీసుకోవడం, అగ్నివీర్ పథకాన్ని తీసుకురావాలనుకోవడం... వంటి కారణాల వల్ల వారు బిజెపి పట్ల ఆగ్రహంగా వున్నారు. దీన్ని చల్లార్చేందుకే హర్యానా ముఖ్యమంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌ను మార్చారని, కానీ ఆశించిన ఫలితాలు కనిపించడం లేదని అక్కడి మీడియాలో కథనాలు వస్తున్నాయి. అక్కడ బిజెపి సగం సీట్లు మాత్రమే గెలుస్తుందని సమాచారం. బిజెపి కి కంచుకోట అయిన గుజరాత్‌లో కూడా తాము ఎన్నికలలో పోటీ చేయలేమంటూ అభ్యర్థులు వెనక్కి తగ్గడం మోడీ-షా నాయకత్వానికి పెద్దగా ఆశ్చర్యం కల్గించడంలేదు.

> ప్రస్తుత రాజకీయ పరిస్థితులను పరిశీలిస్తే హర్యానా, ఢిల్లీ, మహారాష్ట్ర, బీహార్, పశ్చిమ బెంగాల్, జార్ఖండ్ రాష్ట్రాల్లో బిజెపికి సీట్లు తగ్గవచ్చు. హర్యానా లోని జాట్ సామాజిక వర్గం బిజెపి కి వ్యతిరేకంగా మారి, ఆ పార్టీకి కునుకు లేకుండా చేస్తోంది. మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన బిజెపి ఎంపీకి మద్దతునివ్వడం, మద్దతు ధర కోరుతూ రైతులు చేస్తున్న సమ్మెకు వ్యతిరేక వైఖరి తీసుకోవడం, అగ్నివీర్ పథకాన్ని తీసుకురావాలనుకోవడం... వంటి కారణాల వల్ల వారు బిజెపి పట్ల ఆగ్రహంగా వున్నారు. దీన్ని చల్లార్చేందుకే హర్యానా ముఖ్యమంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌ను మార్చారని, కానీ ఆశించిన ఫలితాలు కనిపించడం లేదని అక్కడి మీడియాలో కథనాలు వస్తున్నాయి.

మహారాష్ట్రలో బిజెపి కి గట్టి ఎదురుదెబ్బ తగులుతుందని ప్రాథమిక అంచనా. ఉద్ధవ్ థాకరే నేతృత్వంలోని శివసేన, శరద్ పవార్ ఎన్‌సిపిలను చీల్చి అధికారాన్ని చేజిక్కించుకున్న మోడీ, షాల తీరును మహారాష్ట్ర ప్రజలు అంగీకరించడం లేదు. పార్టీలను చీల్చడమే కాకుండా ఎన్నికల గుర్తులను కూడా లాక్కున్నారనే భావన బలంగా ఉంది. అజిత్ పవార్ ఎన్‌సిపి, షిండే అధీనంలోని శివసేన ఎమ్మెల్యేలు మాత్రమే బిజెపితో ఉన్నారు. ఆ పార్టీల కార్యకర్తలు చెక్కుచెదరలేదన్నది వాస్తవం. అందుకే ఎలాంటి ప్రజాభిమానం లేని రాజ్ థాకరే పార్టీని అమిత్ షా ఎన్‌డియేలో భాగస్వామిని చేశారు. రాజ్ థాకరే ఎన్‌డియే లోకి రావడం షిండే వర్గాన్ని కలవరపరిచింది. ఉత్తర భారతీయులను నిరంతరం అవమానిస్తూ, వారిపై విద్వేషపూరిత ప్రకటనలు చేసిన రాజ్ థాకరేను బిజెపి కూటమిలో చేర్చుకోవడం వల్ల ఆ ప్రాంతంలో బిజెపి ఓట్లు గల్లంతు కావచ్చు.

ఎన్‌డియే పరిస్థితి బీహార్‌లో కూడా గత ఎన్నికల కంటే దారుణంగా ఉంది. నితీష్ కుమార్ ఎత్తుగడ ఆయన ప్రతిష్టను దెబ్బతీసింది. పశుపతి కుమార్ పరాస్ 'రాష్ట్రీయ లోక్ జనశక్తి పార్టీ' ఎన్‌డియే నుంచి నిష్క్రమించడం కూడా కూటమిని బలహీనపరుస్తుంది. ఒడిశాలో బిజెడి, పంజాబ్‌లో అకాలీదళ్‌తో పొత్తు పెట్టుకునేందుకు బిజెపి చేసిన ప్రయత్నమూ విఫలమైంది. గత రెండు ఎన్నికలలో పొత్తుల గురించిన ఆలోచనే చేయని బిజెపి...ఈసారి మిత్రపక్షాల కోసం వెంపర్లాడడం ఆ పార్టీ గడ్డు పరిస్థితికి నిదర్శనం.


కేరళలో బిజెపికి ఏ మాత్రం ఆశ లేదు. గత ఎన్నికలలో వచ్చిన ఓట్లను నిలబెట్టుకోవడం కూడా కష్టమే. వారి ఏకైక ఆశ కాంగ్రెస్ నేతృత్వంలోని యుడిఎఫ్ పైనే ఉంది. కేరళలో కాంగ్రెస్‌కు ప్రధాన శత్రువు సిపిఎం. బిజెపి కాదు. కేరళ కోసం రాష్ట్ర ప్రభుత్వం, ఎల్.డి.ఎఫ్‌లు చేసిన పోరాటాల్లోనూ యు.డి.ఎఫ్ పాల్గొనలేదు. రాష్ట్ర ఆర్థిక హక్కుల కోసం...లౌకికవాదం, ప్రజాస్వామ్యంతో సహా రాజ్యాంగం ప్రతిపాదించిన ఆలోచనలను పరిరక్షించడం కోసం...కేరళ ప్రజలు చేసిన పోరాటాలకు కాంగ్రెస్, యు.డి.ఎఫ్ వెన్నుపోటు పొడిచాయి. దీన్ని అర్థం చేసుకున్న ఆ రాష్ట్ర ప్రజలు ఎల్.డి.ఎఫ్‌కు పెద్దఎత్తున మద్దతు ఇస్తున్నట్లు గమనించవచ్చు. ఎన్నికల ప్రచార రంగంలో ఎల్.డి.ఎఫ్ ముందంజలో ఉంది. యు.డి.ఎఫ్‌కి భారీ వైఫల్యం ఎదురుచూస్తోంది.

/ వ్యాసకర్త సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు /

కత్తిరింపులు

కుత్సిత పథకం

ఎన్నికల బాండ్లకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని అందించాలని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాను సుప్రీంకోర్టు ఆదేశించిన నేపథ్యంలో ఇప్పటి వరకు గోప్యంగా వున్న ఎన్నికల ఫైనాన్సింగ్ వ్యవహారాలు స్పష్టంగా తెలియసాగాయి. కార్పొరేట్లు, వ్యక్తిగతంగా దాతలు కొనుగోలు చేసిన, ఆ తర్వాత రాజకీయ పార్టీలు నగదు రూపంలోకి మార్చుకున్న ఎన్నికల బాండ్లకు సంబంధించిన వివరాలను ఎస్‌బిఐ విడుదల చేయాల్సి వచ్చింది. ఈ సమాచారాన్ని విడుదల చేయడానికే ఎస్‌బిఐని కోర్టు రెండు సార్లు గట్టిగా మందలించాల్సి వచ్చింది. దాతలెవరు? అందుకున్న పార్టీలేవి? అన్న విషయాలు లేకుండా మొదటిసారి సమాచారం ఇచ్చిన సందర్భంలో బ్యాంక్‌ను కోర్టు మందలించింది. అయితే ఎస్‌బిఐ ఈ సమాచారం ఇవ్వడానికే 2024 జూన్ 30 వరకు (సార్వత్రిక ఎన్నికలు ముగిసేంత వరకు) గడువు కోరింది.



కాని, బాండ్లు కొనుగోలు చేసిన కంపెనీలు, వాటిని నగదు రూపంలోకి మార్చుకున్న పార్టీల సమాచారాన్ని కలిపే సులభమైన డేటా మ్యాచింగ్ ప్రక్రియను వార్తా సంస్థలు చిటికెలో చేసేశాయి. ఈ డేటాను పరిశీలించినట్లైతే, ఎన్నికల బాండ్ల వివరాలు రహస్యంగా వుండాల్సిన అవసరం గురించి ప్రభుత్వం చేస్తూ వచ్చిన వాదనలోని డొల్లతనం వెల్లడవుతుంది. కోర్టు మాత్రం ఈ వాదనను నిర్ద్వంద్వంగా తిరస్కరించి మంచి పని చేసింది. పెద్ద మొత్తంలో విరాళాలు నిర్దిష్ట రాజకీయ పార్టీలకు అందడం... బాండ్లు కొనుగోలు చేసిన వారికి పెద్ద ఎత్తున మౌలిక వసతుల కాంట్రాక్టులు రావడం చూస్తే...ఈ రెండింటికీ మధ్య స్పష్టమైన సంబంధం వుందని ఎవరికైనా ఇట్టే అర్థమైపోతుంది. కొన్ని సందర్భాలలో కంపెనీలు ఇ.డి, ఆదాయ పన్ను అధికారుల దాడులు, సోదాలను ఎదుర్కొనాల్సి రావడం...ఆ తర్వాత ఆ యా కంపెనీలు, వారి ప్రతినిధులు ఎన్నికల బాండ్లను కొనుగోలు చేయ డం మధ్య కూడా గట్టి సంబంధమే వుంది. పాలక బిజెపి నగదు రూపంలోకి మార్చుకున్న బాండ్లను కొనుగోలు చేసిన చాలామంది దాతలకు ఇది ప్రత్యేకంగా వర్తిస్తుంది.

2019 మధ్య నుండి 2024 ఫిబ్రవరి వరకు 22 సంస్థలు రూ.100 కోట్లకు పైగా విరాళమిచ్చాయి. ఇవి ఇతర పార్టీలతో పాటుగా బిజెపికి నిరంతరం విరాళాలు ఇవ్వడం చూస్తుంటే తమ కంపెనీకి/సంస్థకు అవసరమైన లేదా ప్రయోజనకరమైన పనులు చేసిపెట్టడానికి ఈ బాండ్లను ఒక సాధనంగా ఉపయోగించుకున్నట్లు తెలుస్తోంది. ఈ బాండ్ల విశిష్ట సంఖ్యల సమాచారం ఎస్‌బిఐ చేతిలో వుండడం వల్ల లావాదేవీల ఆడిట్ ట్రయల్ కొనసాగించడానికి అనుమతించగలగడం, అలాగే బాండ్ల గడువు తేదీ (కొనుగోలు చేసిన తేదీకి 15 రోజుల్లోగా) ముగిసిన తర్వాత కూడా కొన్ని బాండ్లను నగదు రూపంలోకి మార్చుకోవడానికి ఆర్థిక మంత్రిత్వ శాఖ అనుమతించడం చూస్తుంటే ఈ పథకం పాలక పార్టీకి లోపాయికారీ ప్రయోజనాలను పొందే అవకాశం కల్పించిందని అర్థమవుతోంది. విరాళాల కోసం చిత్తశుద్ధిలేని ఉద్దేశాలపై ముసుగు వేయడంతో పాటుగా ఈ బాండ్లు పాలక పక్షానికి అనుకూలంగా ప్రచారం చేస్తూ, భారీగా ఆర్థిక సాయం అందించాయనేది స్పష్టమైంది. ఇక ఈ పథకం గురించి ఓటర్లను చైతన్యవంతులను చేయాల్సిన, విరాళాల కుటిల స్వభావాల గురించి ప్రశ్నలు లేవనెత్తాల్సిన గురుతర బాధ్యత పౌర సమాజంపై వుంది. వ్యవస్థను ప్రక్షాళన చేసేందుకు ఇది కేవలం మొదటి అడుగు మాత్రమే.

/'హిందూ' సంపాదకీయం/

కవిత్వం

కాలుష్య కాసారంలో సలిలం

ఒకప్పుడు
మన మనుగడకు
మూలాధారమై
జలసిరులతో కళకళలాడే చెరువు
మన నిర్లక్ష్యపు నీడలో
ఇప్పుడు నిర్జీవమైంది
ప్రగతి ప్రస్థానానికి
చేదోడు వాదోడుగా ఉండే చెరువు
కాలుష్య కాసారంలో చిక్కి
నరకయాతన పడుతోంది
ముంచెత్తుతున్న మురుగునీరు
పోటెత్తుతున్న వ్యర్థాల
ఉధృతిలో విషవాయువుల్ని
తన గర్భాన నింపుకుంటోంది
తాగే నీరివ్వలేక
పంట సాగివ్వలేక
సలిలం వేదన పడుతోంది
రియల్ ఎస్టేట్ మాఫియా
యథేచ్ఛగా కబ్జాలు చేస్తూ
చెరువులకు మరణ శాసనాలు
రాస్తుంటే మౌనంగా ఉందామా
ఈ నేరం ఎవరిది
ఈ నిర్లక్ష్యం ఎవరిది
నియంత్రణ లేని వ్యవస్థదందామా
గరళంగా మార్చేస్తున్న మనదా
ఆత్మవిమర్శ చేసుకోవాలి
చెరువు అంటే చెత్తబుట్ట కాదు
ఆరోగ్యానికి అది ఆయువు పట్టు
మన ఆయువు పట్టును
మన ఆరోగ్య పెన్నిధిని
మనమే కాపాడుకుందాం
చేసిన తప్పుల్ని ఇప్పటికైనా
సహర్షంగా సరిదిద్దుకుందాం.

- నెల్లుట్ల సునీత,
సెల్ : 7989460657

వ్యాఖ్య

మాస్కో మారణకాండ వెనుక పశ్చిమ దేశాల హస్తం

గత శుక్రవారం నాడు మాస్కో శివార్లలోని ఒక సంగీత కచేరీలో జరిపిన మారణకాండలో మరణించిన వారి సంఖ్య గురువారం నాటికి 143కు చేరింది. మరో 360 మంది గాయపడినట్లు, 143 మంది జాడ తెలియటం లేదని ఫిర్యాదులు వచ్చినట్లు 'మాస్కో టైమ్స్' పత్రిక రాసింది. అమాయకులను బలిగొన్న ఈ దుర్మార్గాన్ని యావత్ ప్రపంచమూ ఖండించింది. ఘటన జరిగి వారం కావస్తున్నా దీనికి పాల్పడింది నిర్దిష్టంగా ఎవరన్నది వెల్లడి కాలేదు. వర్తమాన అంతర్జాతీయ రాజకీయాల పూర్వరంగంలో ఆలోచించినా, రష్యా అధికారులు చెబుతున్నదాని ప్రకారం చూసినా పశ్చిమ దేశాల కుట్రలో భాగంగానే ఇది జరిగినట్లు కనిపిస్తోంది. రష్యా నుంచి ఎలాంటి ప్రకటన రాకముందే ఉక్రెయిన్‌కు ఏ సంబంధమూ లేదని అమెరికా కోయిల ముందుగానే కూసింది. ఆఫ్ఘనిస్తాన్ ఐసిస్-కె సంస్థ పేరుతో వెలువడినట్లు చెబుతున్న ప్రకటనను చూపి దాడి జరిపింది ఐ.ఎస్ తీవ్రవాదులేనని పశ్చిమ దేశాల వార్తా సంస్థలు పెద్ద ఎత్తున ప్రచారం చేశాయి. ఒక వేళ అదే నిజమనుకుంటే ఈ సంస్థ ఏర్పాటు వెనుక అమెరికా ఉందన్నది బహిరంగ రహస్యం. ఐ.ఎస్ తీవ్రవాదులు దాడి చేయాల్సిన పరిస్థితులేమీ లేవని రష్యన్ అధికారులు దాన్ని కొట్టిపారవేశారు. సిరియాలో ఐ.ఎస్ తీవ్రవాదులను రష్యా అణచివేస్తున్నదని, గతంలో ఆఫ్ఘనిస్తాన్‌లో రష్యా అణచివేతకు ప్రతీకారంగా ఇది జరిగిందంటూ కథనాలను ప్రచారం చేశారు.

నాటో దేశాల తొత్తుగా మారిన ఉక్రెయిన్‌పై 2022 ఫిబ్రవరి నుంచి రష్యా జరుపుతున్న సైనిక చర్య 763వ రోజుకు చేరింది. పశ్చిమ దేశాలు ఎన్ని విధాలుగా సాయం చేసినప్పటికీ ఉక్రెయిన్ చావుదెబ్బలు తింటున్నది. రష్యాను వెనక్కు కొట్టే స్థితి కనిపించటం లేదు. దీన్నుంచి దృష్టి మళ్లించేందుకు, పుతిన్ సర్కార్‌పై వ్యతిరేకతను రెచ్చగొట్టేందుకు పశ్చిమ దేశాలు చేయని ప్రయత్నాలు లేవు. అనేక దేశాలలో కిరాయి మూకలను రంగంలోకి దించినట్లుగానే ఉక్రెయిన్‌లో కూడా పశ్చిమ దేశాల ఆర్థిక సాయంతో కిరాయి మూకలను రంగంలోకి దించారు. వారిలో కొందరినీ దీనికి వినియోగించి ఉండవచ్చు. గణనీయ సంఖ్యలో మధ్య ప్రాచ్యం, ఇస్లామిక్ దేశాల నుంచి ఇలాంటి వారికి శిక్షణ ఇచ్చి తమ మీద దాడులకు వినియోగిస్తున్నట్లు రష్యా చెబుతోంది. మాస్కో ఉగ్రవాద మారణకాండ తరువాత అనేక మందిని టర్కీలో అనుమానంతో అదుపులో తీసుకున్నారు. నాటో కూటమి దేశమే అయినప్పటికీ రష్యాతో టర్కీకి సత్సంబంధాలు వున్నాయి. ఉక్రెయిన్‌తో శాంతి చర్చలకు తొలి రోజుల్లో చొరవ చూపింది కూడా ఈ దేశమే.



> నాటో దేశాల తొత్తుగా మారిన ఉక్రెయిన్‌పై 2022 ఫిబ్రవరి నుంచి రష్యా జరుపుతున్న సైనిక చర్య 763వ రోజుకు చేరింది. పశ్చిమ దేశాలు ఎన్ని విధాలుగా సాయం చేసినప్పటికీ ఉక్రెయిన్ చావుదెబ్బలు తింటున్నది. రష్యాను వెనక్కు కొట్టే స్థితి కనిపించటం లేదు. దీన్నుంచి దృష్టి మళ్లించేందుకు, పుతిన్ సర్కార్‌పై వ్యతిరేకతను రెచ్చగొట్టేందుకు పశ్చిమ దేశాలు చేయని ప్రయత్నాలు లేవు. అనేక దేశాలలో కిరాయి మూకలను రంగంలోకి దించినట్లుగానే ఉక్రెయిన్‌లో కూడా పశ్చిమ దేశాల ఆర్థిక సాయంతో కిరాయి మూకలను రంగంలోకి దించారు. వారిలో కొందరినీ దీనికి వినియోగించి ఉండవచ్చు.

సిరియా ప్రభుత్వాన్ని కూల్చివేసేందుకు అమెరికా, పశ్చిమ దేశాలు ఐఎస్ తీవ్రవాదులను సమీకరించి అన్ని రకాల సాయం చేస్తున్న సంగతి అందరికీ తెలిసిందే. సిరియాకు మద్దతుగా రష్యా ఉంది. 'ఇది ఇప్పటికిప్పుడు జరిగింది కాదు. దీర్ఘకాలంగా చోటుచేసుకుంటున్న అక్కడి పరిణామాలకు ఇప్పుడు ప్రతీకారం తీర్చుకున్నార'న్న కథ అతకటం లేదు. అదే విధంగా ఆఫ్ఘనిస్తాన్ సంస్థ పేరుతో జరుపుతున్నది కూడా కట్టుకథే. ఐ.ఎస్ తీవ్రవాదుల పేరుతో మరిన్ని దాడులు జరిపేందుకు వేసిన ఎత్తుగడ కూడా కావచ్చు. సంగీత కచేరీ జరుగుతున్న హాలులో గుమికూడింది క్రైస్తవులని, వారి మీద ఇస్లామిక్ తీవ్రవాదులు దాడి చేశారంటూ అల్లిన కథ కూడా మత కోణం వైపు మళ్లించేందుకు ఉద్దేశించిందన్నది స్పష్టం. పూర్వపు సోవియట్ లోని మధ్య ఆసియా రిపబ్లిక్‌లైన ఉజ్బెకిస్తాన్, కిర్గిజిస్తాన్, తజకిస్తాన్‌ల నుంచి వచ్చిన కోటి మంది వలస కార్మికులు రష్యాలో పని చేస్తున్నారు. మత కోణాన్ని జోడించి రెచ్చగొడితే ఈ కార్మికులపై స్థానికులు రెచ్చిపోతారన్న దుష్ట మంత్రాంగం కూడా ఉంది. అయితే ఇప్పటి వరకు ఎక్కడా అలాంటి అవాంఛనీయ పరిణామాలు చోటు చేసుకోకపోవటం గమనించాల్సిన అంశం. ఈ దేశాల వారు ఎలాంటి వీసాలతో నిమిత్తం లేకుండా రష్యాలో ప్రవేశించవచ్చు. సోవియట్ నుంచి విడిపోయి స్వతంత్ర దేశాలుగా ఏర్పడిన తరువాత రష్యాతో సత్సంబంధాలు కలిగి ఉన్నాయనేందుకు ఇదొక నిదర్శనం. అలాంటి సామరస్యతను దెబ్బ తీసేందుకు, రష్యా సరిహద్దుల్లో కుట్రలకు తెర లేపేందుకు కూడా కుట్ర చేసి ఉండవచ్చు. తమ దేశ భద్రతకు పశ్చిమ దేశాలు ఉక్రెయిన్‌ను అడ్డుపెట్టుకొని ముప్పు తెస్తున్నట్లు భావిస్తున్న రష్యన్లు ఈ కుట్రను అర్థం చేసుకుంటారనే అనుకోవాలి. దాడి వెనుక అమెరికా, బ్రిటన్, ఉక్రెయిన్ ఉన్నట్లు రష్యన్ భద్రతా విభాగ డైరెక్టర్ ప్రకటించాడు. దాడులు జరిపిన వారు ఎవరన్నది ఇప్పటికీ తేలనప్పటికీ, ఒక వేళ వారు ఇస్లామిక్ దేశాలకే చెందినప్పటికీ పశ్చిమ దేశాల కుట్రలో భాగంగానే ఈ ఘాతుకానికి పాల్పడి ఉంటారన్నది నిస్సందేహం.

- ఫీచర్స్ అండ్ పాలిటిక్స్

జనవాక్యం

ఆర్థిక అంతరాలు ఎన్నికల అంశం కాదా?

కొంతమంది ప్రపంచ స్థాయి ఆర్థికవేత్తల అభిప్రాయం ప్రకారం భారత్‌లో నేడు ఆర్థిక అంతరాలు బ్రిటిష్ పాలనలో కన్నా ఘోరంగా ఉన్నాయి. గణాంకాల ఆధారంగా వారు చెప్పిన విషయాలు ఆందోళన కలిగిస్తున్నాయి. దేశంలో సంపద సృష్టి బాగానే జరుగుతున్నా, అది కొద్దిమంది చేతిలోనే కేంద్రీకృతమౌతుంది. దేశ సంపదలో 44 శాతం ఒక్క శాతం ధనికుల చేతిలో ఉంది. ఆ ఒక్క శాతం మంది జాతీయ ఆదాయంలో 22 శాతం మేరకు పొందుతున్నారు. ఏభై శాతం ప్రజలు జాతీయ ఆదాయంలో 15 శాతానికి మించి పొందలేక పోతున్నారు. అంటే జాతీయ ఆదాయం ఎంత పెరిగినా జనాభాలో సగం మందికి దక్కేది అందులో 15 పైసల వాటానే. ఇలా అసమానతలు పెరగడానికి ఇప్పటి ప్రభుత్వ విధానాలే కారణం. ధనికులపై విధించే పన్నులు తక్కువ. వారు పొందే రాయితీలు ఎక్కువ. పేదలు ప్రత్యక్షంగా, పరోక్షంగా కట్టే పన్నులు ఎక్కువ. వారికి దొరికే ఊరట. ధరల నియంత్రణ ద్వారానో, మరోలానో తక్కువ. అయితే అసమానతలు తగ్గే విధానాల్ని అమలు చేస్తామని ఎవరూ మాట్లాడకపోవడం గమనార్హం. వృద్ధి వైపు దేశాన్ని పరుగులు పెట్టిస్తామని అందరూ అంటున్నారు తప్పించి, ఆ వృద్ధి ఫలాలు అందరికీ అందేలా విధానాలు రూపు దిద్దగలమని జాతీయ పక్షాలు మాట్లాడడం లేదు. బహుశా దాని వల్ల ధనికులు దూరమై, వారి విరాళాలు అందవని భయమేమో? చూశాం కదా, ఎన్నికల బాండ్ల రూపంలో దివాళా కంపెనీలు కూడా పార్టీలకు ఎలా నిధులు ఇచ్చాయన్నది. ఇకపోతే ఆర్థిక అంతరాలు మరీ వారు చెప్పినంత ఘోరంగా లేవని వాదించవచ్చు. కానీ అసమానతలు దండిగా ఉన్న వాతావరణంలోనే ఉన్నామన్నది ఎవరూ కాదనలేరు. వేర్వేరు నివేదికల ప్రకారం 2000 సంవత్సరంలో 35 శాతం ఉన్న నిరుద్యోగిత నేడు 65 శాతం అయ్యింది. పేదరికం, పోషకాహార లేమి గణనీయంగా ఉన్నాయి. ఇప్పటికీ వైద్యం, విద్యపై పౌరులు భరించాల్సిన ఖర్చు ఎక్కువే. వాటివల్ల అప్పులు పాలయ్యే వాతావరణం. ఈ సమస్యల్ని గమనంలోకి తీసుకోకుండా వృద్ధిలో ముందంజ వేయడం సాధ్యమా? పేదలకి, అధిక సంఖ్యలో ఉన్న మధ్యతరగతికి భారమైన విద్య, వైద్యం చవకగా అందుబాటులోకి రావాలి. అప్పుడే నాణ్యమైన భవితకు, ఆర్థిక వృద్ధికి పూచీ. యువత గణనీయంగా ఉన్న భారత్ శక్తిమంతం కావడమే కాదు అసమానతలు లేని సమాజంగా మారాలి. ఇప్పుడున్న విధానాలతో అది సాధ్యం కాదు. మెరుగైన విధానాల కోసం, అవి ఎన్నికల్లో ప్రాధాన్యత గల అంశాలుగా మారడం కోసం నడుం కట్టాల్సింది పౌర సమాజమే.



- డా.డి.వి.జి. శంకరరావు,
మాజీ ఎంపీ, విజయనగరం.

మీ రచనలను పంపాల్సిన మెయిల్ :
editpageps@gmail.com

యథేచ్ఛగా ఆక్రమణలు

- రూ.కోట్ల విలువైన ప్రభుత్వ భూములపై రెవెన్యూ మీనమేషాలు
- భూములు, గెడ్డల కబ్జాపై ఎన్‌హెచ్‌ఆర్‌సికి ఫిర్యాదులు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

రాష్ట్రంలోనూ జిల్లాలోనూ ఓ వైపు ఎన్నికల కోలాహలం నడుస్తుండగా సందట్లో సడేమియా అన్న చందాన రాజకీయ రాబందులు కొన్ని ప్రభుత్వ భూముల కబ్జా కోసం శతవిధాలా ప్రయత్నాలు సాగిస్తున్నారు. రుషికొండ, ఎండాడ, సాగర్‌నగర్ ప్రాంతాల్లో అధికార వైసిపి, ప్రతిపక్ష టిడిపికి చెందిన వారు ఇక్కడ ఏకమవ్వడం ఏళ్లతరబడి సాగుతుండడంతో బాధితుల సంఖ్య నానాటికీ పెరిగిపోతుంది. రెవెన్యూలో ఉన్నతాధికారుల పాత్ర గణనీయంగా ఉందని జాతీయ మానవ హక్కుల సంఘం ప్రతినిధి శ్యామ్ ప్రసాద్ త్వరలో వీటిపై ప్రజా ప్రయోజనాల వ్యాజ్యం (పిల్) వేయనున్నట్లు ప్రజాశక్తికి తెలిపారు.

ఆక్రమణల పరంపర...

విశాఖ గ్రామీణ రూరల్ తహశీల్దార్ కార్యాలయం పరిధిలోగల రుషికొండ, ఎండాడ, సాగర్‌నగర్, వివేకానందనగర్ పరిధిలోగల పలు ప్రభుత్వ భూములు, చెరువులు, గెడ్డలన్నీ అధికార వైసిపి, పలుచోట్ల తెలుగుదేశం నేతల భాగస్వామ్యంతో మాయం అవుతున్నాయి. ఈ వ్యవహారంపై రెవెన్యూకు పదుల సంఖ్యలో ఫిర్యాదులు చేసినా రూ.కోట్ల విలువైన భూములను కాపాడలేని స్థితిలో రెవెన్యూ అధికారులున్నారు. ఈ నేపథ్యంలో ఇటీవలే జాతీయ మానవ హక్కుల సంఘానికి (ఎన్‌హెచ్‌ఆర్‌సి) ఈ ప్రాంతానికి చెందిన సామాజిక కార్యకర్త అల్లూరి శివపార్వతి ఫిర్యాదు చేశారు. దీంతో అక్కడ నుంచి విశాఖ జిల్లా రెవెన్యూ అధికారులకు సైతం తాఖీదులు రావడంతో ఏం చేయాలో పాలుపోని పరిస్థితి వారిలో నెలకొంది. నిత్యం భూ కబ్జాదారులతో చేతులు కలిపి పబ్బం గడుపుకునే అలవాటుగల ఈ ప్రాంత రెవెన్యూ ఉన్నతాధికారులకు ఎన్‌హెచ్‌ఆర్‌సి జోక్యం మింగుడు పడని అంశంగా ఉందన్నది తెలుస్తోంది.

ఆక్రమణకు దిగడం ఆపై ఎవరైనా అడ్డుపెడితే రెవెన్యూ రావడం...

ఈ ప్రాంతంలో భూములు, ప్రభుత్వ గెడ్డలు కబ్జాకు గురౌతున్నా రెవెన్యూ చూసీచూడనట్టు వ్యవహరిస్తోంది. వార్డు స్థాయి సచివాలయ సిబ్బంది సైతం రాజకీయ పలుకుబడికి లొంగిపోయి వ్యవహరించడం ఈ ప్రాంతంలో కనిపిస్తోంది. జోన్ -2 పరిధిలో 8వ వార్డు రాజీవ్‌నగర్ బస్‌స్టాప్ వద్ద ప్రభుత్వ భూమి 60 గజాల వరకూ ఉంటుంది. దీన్ని ఓ రాజకీయ పార్టీకి చెందిన వారు కబ్జాకు ఇటీవలే సిద్ధం కాగా ఈ వ్యవహారంపై రెవెన్యూ, జాతీయ మానవ హక్కుల సంఘానికి ఫిర్యాదులు వెళ్లాయి. దీంతో ఎన్‌హెచ్‌ఆర్‌సి జోక్యం చేసుకుని ఈ వ్యవహారంపై దర్యాప్తునకు రెవెన్యూకు ఆదేశించగా హుటాహుటిన ఇక్కడ కబ్జాదార్లు పడేసిన ప్రభుత్వ బోర్డులను మరలా తీసి పాతించారు. పై నుంచి చెబితే గానీ రెవెన్యూ కనీసం కబ్జాలపై స్పందించని స్థితి కొనసాగుతోంది. రుషికొండలో గెడ్డ ఆక్రమణలపైనా ఇదే తంతు ఇటీవలే నడిచింది. సర్వే నెంబరు 18 నుంచి 21 వరకూ మరలా 28, 45, 48 లో గెడ్డలున్నాయి. సుమారు 18 ఎకరాల వరకూ ఉంటుంది. ఈ భూమంతటినీ కొట్టేయాలని అధికార పార్టీ పెద్దలు చూడగా ఫిర్యాదులతో ఇటీవల వీటిపై రెవెన్యూ అధికారులు కదిలి ఈ భూమిని కాపాడారు. రెవెన్యూ తమ విధుల్లో భాగంగా ఈ తనిఖీలు, పర్యవేక్షణలేవీ చేయకపోవడంతో భూ కబ్జాలు నానాటికీ పేట్రేగిపోతున్నాయి.

యర్రగుంట్లలో ఉద్రిక్తత

- సిఎంకు వినతిపత్రం ఇచ్చేందుకు వచ్చిన భూమా అఖిలప్రియ
- అనుమతి లేదని అడ్డుకున్న పోలీసులు
- శిరివెళ్ల పోలీస్ స్టేషన్‌కు తరలింపు

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ (నంద్యాల)

ఆళ్లగడ్డ నియోజకవర్గంలోని సిరివెళ్ల మండలం యర్రగుంట్లలో గురువారం ఉద్రిక్తత చోటు చేసుకుంది. రైతుల పక్షాన ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డికి వినతి పత్రం ఇచ్చేందుకు వెళ్తున్న మాజీ మంత్రి భూమా అఖిలప్రియను పోలీసులు అడ్డుకున్నారు. వివరాలు.. యర్రగుంట్లలో ప్రజలు, మేధావులతో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొన్న సిఎం జగన్‌మోహన్ రెడ్డిని రైతుల పక్షాన భూమా అఖిలప్రియ కలిసి వినతిపత్రం ఇచ్చేందుకు టిడిపి శ్రేణులతో కలిసి యర్రగుంట్లకు భారీ సంఖ్యలో తరలివెళ్లారు. సభా స్థలికి వస్తుండగా అప్రమత్తమైన పోలీసులు ఆమెను అడ్డుకున్నారు. ఈ సందర్భంగా టిడిపి నేతలు పోలీసులతో వాగ్వివాదానికి దిగారు. సిఎం అపాయింట్‌మెంట్ కోసం ప్రయత్నం చేశానని, సిఎంఒ స్పందించలేదని, అందుకే నేరుగా సిఎంను కలిసి వినతిపత్రం ఇచ్చేందుకు వచ్చానని భూమా అఖిలప్రియ పోలీసులతో తెలిపారు. వినతి పత్రం ఇచ్చేందుకు వస్తే శాంతి భద్రతల సమస్య ఎలా అవుతుందని ఆమె ప్రశ్నించారు. పోలీసులు భూమ అఖిలప్రియకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. ముందస్తు జాగ్రత్తగా ఆమెను సిరివెళ్ల పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

మల్లన్న హుండీ ఆదాయం రూ.1.81 కోట్లు

- 16 రోజుల కానుకల లెక్కింపు

ప్రజాశక్తి - శ్రీశైలం

శ్రీశైల క్షేత్రంలోని భ్రమరాంబ మల్లికార్జున స్వామి వార్ల హుండీ కానుకలను లెక్కించగా రూ.1.81.కోట్లు ఆదాయం లభించినట్లు దేవస్థానం కార్యనిర్వహణాధికారి పెద్ది రాజు తెలిపారు. ఇఒ ఆధ్వర్యంలో హుండీ లెక్కింపు జరిగింది. స్వామి అమ్మవార్ల, పరివార దేవాలయాల్లో గడిచిన 16 రోజులలో యాత్రికులు చెల్లించుకున్న కానుకలను గురువారం కళ్యాణమండపంలో చేపట్టారు. ఇందులో నగదు రూ. 1,81,13,485 లభించింది. విదేశి కరెన్సీలు యుఎస్‌ఏ డాలర్లు 178, సౌదీ అరేబియా రియాల్స్ 20, యూకె పౌండ్ల 20, ఆస్ట్రేలియా డాలర్లు 5, స్వీడన్ కొనర్స్ 100, మొదలైన విదేశీ కరెన్సీలు హుండీలో లభించాయి. ఈ హుండీ కౌంటింగ్ పటిష్ఠమైన భద్రత ఏర్పాట్ల మధ్య సిసి కెమెరాల నిఘాలో చేపట్టారు. యూనిట్ అధికారులు, సిబ్బంది, శివ సేవకులు పాల్గొన్నారు.

146 ఒడిశా మద్యం బాటిళ్లు స్వాధీనం

ప్రజాశక్తి - పరవాడ

ఒడిశా రాష్ట్రం బరంపురం నుండి తీసుకొచ్చిన మద్యం బాటిళ్లను గురువారం పరవాడ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పరవాడ సిఐ బాలసూర్యరావు కథనం ప్రకారం... పెందుర్తికి చెందిన లాది సుశాంత్ పాత్రో, కొత్తవలస గ్రామానికి చెందిన లేంక గౌరి శంకర్ ఇద్దరూ ఒడిశా రాష్ట్ర బరంపురం నుండి అక్రమంగా మద్యం తీసుకొచ్చి పరవాడ మండలం తానాం గ్రామంలో అమ్ముతున్నట్లు అందిన ముందస్తు సమాచారం మేరకు పరవాడ సిఐ బాల సూర్యారావు, తమ సిబ్బంది కలిసి దాడి చేశారు. తానాం గ్రామ శివారులో సదరు ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుండి రూ.19,194 విలువ గల ఒడిశా రాష్ట్రానికి చెందిన 146 మద్యం బాటిళ్లను, సదరు మద్యాన్ని తరలించడానికి ఉపయోగించిన బొలెరో వాహనాన్ని స్వాదీనపర్చుకొని, సీజ్ చేశారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నమని సిఐ బాల సూర్యారావు తెలిపారు.

ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న..
ఏడుగురు వలంటీర్ల సస్పెన్షన్

ప్రజాశక్తి -పద్మనాభం

అధికార వైసిపి తరపున ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న మండలంలోని గంధవరం పంచాయతీకి చెందిన ఏడుగురు వలంటీర్లను సస్పెండ్ చేస్తూ స్థానిక ఎంపిడిఒ బి.శైలజ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారి, భీమిలి ఆర్‌డిఒ ఆదేశాల మేరకు వీరిని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు ఎంపిడిఒ తెలిపారు. ఈ నెల 26న గంధవరంలో స్థానిక వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి, ప్రస్తుత ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు నిర్వహించిన ఇంటింటా ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న పిల్లి ముత్యాలు, సింగం శేఖర్, చిప్పాడ వెంకటలక్ష్మి, కొత్తపల్లి రమాకుమారి, కొత్తపల్లి అప్పలరాజు, తాండంగి జగదీష్, పల్లి ముత్యాల నాయుడులను ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించినందున విధుల నుంచి సస్పెండ్ చేస్తూ చర్యలు తీసుకున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

తాయిలాలతో రెడీ

- తిరుపతి, చంద్రగిరి, శ్రీకాళహస్తిల్లో పందేరం
- కుక్కర్లు, ఫ్యాన్లు, ముక్కుపుడకలు, పట్టు చీరలు
- ఇప్పటికే పూర్తయిన 60 శాతం పంపకాలు
- గోదాముల్లో 50 కోట్ల అధికార పార్టీ సరంజామా

ప్రజాశక్తి - తిరుపతి

తిరుపతి జిల్లాలో ఎన్నికల వేడి రాజుకుంటున్న వేళ ... ఓటర్లను ప్రలోభాలతో ముంచెత్తేందుకు అభ్యర్థులు రెడీ అయిపోయారు. చంద్రగిరి నియోజకవర్గంలో ఇప్పటికే కుక్కర్లు, గోడ గడియారాలు, దుస్తులను పెద్ద ఎత్తున పంపిణీ చేసిన అధికార పార్టీ నేతలు తాజాగా ఫ్యాన్లు, రిస్ట్ వాచీలు, స్వీటర్లు పంపిణీ చేసేందుకు సంసిద్ధులయ్యారు. ఇక తామేమి తక్కువ కాదంటూ ప్రతిపక్ష అభ్యర్థులూ రంగంలోకి దిగారు. చీరలు, ముక్కు పుడకలు ఇచ్చేందుకు సిద్ధమని కార్యకర్తలు ప్రచారం హోరెత్తిస్తున్నారు. ఇప్పటికే బూత్ లెవల్ ముఖ్య నాయకుల చేతుల్లో కొత్త ఆండ్రాయిడ్ ఫోన్లు దర్శనమిస్తున్నాయి. ఈ తరుణంలోనే చంద్రగిరి, శ్రీ కాళహస్తి గోదాముల్లో దాదాపు రూ. 50 కోట్ల విలువచేసే అధికార పార్టీ సరంజామా పట్టుబడటం తీవ్ర దుమారం లేపుతోంది.

50 కోట్ల విలువ చేసే బహుమతులు సీజ్?

చంద్రగిరి, శ్రీకాళహస్తి నియోజకవర్గ పరిధిలోని పలు గోదాముల్లో అధికార పార్టీకి చెందిన ఇద్దరి ఎమ్మెల్యేల ఎన్నికల తాయిలాలు ఉన్నట్లు గుర్తించిన విపక్ష పార్టీ కార్యకర్తలు అధికారులకి సమాచారం ఇచ్చినా పట్టించుకోలేదన్న విమర్శలు పెద్ద ఎత్తున వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో బుధవారం నుంచి ప్రతిపక్ష నేతలు తమ కార్యకర్తలతో కలిసి ఆయా గోడౌన్ల వద్దకు పెద్ద ఎత్తున చేరుకున్నారు. దీంతో రెవెన్యూ పోలీస్ అధికారులు పాత ఎయిర్పోర్టు సమీపంలోని గోదాములు తనిఖీ చేయగా దాదాపు రూ. 50 కోట్ల విలువ చేసే బహుమతులు బహిర్గతం కావడం గమనార్హం.

గోడౌన్లలో భారీ మొత్తంలో తాయిలాలు దొరికినప్పుడు ఎన్నికల అధికారులు ఏమయ్యారని టిడిపి నేతలు ప్రశ్నిస్తున్నారు. గోడౌన్లలో ఎన్నికల బహుమతులను భద్రపరచడం ఎన్నికల నియమావళికి విరుద్ధం కాదా? అని ప్రశ్నిస్తున్నారు. వీటిపై వెంటనే ఎస్పి, కలెక్టర్ దృష్టి సారించాలని, కఠిన చర్యలు తీసుకోవాలని టిడిపి నేతలు కోరుతున్నా జిల్లా కలెక్టర్, ఎస్పీలు ఎవ్వరూ అధికారికంగా స్పందించక పోవడం గమనార్హం.

తాయిలాలతో ప్రతిపక్ష అభ్యర్థులూ సిద్ధం!

ఈ ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలని నిర్ణయించుకున్న ప్రతిపక్ష అభ్యర్థులు సైతం అధికార పార్టీ నేతలకు దీటుగా తాయిలాలు ఇచ్చేందుకు సిద్ధపడుతున్నారు. ఇప్పటికే పలువురు ముఖ్య కార్యకర్తలకు విలువైన బహుమతులు ఇచ్చినట్లు తెలుస్తోంది. పెద్ద ఎత్తున డబ్బు, పట్టు చీరలు, ముక్కు పుడకలు పంపిణీ చేసేందుకు తమ తమ శ్రేణులను సిద్ధం చేసుకోవడం గమనార్హం.

పుంగనూరులో తెలంగాణ సైబర్ పోలీసుల సోదాలు

- వివరాలు వెల్లడించేందుకు నిరాకరణ

ప్రజాశక్తి - పుంగనూరు

పుంగనూరులో ఆన్లైన్ వ్యాపారం పేరుతో మోసాలకు పాల్పడుతున్న కార్యాలయాలు అనేకం ఉన్నాయి. డిజిటల్ వ్యాపారంలో లక్షలు పెట్టుబడి పెట్టి స్కాములు జరుగుతున్న పుంగనూరు పోలీసులకు మాత్రం అవేవీ పట్టిపట్టనట్లు ఉన్నారు. ఇందుకు ఉదాహరణే తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు గురువారం పుంగనూరులో సోదాలు నిర్వహించడమే. గతంలో కూడా పుంగనూరులో ఆన్లైన్ వ్యాపారాల ద్వారా కోటి రూపాయలు పోగొట్టుకున్నట్టు హైదరాబాదు వాసి సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అప్పట్లో ఈ సంఘటనకు బాధ్యుడిగా గ్రామానికి చెందిన చరణ్ అను వ్యక్తిని సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్కు తరలించారు. ఈ సంఘటన జరిగిన కొన్ని నెలల్లోని హైదరాబాదుకు చెందిన మరొకరు మోసపోవడం... సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించడంతో వారు పుంగనూరులో రహస్యంగా సోదాలు నిర్వహించారు. ఈ విషయమై స్థానిక సిఐ రాఘవరెడ్డిని వివరణ కోరగా సైబర్ క్రైమ్ కింద పుంగనూరులోని ట్రేడింగ్ కంపెనీపై కేసు నమోదు అయిందని వివరాలు తెలీదని చెప్పారు. అయితే సైబర్ క్రైమ్ ఎస్ఐని ఈ కేసు విషయమై వివరణ కోరగా వివరాలు చెప్పేందుకు వీలుపడదని సున్నితంగా తిరస్కరించారు.

'చీనీ'కి తెగుళ్ల పోటు..!

- అరటికి నీటి కరువు
- ఎండిపోతున్న చెట్లు
- నామనాంకపల్లిలో చీనీ, నాగిరెడ్డిపల్లిలో అరటి చెట్లు తొలగింపు



నామనాంకపల్లిలో తెగుళ్లు సోకిన చీనీచెట్లను తొలగించిన రైతు

ప్రజాశక్తి-పెద్దపప్పూరు, పుట్లూరు

వర్షాభావంతో ఖరీఫ్, రబీ సీజన్లలో వరుసగా రైతులు పంటలను నష్టపోతున్నారు. ఈ పరిస్థితుల్లో రైతులు ఉన్నపాటి నీటి వనరులతో బోరుబావుల కింద పండ్ల తోటలు సాగుచేస్తూ దృష్టి సారించారు. ఈ పండ్ల తోటలు కూడా రైతులకు నష్టాలనే మిగులుస్తున్నాయి. అరటి, చీనీ, మామిడి, సపోటా తదితర పంటలకు ఏదో రూపంలో నష్టాన్ని తెచ్చిపెడుతూ రైతులను అప్పుల్లోకి నెట్టేస్తున్నాయి.

అనంతపురం జిల్లా పెద్దపప్పూరు మండల వ్యాప్తంగా చాలా మంది రైతులు చీనీ చెట్లను సాగు చేశారు. కంటికి రెప్పలా చెట్లను కాపాడుకుంటూ వచ్చారు. ఇక్కడ కూడా రైతులకు నష్టాలు తప్పలేదు. పంట కాయలు కాసే సమయానికి చీనీ చెట్లు తెగుళ్ల బారిన పడి ఎండిపోతున్నాయి. చేసేది లేక రైతులు చెట్లను నరికివేస్తున్నారు. పండ్లతోటల సాగు నిమిత్తం ఖర్చు చేసిన లక్షలాది రూపాయలను రైతులు నష్టపోతున్నారు. పెద్దపప్పూరు మండల పరిధిలోని నామనాంకపల్లెలో రైతులు చీనీ చెట్లను సాగు చేశారు. దాదాపు పది సంవత్సరాల పాటు వాటిని కాపాడుకున్నారు. ప్రస్తుతం చెట్లు కాపునకు వచ్చాయి. ఇదే సమయంలో చెట్లకు వేరుకుళ్లు తెగుళ్ల సోకాయి. దీంతో చెట్లు ఆకులు రాలి మొత్తం ఎండిపోయాయి. ఎన్ని మందులు పిచికారీ చేసినా మొక్కలు బతకపోవడంతో చేసేది లేక రైతులు వాటిని తొలగించేస్తున్నారు. ఇలా నామనాంకపల్లి గ్రామంలో రైతు కులశేఖర్రెడ్డి ఎనిమిది సంవత్సరాల వయస్సున్న 400 చెట్లను తొలగించేశారు. ఈ ఒక్క రైతుకే దాదాపు రూ. 10లక్షల నష్టం వాటిల్లింది. మండల పరిధిలోని చాలా గ్రామాల్లో ఇదేకష్టాలు తెగుళ్లతో పండ్ల తోటలు ఎండిపోతున్నట్లు తెలుస్తోంది.

కళ్లెదుటే చెట్లు ఎండిపోయాయి

ఉన్న కొద్దిపాటి నీటి వసతితో తరతరాల్లు నాలుగు ఎకరాల్లో చీనీ చెట్లను సాగు చేశాను. ఎనిమిది సంవత్సరాలుగా కంటికి రెప్పలా వాటిని కాపాడుకున్నాను. నెల రోజుల క్రితం వరకు చెట్లు బాగానే ఉన్నాయి. తర్వాత ఆకులు రాలడం మొదలయ్యాయి. దీని కోసం వేలాది రూపాయలు ఖర్చు చేసి మందులు చల్లాను. అయినా ప్రయోజనం లేదు. చివరకు తెగుళ్ల దెబ్బకు చెట్లు మొత్తం ఎండిపోయాయి. చేసేది లేక 400 చెట్లను తొలగించేశాను.

కులశేఖర్రెడ్డి, రైతు, నామనాంకపల్లి.

అనపర్తిలో ఉద్రిక్తత

- బిజెపికి 4 సీట్లు కేటాయించడంతో భగ్గుమన్న టిడిపి శ్రేణులు
- కంటతడి పెట్టుకున్న మాజీ ఎంఎల్ఎ నల్లమిల్లి

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి, బిక్కవోలు

టిడిపి నాయకులు, కార్యకర్తల నిరసనలతో అనపర్తిలో ఉద్రిక్తత చోటు చేసుకుంది. పొత్తులో భాగంగా అనపర్తి అసెంబ్లీ నియోజకవర్గ సీటను బిజెపికి కేటాయించడంతో టిడిపి కార్యకర్తలు ఆగ్రహావేశాలకు లోనయ్యారు. బుధవారం రాత్రి నుంచి మొదలైన ఆందోళనలు గురువారం తారాస్థాయికి చేరుకున్నాయి. టిడిపి పోస్టర్లు, జెండాలు, ఆ పార్టీ సింబల్ అయిన సైకిల్‌ను దహనం చేశారు. కార్యకర్తలను నిలువరించేందుకు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఆయన తనయుడు మనోజ్ రెడ్డి చేసిన ప్రయత్నాలు ఫలించలేదు.



టిడిపి జెండాలను దహనం చేస్తున్న నల్లమిల్లి అనుచరులు

ఈ సందర్భంగా కార్యకర్తలను ఉద్దేశించి నల్లమిల్లి మాట్లాడారు. కార్యకర్తలు ఆందోళన చెందొద్దంటూ పిలుపునిచ్చారు. తనకు టికెట్ రాకుండా పెద్దకుట్ర జరిగిందనితనకు జరిగిన అన్యాయాన్ని ప్రజలకు వివరించనున్నట్లు స్పష్టం చేశారు. ఓ దశలో కన్నీళ్లు పెట్టుకున్నారు. ప్రజల నిర్ణయం మేరకు ఎన్నికల్లో పోటీ చేస్తానని తెలిపారు. టిడిపికి మద్దతు ఇవ్వబోనని, బిజెపికి ఓటు వేయమని చెప్పబోనని స్పష్టం చేశారు. నియోజక వర్గంలో ఏ మాత్రం బలం లేని బిజెపికి ఎలా సీటు కేటాయిస్తారని ప్రశ్నించారు.

ఫలించని చంద్రబాబు మంత్రాంగం

నల్లిమిల్లిని రామకృష్ణారెడ్డిని బుజ్జగించేందుకు చంద్రబాబు చేసిన ప్రయత్నం విఫలయత్నమైంది. చంద్రబాబు నల్లమిల్లికి ఫోన్ చేసి బుజ్జగించే ప్రయత్నం చేశారు. రామకృష్ణారెడ్డి నిర్మొహమాటంగా తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. నియోజక వర్గ పరిస్థితిని, కార్యకర్తల ఆవేదనను వివరించారు. అక్రమ కేసులు ఎదుర్కొని పార్టీ కోసం ప్రాణాలొడ్డి పనిచేశానని తెలిపారు. గతంలో వైఎస్ఆర్ పిలిచినా పార్టీని వీడలేదని తెలిపారు. తమరి కోసం తెగించి పోరాడిన కొద్ది మందిలో తాను ఒకడినంటూ గుర్తు చేశారు.

కుటుంబ సమేతంగా ప్రజల ముందుకు వెళ్తా...

కుటుంబ సమేతంగా ప్రజల ముందుకు వెళ్లి తనకు తన కుటుంబానికి జరిగిన అన్యాయాన్ని ప్రజలకు వివరించి ప్రజల మద్దతు కోరతానని రామకష్ణారెడ్డి తెలిపారు. ఐదేళ్లలో వైసిపి తనపై ఎన్ని కుట్రలు చేసినా మట్టు బెట్టాలని చూసినా, తనపై 39 కేసులు, కార్యకర్తలపై 200 సుమారు కేసులు పెట్టినా వెనకడుగు వేయలేదని గుర్తు చేశారు. టిడిపి కోసం అహర్నిశలు కష్టపడ్డానని అలాంటి తనకు టిక్కెట్టు ఇవ్వకపోవడం చాలా బాధాకరమైన విషయం అన్నారు. తనకు టికెట్ రాకుండా ప్రస్తుత అనపర్తి ఎంఎల్ఎ డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి బావమరుదులు పనిచేశారన్నారు. టిడిపిలో తన కుటుంబానికి ఇలాంటి పరిస్థితి వస్తుందని కలలో కూడా ఊహించలేదన్నారు.

వికలాంగులకు శ్రీసిటీ సాయం

ప్రజాశక్తి -వరదయ్యపాలెం

శ్రీసిటీలోని గహోపకరణాల తయారీ పరిశ్రమ హామిల్టన్ ప్రైవేట్ లిమిటెడ్, తమ కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) లో భాగంగా, శ్రీసిటీ పరిసర ప్రాంతాలలోని దివ్యాంగులకు భారీ సాయం అందించింది. రూ. 15 లక్షల విలువైన వీల్ ఛైర్లు, ట్రై సైకిళ్ళు, వినికిడి యంత్రాలు, ఊత కర్రలు, ఇంకా దివ్యాంగులకు అవసరమైన పలు పరికరాలను పంపిణీ చేసింది.

ఎన్నికల వేళ వలంటీర్లపై కోడ్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో రాష్ట్ర ప్రభుత్వం నియమించిన వలంటీరు వ్యవస్థపై నిఘా మొదలైంది. ఎన్నికల్లో అన్నీ తామై వ్యవహరించాలని, బూత్ ఏజెంట్లుగా వైసిపికి పనిచేయాలని స్వయానా రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు గతంలో వలంటీర్లకు బోధించారు. ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి, మంత్రులు అదే పల్లవిని అందుకుని వలంటీరు వ్యవస్థను అనుకూలంగా మార్చుకునే ప్రయత్నం చేశారు. అదే సమయంలో ప్రత్యర్థులు ఈ ప్రచారాన్ని ఎన్నికల సంఘం దృష్టికి తీసుకెళ్లడంతో ఈ వ్యవస్థపై సంఘం దృష్టి సారించింది. కోడ్ ఉల్లంఘన పేరుతో ఇప్పటికే కొందరిని తొలగించారు. తాజాగా ఈ వ్యవస్థలో ఉన్న వలంటీర్లను సాధారణ విధులకు వాడితే ఓటర్లను ప్రభావితం చేయగలరని ప్రత్యర్థులు మరోమారు ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయడంతో వారి వద్ద నున్న టాబ్, సెల్‌ఫోన్, సిమ్ కార్డులను సంబంధితశాఖ కార్యాలయాల్లో జమ చేయాలని ఆదేశాలు వచ్చాయి. ఈ ఆదేశాలను అనుసరించి జిల్లా వ్యాప్తంగా ఉన్న 30 మండలాలు, మూడు మున్సిపాలిటీల్లో వాలంటీర్ల నుంచి వాటిని సేకరించే చర్యలు మొదలు పెట్టారు. మరోవైపు ఎన్నికల వేళ ఏప్రిల్, మే నెల పింఛన్లు లబ్ధిదారులకు అందజేయాల్సి ఉంది. సెర్ప్ అధికారులు పింఛన్ల పంపిణీ బాధ్యతలను క్షేత్రస్థాయిలో వాలంటీర్లకు అప్పగించాల్సి ఉంటుంది. రెండు రోజుల ముందే మొదలు కావాల్సి ఉంటుంది. ఈ నెల 30లోగా తాజా పింఛనుదారుల జాబితాతో పాటు నిధులు అందజేయాల్సి ఉంటుంది. ఇంటింటికీ వెళ్లి వాలంటీర్లు ఆదరైజేషన్ థంబ్ వేసిన అనంతరం లబ్ధిదారులకు పింఛను చెల్లించాల్సి ఉంటుంది. అయితే ఆ సమయంలో ఓటర్లను ప్రభావితం చేసే ప్రమాదం ఉంటుందని భావించిన సెర్ప్ అధికారులు ఈ రెండు నెలల పాటు పింఛన్ల పంపిణీకి వాలంటీర్ల ఆదరైజేషన్ పత్రాలను తీసుకోవాలని ఎంపిడిఒలకు, మున్సిపల్ కమిషనర్లకు, పంచాయతీ కార్యదర్శులకు, సంక్షేమ కార్యదర్శుల ఆదరైజేషన్ ఇవ్వాల్సి ఉంటుంది. పింఛన్ల పంపిణీ సమయంలో వాలంటీర్లు ఎలాంటి ప్రచారం నిర్వహించకుండా ఆదరైజేషన్ పత్రాలను సమర్పించాలని ఆదేశాలు జారీ చేసింది. పంపిణీ సమయంలో ఫొటోలు, వీడియోలు వాలంటీర్లు తీయ కూడదని, నిబంధనను ఉల్లంఘించినట్టయితే ఎన్నికల కోడ్ ఉల్లంఘన కింద చర్యలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరిస్తూ సెర్ప్ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. వాలంటీర్లలో ఎక్కువ శాతం మంది యువతే కావడంతో కోడ్ ఉల్లంఘన కేసులు నమోదైతే వారి భవిష్యత్‌కు అవరోధం ఉంటుందని అధికారులు హెచ్చరిస్తున్నారు.

బెస్ట్ ఫిజిక్‌లో నన్నయ విద్యార్థికి గోల్డ్ మెడల్

ప్రజాశక్తి రాజానగరం

ఆలిండియా ఇంటర్ యూనివర్సిటీ బెస్ట్ ఫిజిక్ ఛాంపియన్‌షిప్ 2023-24లో ఆదికవి నన్నయ యూనివర్సిటీకి గోల్డ్ మెడల్ దక్కిందని విసి ఆచార్య కె.పద్మరాజు అన్నారు. యూనివర్సిటీలో గురువారం బెస్ట్ ఫిజిక్‌లో గోల్డ్ మెడల్ సాధించిన కోడూరి పవన్ కుమార్‌కు విసి పద్మరాజు మెడల్స్ ప్రదానం చేసి అభినందించారు. ఈ సందర్భంగా విసి మాట్లాడుతూ యూనివర్సిటీ ఆఫ్ కాలికట్‌లో జరిగిన పోటీల్లో కాకినాడ పిఆర్ కాలేజ్‌కు చెందిన పవన్ కుమార్ గోల్డ్ మెడల్ కైవసం చేసుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు. విశ్వవిద్యాలయం తరపున రూ.30,000 నగదును పవన్ కుమార్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, ఆచార్య పి.సురేష్ వర్మ, స్పోర్ట్స్ బోర్డ్ సెక్రటరీ డాక్టర్ బి.రామ్ గోపాల్, పీడీ కె.వెంకన్న బాబు పాల్గొన్నారు.

మండపంలో పెళ్లి.. ఇంట్లో చోరీ

సుమారు రూ.5 లక్షలు నగదు, నాలుగున్నర కాసుల బంగారు వస్తువులు అపహరణ

ప్రజాశక్తి - పాలకొల్లు

కల్యాణ మండపంలో జరుగుతున్న కుమార్తె వివాహ తంతులో ఆ కుటుంబం.. బంధువులు అంతా నిమగ్నమయ్యారు. అదే సమయంలో ఇంటి తాళం పగులగొట్టి నగదు, బంగారు వస్తువులు అపహరించిన ఘటన పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లులో సంచలనం సృష్టించింది. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. పట్టణంలో సుబ్బారాయుడు గుడికి సమీపంలో బియ్యం వర్తకుడు బి.నాగేశ్వరరావు కుమార్తె వివాహం లయన్స్ క్లబ్ కళ్యాణ మండపంలో బుధవారం రాత్రి జరిగింది. ఆ సమయంలో పెళ్లి తంతుకు అవసరమైన ఒక వస్తువు కోసం రాత్రి రెండున్నర గంటల సమయంలో ఇద్దరు బంధువులు ఇంటికొచ్చారు. ఇంటికొచ్చేటప్పటికి తలుపులు తెరిచి ఉండటం, ఇంట్లో అలికిడి అవుతుండటంతో అప్రమత్తమైన వారు సమీపంలో ఉన్న బంధువులకు సమాచారం ఇచ్చి ఇంటిని చుట్టుముట్టే ప్రయత్నం చేశారు. అయితే బయట అలజడి గ్రహించిన దొంగలు అక్కడ నుంచి పరారయ్యారు. బంధువులంతా సమీప ప్రాంతాల్లో దొంగల కోసం గాలించినా ఫలితం దక్కలేదు. దీంతో ఇంట్లోకి వెళ్లి బీరువా తలుపులు రాడ్డు సహాయంతో పగటకొట్టి తెరిచినట్లు గుర్తించారు. పెళ్లి ఖర్చుల కోసం బీరువాలో భద్రపర్చిన రూ.ఐదు లక్షల సొమ్ము, బంగారు గొలుసు, గాజులు దోచుకెళ్లారు. సంఘటనా స్థలాన్ని సిఐ రమాదేవి, ఎస్ఐ బాదం శ్రీనివాస్ పరిశీలించారు. భీమవరం సిసిఎస్ సిఐ డి.రాంబాబు దొంగతనం తీరును పరిశీలించి దర్యాప్తు ప్రారంభించారు. క్లూస్ టీమ్ ఆధారాలు సేకరించింది. డాగ్ స్క్వాడ్‌ను రంగంలోకి దింపినా పరిసర ప్రాంతాల్లో తిరిగి నిలిచిపోయింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మాజీ ఐపిఎస్ అధికారి సంజీవ్ భట్‌కు 20 ఏళ్ల జైలు

గాంధీనగర్ : 1996లో ఒక న్యాయవాదిని డ్రగ్స్ కేసులో ఇరికించేందుకు ప్రయత్నించిన కేసులో మాజీ ఐపిఎస్ అధికారి సంజీవ్ భట్‌కు గుజరాజ్‌లోని సెషన్స్ కోర్టు గురువారం 20 ఏళ్ల జైలు శిక్ష విధించింది. 1996లో న్యాయవాదిని డ్రగ్స్ కేసులో ఇరికించేందుకు పాలన్‌పూర్‌లో న్యాయవాది బస చేసిన హోటల్ గదిలో సంజీవ్ భట్ డ్రగ్స్‌ను ఉంచినట్లు బుధవారమే కోర్టు నిర్ధారించింది. బనస్కాంత జిల్లాలోని పాలన్‌పూర్ సెషన్స్ కోర్టు గురువారం తీర్పును వెల్లడించింది. ఒక కస్టడీ మృతి కేసులో భట్ ఇప్పటికే జైలులో ఉన్నారు.

ఐటి ఉత్తర్వులపై కాంగ్రెస్ పిటీషన్లు కొట్టివేత

న్యూఢిల్లీ: కాంగ్రెస్ పార్టీ దాఖలు చేసిన పిటీషన్లను ఢిల్లీ హైకోర్టు గురువారం కొట్టివేసింది. గత నాలుగేళ్లలో పార్టీ ఆదాయ పన్నులపై మళ్లీ మదింపు చేయాలని ఐటి శాఖ ఇచ్చిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ కాంగ్రెస్ దాఖలు చేసిన పిటిషన్లను ఇద్దరు జడ్జిల ధర్మాసనం కొట్టివేసింది. ఢిల్లీ హైకోర్టు ఇటీవల ఇచ్చిన తీర్పు ఈ నాలుగు పిటీషన్లను కవర్ చేశాయని కాంగ్రెస్ - ఆదాయపన్ను శాఖ అంగీకరించడంతో ధర్మాసనం ఈ నిర్ణయం తీసుకుంది. పార్టీ నుంచి ఆదాయ పన్నుగా రూ.105 కోట్లను రికవరీ చేసుకుంటామన్న ఐటీ శాఖ నోటీసులపై స్టే ఇవ్వాలని, తమ పార్టీ ఖాతాలను స్తంభింపజేసే ఐటి విభాగం ప్రొసీడింగ్స్‌పై స్టే విధించాలని కాంగ్రెస్ వేసిన పిటీషన్‌ను ఈ నెల 22న హైకోర్టు తిరస్కరించింది. ఆదాయపు పన్ను అప్పిలేట్ ట్రిబ్యునల్ (ఐటిఎటి)కు ఫిర్యాదు చేసుకోవడానికి కాంగ్రెస్ పార్టీకి ఢిల్లీ హైకోర్టు అనుమతించింది.

అరుణాచల్‌ప్రదేశ్, నాగాలాండ్‌లో ఎఎఫ్ఎస్‌పిఎ మరో ఆరునెలలు పొడిగింపు

న్యూఢిల్లీ : అరుణాచల్‌ప్రదేశ్, నాగాలాండ్‌లోని కొన్ని ప్రాంతాల్లో సాయుధ దళాల ప్రత్యేక అధికారాల చట్టం (ఎఎఫ్ఎస్‌పిఎ)ను మరో ఆరు నెలల పాటు కేంద్ర హోం వ్యవహారాల శాఖ పొడిగించింది. ఈ మేరకు గురువారం రెండు నోటిఫికేషన్లు విడుదల చేసింది. ఇందులో ఒక నోటిఫికేషన్ ప్రకారం నాగాలాండ్‌లోని ఎనిమిది జిల్లాల్లో పూర్తిగా ఎఎఫ్ఎస్‌పిఎను పొడిగించారు. మరో ఐదు జిల్లాల్లో 21 పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఈ చట్టాన్ని పొడిగించారు. ఈ ప్రాంతాల్లో గత ఏడాది సెప్టెంబర్ 26 నుంచి అమల్లో ఉంది. గురువారం విడుదల చేసిన రెండో నోటిఫికేషన్ ప్రకారం అరుణాచల్‌ప్రదేశ్‌లోని మూడు జిల్లాల్లో పూర్తిగా ఈ చట్టాన్ని ఆరు నెలల పాటు పొడిగించారు. ఒక జిల్లాలో మాత్రం మూడు పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఈ చట్టాన్ని పొడిగించారు.

నోటీసులను వాయిదా వేయండి

- మహువా మొయిత్రా

కోల్‌కతా : ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ సమన్లను టిఎంసి నేత మహువా మొయిత్రా దాటవేశారు. లోక్‌సభ అభ్యర్థిగా బరిలోకి దిగిన కృష్ణానగర్ నియోజకవర్గంలో గురువారం చేపట్టనున్న ఎన్నికల ర్యాలీలో పాల్గొనాల్సి ఉన్నందున వెళ్లడం లేదని మహువా మొయిత్రా మీడియాకు వెల్లడించారు. విదేశీ మారక ద్రవ్య నిర్వహణ చట్టం (ఎఫ్ఇఎంఎ) ఉల్లంఘన కేసులో నేడు న్యూఢిల్లీలోని తమ కార్యాలయంలో విచారణకు హాజరుకావాల్సిందిగా మహువాతో పాటు దుబాయికి చెందిన వ్యాపారి దర్శన్ హీరానందానీలకు ఇడి బుధవారం సాయంత్రం సమన్లు జారీ చేసిన సంగతి తెలిసిందే. గతంలో ఇడి రెండు సార్లు విచారణకు హాజరుకావాలని ఆదేశించింది. అధికారిక విధులను ఉటంకిస్తూ.. నోటీసులను వాయిదా వేయాలని ఆమె కోరారు.

నిలువు దోపిడే..

- కార్మికులకు తీవ్ర అన్యాయం
- కనీస వేతనమూ దక్కటం లేదు
- దేశంలో యువతకు ఉద్యోగాలూ కష్టమే
- 'ఇండియా ఎంప్లాయ్‌మెంట్ రిపోర్ట్'లో వెల్లడి



న్యూఢిల్లీ : భారత్‌లోని కార్మికులు తీవ్ర దోపిడీకి గురవుతున్నారు. చేసిన పనికి తగిన వేతనం లభించటం లేదు. కనీస వేతనాలను కార్మికులకు దక్కేలా చట్టాలు చేసి, అమలు చేయాల్సిన ప్రభుత్వాలు మాత్రం దానిని పట్టించుకోవటం లేదు. ఇనిస్టిట్యూట్ ఆఫ్ హ్యూమన్ డెవలప్‌మెంట్(ఐహెచ్‌డీ) ఇటీవల ఆవిష్కరించిన ఇండియా ఎంప్లాయ్‌మెంట్ రిపోర్ట్ 2024 ఈ విషయాన్ని వెల్లడిస్తున్నది. ఈ నివేదిక ప్రకారం.. దేశవ్యాప్తంగా 60 శాతం మంది సాధారణ కార్మికులు తమకు రావాల్సిన కనీస వేతనానికీ నోచుకోలేకపోతున్నారు. "సాధారణ వ్యవసాయ కార్మికులలో 62 శాతం మంది, నిర్మాణ రంగంలో 70 శాతం మంది కార్మికులు 2022లో నిర్దేశించిన రోజువారీ కనీస వేతనాలను పొందలేదు" అని నివేదిక పేర్కొన్నది.

ఈ నివేదికలో కీలకంగా వ్యవహరించిన లేబర్ ఎకనామిస్ట్ రవి శ్రీవాస్తవ మాట్లాడుతూ.. మధ్యవర్తిత్వ సంస్థల ద్వారా ఒప్పందం చేసుకున్న నైపుణ్యం లేని కార్మికులు ఎదుర్కొంటున్న శ్రమ, వేతన దోపిడీని ఎత్తి చూపారు. కాంట్రాక్టర్లు.. కార్మికుల సంపాదనలో కొంత భాగాన్ని లాగేసుకోవటంతో కనీస వేతనం కూడా వారికి అందకుండా పోతున్నదని చెప్పారు. "నా భార్య కిరాణా షాపులో సేల్స్‌పర్సన్‌గా పనిచేస్తున్నది. మా మొత్తం సంపాదన నెలకు రూ. 20,000 కంటే తక్కువ. అద్దెకు ఉంటున్నాం. మేము జీవితాన్ని అతి కష్టం మీద నెట్టుకొస్తున్నాం"అని ఢిల్లీలో పని చేసే ఒక సెక్యూరిటీ గార్డు చెప్పాడు.

నివేదిక ప్రకారం.. 2019 తర్వాత అధిక ఉత్పాదకత తయారీ, సేవా రంగాలలో తగినంత ఉద్యోగ కల్పన జరగకపోవటంతో నాణ్యమైన ఉద్యోగాల కొరత ఉన్నది. 2000-2019 మధ్య, తక్కువ ఉత్పాదకత కలిగిన వ్యవసాయం నుంచి సాపేక్షంగా అధిక ఉత్పాదకత కలిగిన వ్యవసాయేతర రంగాలకు ఉపాధిలో తిరోగమనం కనిపించింది. మహమ్మారి సంబంధిత ఆర్థిక మందగమనంతో వ్యవసాయ రంగం కాని సెక్టార్లలో పని అవకాశాలు లేకపోవటంతో.. వారు వ్యవసాయంలో జీవనాధార కార్యకలాపాలకు తిరిగి రావటమే ఈ పెరుగుదలకు కారణంగా కనిపిస్తున్నది.

"పలు సర్వేలు యువతలో నైపుణ్యాలు లేవని, ఉపాధి పొందటం లేదని చెప్పాయి. మేము ఆ సమస్యను కూడా విశ్లేషించాము. దేశంలో తగిన నాణ్యతతో తగినంత ఉద్యోగాలు సృష్టించబడటంలేదు" అని శ్రీవాస్తవ అన్నారు. "అత్యున్నత స్థాయి విద్య ఉన్న యువతలో మెరుగైన నాణ్యమైన ఉద్యోగాలు కేంద్రీకృతమై ఉన్నాయి. కానీ ఉద్యోగ కల్పన అనేది వారి విద్య, నైపుణ్యం కంటే తక్కువ ప్రమాణాలతో ఉండటం వంటి వివిధ కారణాలతోనూ విద్యావంతులైన యువకులలో అధిక భాగం నిరుద్యోగులుగా మిగిలిపోయారు"అని శ్రీవాస్తవ చెప్పారు. అయితే, ఇలా వెలువడుతున్న పలు జాతీయ, అంతర్జాతీయ నివేదికలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టి సారించి ఈ సమస్యకు తగిన పరిష్కారాన్ని కనుగొనాలని విద్యావేత్తలు, నిపుణులు, సామాజిక కార్యకర్తలు సూచిస్తున్నారు.

ఉపాధి హామీ కూలీలకు పెరిగిన రోజువారీ వేతనం

- ఎపి, తెలంగాణలో రూ.28 చొప్పున పెంపు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఉపాధి హామీ కూలీల ఆందోళనతో కేంద్ర ప్రభుత్వం, వారి రోజువారీ వేతనాలను స్వల్పంగా పెంచింది. వివిధ రాష్ట్రాలకు గానూ మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద (ఎంజిఎన్ఆర్ఇజిఎస్) 4 నుంచి 10 శాతం వరకు వేతనాలు పెంచింది. వేతనాల సవరణలో భాగంగా ప్రభుత్వం పెంపుదలను ప్రతిపాదించింది. ఈ పథకం కింద కార్మికులకు హర్యానాలో అత్యధిక వేతనం రోజుకు రూ.374 అందనుండగా, అరుణాచల్‌ప్రదేశ్, నాగాలాండ్‌లలో అత్యల్పంగా రూ.234 వేతనం అందనుంది. సిక్కింలోని మూడు పంచాయతీలు గ్నాతంగ్, లాచుంగ్, లాచెన్ ప్రజలు రోజుకు సగటు వేతనం రూ.374గా పొందనున్నారు. లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ (ఎంసిసి) అమలులో ఉన్నందున ఎన్నికల సంఘం నుంచి క్లియరెన్స్ వచ్చిన తరువాత ఈ పథకం కింద వేతన సవరణను మార్చి 27న కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ నోటిఫై చేసింది. కార్మికులు వారు నివసిస్తున్న గ్రామంలో ప్రతి కుటుంబానికీ ఆర్థిక సంవత్సరంలో కనీసం 100 రోజుల వేతన ఉపాధిని కల్పించడం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లోని కుటుంబాల జీవనోపాధి భద్రతను పెంపొందించే లక్ష్యం ఈ పథకం ముఖ్య ఉద్దేశం. నోటిఫికేషన్ ప్రకారం.. గోవాలో వేతన పెంపు రేటు దేశంలోనే అత్యధికంగా రూ.34గా ఉంది. ప్రస్తుతం అక్కడ రోజువారీ కూలి రూ.356 ఇస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో వేతన పెంపు రూ.28గా ఉంది. ఇప్పుడు మొత్తం కూలి రూ.300కు చేరింది. తెలంగాణలో రూ.28 పెంచడంతో రోజువారీ కూలి రూ.300కు చేరింది. ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్‌లలో పెరుగుదల అత్యల్పంగా రూ.7గా ఉంది. రెండు రాష్ట్రాల్లో పని చేసే కార్మికులు రోజుకు రూ.237 వేతనం అందుకోనున్నారు. పశ్చిమబెంగాల్‌లో రూ.250 (రూ.13 పెరుగుదల), తమిళనాడులో రూ.319 (రూ.25 పెరుగుదల), బీహార్‌లో రూ.228 (రూ.17 పెరుగుదల)గా ఉంది. వేతన రేటు పరంగా హర్యానా అగ్రస్థానంలో ఉన్నప్పటికీ, పెరుగుదల కేవలం నాలుగు శాతంగానే ఉంది. మొత్తమ్మీద పెంపుదల 4 నుంచి 10 శాతం మధ్య ఉంది. తెలంగాణ, ఎపి, గోవా, కర్ణాటక రాష్ట్రాల్లో దాదాపు 10 శాతం పెరుగుదల నమోదైంది.

రాజకీయ ఒత్తిళ్లతో న్యాయవ్యవస్థకు ముప్పు

- సిజెఐకి 600 మంది న్యాయవాదుల లేఖ

న్యూఢిల్లీ : దేశంలో న్యాయవ్యవస్థ సమగ్రతను దెబ్బతీసే ప్రయత్నాలు జరుగుతున్నాయని న్యాయవాదులు ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా రాజకీయ నాయకులకు సంబంధించిన కేసుల్లో కోర్టు తీర్పులను ప్రభావితం చేసేందుకు కొన్ని స్వార్థ సమూహాలు ఒత్తిడి వ్యూహాలను అమలు చేస్తున్నాయని ఆరోపించారు. ఈ మేరకు ప్రముఖ న్యాయవాదులు హరీశ్ సాల్వే, పింకీ ఆనంద్, బార్ కౌన్సిల్ చైర్‌పర్సన్ మనన్ కుమార్ మిశ్రా సహా 600 మందికి పైగా న్యాయవాదులు భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డివై చంద్రచూడ్‌కు లేఖ రాశారు. ప్రస్తుతం లోక్‌సభ ఎన్నికల సమయంలో ఈ లేఖ రాయడం అందరి దృష్టిని ఆకర్షిస్తోంది.

'రాజకీయ అజెండాతో స్వార్థ ప్రయోజనాలను ఆశించే కొన్ని స్వార్థ సమూహాలు న్యాయవ్యవస్థపై ఒత్తిడి తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నాయి. న్యాయపరమైన ప్రక్రియలను ప్రభావితం చేసి, కోర్టు ప్రతిష్ఠను దెబ్బతీయాలని చూస్తున్నాయి. వీరు అనేక మార్గాలను అనుసరిస్తున్నారు. కోర్టులపై ప్రజల్లో విశ్వాసాన్ని తగ్గించేందుకు న్యాయస్థానాల కీలక తీర్పులపై తప్పుడు కథనాలు సృష్టిస్తున్నారు' అని లాయర్లు ఆందోళన వ్యక్తం చేశారు.

'కొందరు రాజకీయ నాయకులు కొందరిపై అవినీతి ఆరోపణలు చేయడం.. ఆ తర్వాత ఆరోపణలు చేసినవారినే కోర్టుల్లో సమర్థించడం వింతగా ఉంది. కోర్టు నిర్ణయాలు తమకు అనుకూలంగా రాకపోతే వెంటనే బహిరంగ విమర్శలకు దిగుతున్నారు. సోషల్ మీడియాలో అవాస్తవాలను ప్రచారం చేస్తూ న్యాయమూర్తులపై ఒత్తిడి తీసుకొచ్చే ప్రయత్నాలు చేస్తున్నారు. వ్యక్తిగత, రాజకీయ కారణాలతో కోర్టు ప్రతిష్ఠను దెబ్బతీసే ఇలాంటి ప్రయత్నాలను ఎట్టిపరిస్థితుల్లోనూ అనుమతించకూడదు. ఇలాంటి వాటిపై మౌనంగా ఉంటే.. న్యాయవ్యవస్థలకు హాని చేయాలనుకునే వారికి మరింత బలం ఇచ్చినట్లే. న్యాయస్థానాల కోసం నిలబడాల్సిన సమయం ఆసన్నమైంది. దీనిపై కఠిన చర్యలు తీసుకోవాలని సుప్రీంకోర్టును కోరుతున్నాం" అని న్యాయవాదులు తమ లేఖలో కోరారు.

ఇతరులను బుజ్జగించడం, బెదిరించడం కాంగ్రెస్ సంస్కృతి : మోడీ

భారత ప్రధాన న్యాయమూర్తికి 600 మంది న్యాయవాదులు లేఖ రాసిన అంశంపై ప్రధానమంత్రి నరేంద్ర మోడీ స్పందించారు. ఇతరులను బుజ్జగించడం, బెదిరించడం కాంగ్రెస్ సంస్కృతి అని అన్నారు. ఈ మేరకు ఆయన ట్వీట్ చేశారు. 'ఇతరులను బుజ్జగించడం, బెదిరించడం కాంగ్రెస్ సంస్కృతి. అయిదు దశాబ్దాల క్రితమే వారు (కాంగ్రెస్) కేంద్రానికి కట్టుబడి ఉండే న్యాయవ్యవస్థ కోసం పిలుపునిచ్చారు. తమ స్వార్థ ప్రయోజనాల కోసం ఇతరుల నుంచి నిబద్ధతను సిగ్గులేకుండా కోరుకుంటారు. దేశంపై మాత్రం ఎటువంటి నిబద్ధతను ప్రదర్శించడానికైనా దూరంగా ఉంటారు' అని అని తెలిపారు.

పారాబోలిక్ డ్రగ్స్ లిమిటెడ్ రూ.82.12 కోట్ల ఆస్తుల జప్తు

న్యూఢిల్లీ : పారాబోలిక్ డ్రగ్స్ లిమిటెడ్‌కు చెందిన బ్యాంకు మోసం కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) రూ.82.12 కోట్ల ఆస్తులను స్వాధీనం చేసుకుంది. మనీలాండరింగ్ నిరోధక చట్టం (పిఎంఎల్‌ఎ) కింద సంస్థకు చెందిన డైరెక్టర్లు, ఇతరుల చరాస్తులతో పాటు 24 స్థిరాస్తులను కూడా జప్తు చేసినట్లు అధికారులు తెలిపారు. ప్రణవ్ గుప్తా, వినీత్ గుప్తా, చార్టర్డ్ అకౌంటెంట్ సుర్జీత్ కుమార్ బన్సాల్ సహా వారి కుటుంబసభ్యుల క్రైమ్ ప్రొసీడ్స్ (పిఒసి)కి సంబంధించినవని ఇడి అధికారులు పేర్కొన్నారు. 1988లో సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సిబిఐ) పారబోలిక్ డ్రగ్స్ లిమిటెడ్, ఆ సంస్థ ప్రమోటర్- డైరెక్టర్లు ప్రణవ్, వినీత్, ఇతరులపై నమోదు చేసిన ఎఫ్ఐఆర్ ఆధారంగా ఈ విచారణ జరిగినట్లు ఇడి తెలిపింది. గతేడాది చివరలో వారిని అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. 2009 -2014 మధ్య సెంట్రల్ బ్యాంక్ సహా ఇతర బ్యాంకులు, ఆర్థిక సంస్థలను రూ. 1,626.70 కోట్ల మేర మోసం చేసినట్లు పేర్కొంది.

గతంలో ఈ కేసుతో సంబంధం ఉన్న వారితో పాటు ఎంట్రీ ఆపరేటర్స్‌కు చెందిన చండీగఢ్, అంబాలా, పంచకుల, సోన్‌పేట్, ముంబయి, ఢిల్లీల్లో సోదాలు చేపట్టినట్లు తెలిపింది.

ఈస్టర్ డే సెలవును రద్దు చేసిన బిజెపి ప్రభుత్వం

ఇంఫాల్ : మణిపూర్‌లో శని, ఆదివారాలను పనిదినాలుగా ప్రకటిస్తూ బిజెపి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర గవర్నర్ అనసూయ ఉయికే డిప్యూటీ సెక్రటరీ (జిఎడి) గురువారం ఈ ఉత్తర్వులు విడుదల చేశారు. ప్రభుత్వ పరిధిలోని ప్రభుత్వరంగ సంస్థలు, కార్పోరేషన్‌లు, స్వయంప్రతిపత్తి కలిగిన సంస్థలు, సొసైటీలతో సహా అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు ఈ ఆదేశాలు వర్తిస్తాయని పేర్కొంది. మణిపూర్‌లో మొత్తం 9 జిల్లాలు ఉండగా, వీటిలో ఐదు జిల్లాల్లో క్రైస్తవులు ఉన్నారు. 2011 జనాభా లెక్కల ప్రకారం రాష్ట్రంలో 41.29 శాతం క్రైస్తవ జనాభా ఉంది. వీరంతా కుకీ కమ్యూనిటీకి చెందినవారు. శుక్రవారం గుడ్‌ఫ్రైడే కాగా, శని, ఆదివారాల్లో ఈస్టర్ డేను ఘనంగా జరుపుకుంటారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం ఈస్టర్ డే అయిన ఆదివారంను కూడా పనిదినంగా ప్రకటించింది. సాధారణంగా ఆదివారం ప్రభుత్వ కార్యాలయాలకు సెలవు అయినప్పటికీ... సెలవును రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేయడం గమనార్హం.

చివరి శ్వాస వరకు ఇక్కడి ప్రజలతో కొనసాగుతా : వరుణ్‌గాంధీ

న్యూఢిల్లీ : చివరి శ్వాస వరకు పిల్‌భిత్ నియోజకవర్గంలోని ప్రజలతో తన బంధం కొనసాగుతుందని బిజెపి ఎంపి వరుణ్ గాంధీ పేర్కొన్నారు. తనకు బిజెపి లోక్‌సభ ఎంపి టికెట్ తిరస్కరించడంపై వరుణ్ గాంధీ గురువారం మొదటిసారి ఎక్స్‌లో స్పందించారు. తన నియోజకవర్గ ప్రజలకు భావోద్వేగ లేఖ రాశారు. "ఎంపిగా నా పదవీకాలం ముగింపు దశకు వస్తోంది. అయినా పిల్‌భిత్ ప్రజలతో నా సంబంధం చివరి శ్వాస వరకు కొనసాగుతుంది. ఎంపి పదవి లేకపోయినా, కొడుకుగా జీవితాంతం మీకు సేవ చేసేందుకు కట్టుబడి ఉంటాను. నా ఆలోచనలు ఎప్పుడూ మీతోనే ఉంటాయి" అని లేఖలో పేర్కొన్నారు. "ప్రజల గొంతుకను వినిపించేందుకు రాజకీయాల్లోకి వచ్చాను. చివరి వరకు ఈ బాధ్యతను నిర్వర్తించేందుకు మీ ఆశీర్వాదాలు కావాలి" అని తెలిపారు. తనతల్లి వేలు పట్టుకుని 1983లో మొదటిసారిగా పిల్‌భిత్‌కు వచ్చిన రోజు తనకు గుర్తుందని, అయితే ఆ ప్రాంతం నుండే తాను ఎంపిగా గెలుస్తానని, చివరికి వారే తన కుటుంబంగా మారతారని అతనికి తెలియదని అన్నారు.

రైతుల ఉద్యమంసహా పలు సందర్భాల్లో మోడీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను విమర్శించడంతో వరుణ్‌గాంధీకి బిజెపి టికెట్ నిరాకరించింది. ఉత్తరప్రదేశ్ మంత్రి, కాంగ్రెస్ పార్టీకి గుడ్‌బై చెప్పి ఇటీవల బిజెపి తీర్థం పుచ్చుకున్న జితిన్ ప్రసాదను ఫిల్‌భిత్ నుండి బిజెపి బరిలోకి దింపింది. కాంగ్రెస్ లేదా సమాజ్‌వాదీ పార్టీ తరపున వరుణ్‌గాంధీ పోటీ చేసే అవకాశముందని ప్రచారం జరుగుతోంది.

వృథా.. వృథా

- ప్రపంచంలో ఐదో వంతు ఆహారం వ్యర్థం
- యుఎన్ఇపి ఆహార వ్యర్థాల సూచిక నివేదిక 2024

న్యూఢిల్లీ : ప్రపంచవ్యాప్తంగా తిండి లభించగా కోట్లాది మంది ఆకలితో అలమటిస్తున్నారు. కానీ, ఆహారం అందుబాటులో ఉన్నవారు మాత్రం దానిని వృథాగా పారేస్తున్నారు. ప్రజలకు అందుబాటులో ఉన్న మొత్తం ఆహారంలో దాదాపు ఐదో వంతు ఇలాగే వ్యర్థమవుతున్నది. యూఎన్ఈపీ ఆహార వ్యర్థాల సూచిక నివేదిక-2024 ఈ విషయాన్ని వెల్లడిస్తున్నది.



ఈ నివేదిక సమాచారం ప్రకారం.. 2022లో 1.05 బిలియన్ టన్నుల ఆహార వ్యర్థాలు (తినదగని భాగాలతో సహా) ఉత్పత్తయ్యాయి. ఇది వినియోగదారులకు అందుబాటులో ఉన్న మొత్తం ఆహారంలో దాదాపు ఐదవ వంతు. ప్రతి వ్యక్తి, ప్రపంచంలోని గృహాలలో సంవత్సరానికి సగటున 79 కిలోల ఆహారాన్ని వథా చేస్తున్నారు. భారత్‌లో మాత్రం ఇది సంవత్సరానికి తలసరి 55 కిలోలుగా ఉన్నది. సరఫరా గొలుసులో ఆహార నష్టం, ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై వ్యర్థాల సంఖ్య దాదాపు 1 ట్రిలియన్ డాలర్లుగా అంచనా వేయబడింది. 78.3 కోట్ల మంది ప్రజలు ఆకలితో బాధపడుతున్నారు. మానవాళిలో మూడింట ఒక వంతు మంది ఆహార అభద్రతను ఎదుర్కొంటున్నారు.

2022లో ప్రపంచ ఆహార వ్యర్థాల మొత్తం.. 2022-23లో భారతదేశపు ఆహారధాన్యాలు, నూనెగింజలు, చెరకు, ఉద్యానవన ఉత్పత్తుల మొత్తం ఉత్పత్తి కంటే ఎక్కువ కావటం గమనార్హం. 2022లో ప్రపంచవ్యాప్తంగా వృథా అయ్యే మొత్తం ఆహారంలో 60 శాతం గృహ స్థాయిలో, 28 శాతం ఆహార సేవల స్థాయిలో, 12 శాతం రిటైల్‌లలో జరిగింది. దేశంలోని ఆహార వ్యర్థాల డేటా అటువంటి వ్యర్థాలు కేవలం 'సంపన్న దేశం' సమస్య కాదని చెప్పటం గమనార్హం.

గృహ స్థాయిలో ప్రతి సంవత్సరం తలసరి ఆహార వ్యర్థాలు ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్నాయి. 2019లో 74కిలోల నుంచి 2022లో 79కిలోలకు పెరిగింది. అదేవిధంగా, అదే సమయంలో భారతదేశంలో ఏడాదికి తలసరి 50 కిలోల వ్యర్థాల నుంచి 55 కేజీలకు పెరిగింది. 2022లో మాల్దీవుల్లో ఏడాది 207 కిలోల తలసరి ఆహార వ్యర్థాలు గృహ స్థాయిలో అత్యధికంగా ఉన్నాయి. "ప్రపంచవ్యాప్తంగా ఆహారాన్ని వృథా చేయటంతో లక్షలాది మంది ఆకలితో అలమటిస్తున్నారు. ఇది ఒక ప్రధానాభివృద్ధి సమస్య మాత్రమే కాదు.. ఇటువంటి అనవసరమైన వ్యర్థాల ప్రభావాలు వాతావరణం, ప్రకృతికి గణనీయమైన ఖర్చులను కలిగిస్తున్నాయి" అని యుఎన్ఇపి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఇంగర్ ఆండర్సన్ అన్నారు. ప్రస్తుతం, చాలా తక్కువ, మధ్య-ఆదాయ దేశాలు 2030 నాటికి ఆహార వ్యర్థాలను సగానికి తగ్గించే సస్టైనబుల్ డెవలప్‌మెంట్ గోల్ (ఎస్డీజీ)ని చేరుకోవటానికి, ముఖ్యంగా రిటైల్, ఆహార సేవలలో పురోగతిని ట్రాక్ చేయటానికి తగిన వ్యవస్థలు లేకపోవటం గమనార్హం.

ఆప్ ప్రభుత్వాలను అస్థిరపరిచేందుకు కుట్ర

- ఢిల్లీ, పంజాబ్‌లో ఆప్ ఎంపీలకు, ఎమ్మెల్యేలకు ఎర

ప్రజాశక్తి- న్యూఢిల్లీ

ఢిల్లీ, పంజాబ్‌లలో ఆమాద్మీ పార్టీ (ఆప్) ప్రభుత్వాలను కూల్చేందుకు బిజెపి 'ఆపరేషన్ తమరా' ను అమలు చేస్తోందని ఢిల్లీ ఆరోగ్యశాఖ మంత్రి సౌరవ్‌భరద్వాజ్ ఆరోపించారు. బిజెపిలో చేరితే 20 నుంచి 25 కోట్లు డబ్బు, మరిన్ని పదవులు ఎరగా వేసిందని ఆయన గురువారం నాడిక్కడ విలేకరుల సమావేశంలో వెల్లడించారు. దీనికి లొంగిపోయిన జలంధర్ ఆప్ ఎంపి సుశీల్, జలంధర్ ఎమ్మెల్యే శీతల్ అంగురల్ బిజెపిలోకి బుధవారం ఫిరాయించారని అన్నారు. ఆప్‌ను నాశనం చేయాలన్న లక్ష్యంతోనే బిజెపి ఇటువంటి నీతిబాహ్యమైన చర్యలకు పాల్పడుతోందని ఆయన విమర్శించారు.

అమెరికా వ్యాఖ్యలు అవాంఛనీయం

ముఖ్యమంత్రి కేజ్రివాల్ అరెస్టుపై అమెరికా విదేశాంగ మంత్రి చేసిన వ్యాఖ్యలు అవాంఛనీయమని భారత విదేశాంగ శాఖ స్పష్టం చేసింది. దేశ ఎన్నికల, న్యాయ వ్యవస్థలపై, అవి అనుసరించే ప్రక్రియలపై బయటివారు చేసే వ్యాఖ్యలు ఎంత మాత్రమూ ఆమోదయోగ్యం కాదని విదేశాంగ శాఖ ప్రతినిధి వ్యాఖ్యానించారు. భారత్‌కు సర్వ స్వతంత్రమైన, క్రియాశీలమైన ప్రజాస్వామ్య వ్యవస్థలు, సంస్థలు వున్నాయని, వాటిని ఏ రీతిలోనైనా, ఎవరైనా ప్రభావితం చేసే ప్రయత్నాలు చేసినా వాటిని పరిరక్షించుకోవడానికి సిద్ధంగా వుంటామని స్పష్టం చేసింది.

భువనేశ్వర్‌లో ఆప్ దీక్షలు

కేజ్రివాల్ అరెస్టును నిరసిస్తూ గురువారం భువనేశ్వర్‌లో ఆప్ కార్యకర్తలు నిరాహార దీక్ష పాటించారు. ఉదయం 10గంటల నుండి సాయంత్రం 5గంటల వరకు ఏడు గంటల పాటు జరిగింది.

ఇడి ఏం కోరితే అది ఇస్తాం : అమిత్ పాలేకర్

ఆమ్ ఆద్మీ పార్టీ గోవా శాఖ అధ్యక్షుడు అమిత్ పాలేకర్‌ను ఇడి అధికారులు ప్రశ్నించారు. ఇడి ఆఫీసు నుండి బయటకు వచ్చిన తర్వాత మాట్లాడుతూ, 'దర్యాప్తు ఏం జరుగుతోందనేది వెల్లడించలేను, కానీ దర్యాప్తులో నేను కూడా పాల్గొన్నాను. వారేం ప్రశ్నలు అడిగారో దానికి సమాధానం చెప్పాను. ఈ కేసుకు సంబంధించిన డేటా అడిగారు, అందచేస్తానని చెప్పాను." అని తెలిపారు. వారు వారి విధి నిర్వహిస్తున్నారు, నేను పౌరుడిగా నా బాధ్యతలు నిర్వర్తిస్తున్నానని అన్నారు.

నా భర్తను వేధిస్తున్నారు : సునీత కేజ్రివాల్

మద్యం విధానం కేసులో అరెస్టు చేసిన తన భర్తను ఇడి అధికారులు తీవ్రంగా వేధిస్తున్నారని అరవింద్ కేజ్రివాల్ సతీమణి సునీతా కేజ్రివాల్ చెప్పారు. తన భర్త ఆరోగ్యం బాగా లేదని, షుగర్ లెవెల్స్ ఒడిదుడుకులకు గురవుతున్నాయని తెలిపారు. ప్రతి రోజూ రెండు పరీక్షలు చేయడానికి అనుమతించారని, డాక్టర్ల సలహా ప్రకారం ఇంటి భోజనానికి కూడా అనుమతించారని చెప్పారు. అరవింద్ చాలా ధైర్యవంతుడని, దేశభక్తిపరుడని, ఆయన పట్టుదల, దీక్ష కూడా చాలా బలంగా వుంటాయని ఆమె పేర్కొన్నారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వ పాలన ఇక ఎన్నాళ్లో సాగదని, ప్రజలు తగిన బుద్ధి చెబుతారని ఆమె వ్యాఖ్యానించారు. గురువారంతో ఇడి కస్టడీ ముగియనుండడంతో కేజ్రివాల్‌ను కోర్టులో హాజరుపరిచేందుకు తీసుకువచ్చారు. అక్కడకు వచ్చిన సునీత విలేకర్లతో మాట్లాడారు.

తన శరీరం జైల్లో వున్నా, తన ఆత్మ మాత్రం ఢిల్లీ ప్రజలతోనే వుంటుందని కేజ్రివాల్ వ్యాఖ్యానించారు. "మీ కళ్లు మూసుకోండి, మీ పక్కనే నేను వున్నట్లు అనిపిస్తుంది." అని అన్నారు. తన భర్త ఎక్స్‌లో పోస్టు చేసిన వీడియో సందేశాన్ని సునీత ప్రజలకు చదివి వినిపించారు. ఆప్‌ను అణగదొక్కాలని చూస్తున్నారని ఢిల్లీ మంత్రి సౌరభ్ భరద్వాజ్ విమర్శించారు. అమెరికా, జర్మనీ ప్రభుత్వాల నుండి వచ్చిన వ్యాఖ్యలతో కేంద్రం బెదిరిపోతోందని, భారత్‌లో ప్రజాస్వామ్యం గురించి, కేజ్రివాల్ పారదర్శక విచారణ గురించి వారు ఆందోళన చెందుతున్నారని అన్నారు. అరవింద్ కేజ్రివాల్, సౌరభ్ భరద్వాజ్‌లు చేసిన వ్యాఖ్యలు, విమర్శలపై ఇడి లేదా బిజెపిల నుండి ఎలాంటి ప్రతిస్పందనలు ఎదురు కాలేదు.

రామేశ్వరం కేఫ్ పేలుడు కేసులో కీలక నిందితుడి అరెస్ట్

బెంగళూరు : బెంగళూరులోని బ్రూక్ ఫీల్డ్ లోని 'రామేశ్వరం కేఫ్' బాంబు పేలుడు కేసులో కీలక కుట్రదారుగా అనుమానిస్తున్న వ్యక్తిని జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఎ) అధికారులు అరెస్ట్ చేశారు. మూడు రాష్ట్రాల్లో గాలించిన తర్వాత అతడ్ని అరెస్ట్ చేసినట్లు ఎన్ఐఎ తెలిపింది. ఈ నెల ఒకటో తేదీన జరిగిన కేఫ్ బాంబు పేలుడు పలువురు వ్యక్తులు గాయపడ్డారు. ఈ నెల మూడో తేదీన ఈ కేసు దర్యాప్తు చేపట్టిన ఎన్ఐఎ అధికారులు మూడు రాష్ట్రాల్లోని 18 ప్రాంతాల్లో గాలింపు చేపట్టారు. కర్ణాటకలోని 12 చోట్ల, తమిళనాడులో ఐదు, ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో ఒకచోట దాడులు చేశాయి. ఈ కేసుతో సంబంధం ఉన్న ఇద్దరు వ్యక్తులకు సహాయం చేసిన ముజమ్మిల్ షరీఫ్ అనే వ్యక్తిని ఎన్ఐఎ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. ఆ ఇద్దరు వ్యక్తులు ముస్సావిర్ షాజీబ్ హుస్సేన్, అబ్దుల్ మథీన్ తహా గాగుర్తించారు. బాంబు దాడికి నెల రోజుల ముందు నుంచి ముస్సావిర్, అబ్దుల్‌లు చెన్నైలోని ఓ లాడ్జిలో ఉన్నట్లు ఎన్ఐఎ దర్యాప్తులో తేలింది.

6న కాంగ్రెస్ మేనిఫెస్టో

జైపుర్: లోక్‌సభ ఎన్నికలకు సంబంధించిన మేనిఫెస్టోను కాంగ్రెస్ పార్టీ ఏప్రిల్ 6న విడుదల చేయనుంది. జైపుర్‌లో జరిగే బహిరంగ సభలో పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, సీనియర్ నాయకులు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ విడుదల చేస్తారని రాజస్థాన్ కాంగ్రెస్ ఇన్‌ఛార్జ్ సుఖ్‌జిందర్ సింగ్ రంధ్వా తెలిపారు. పార్టీ వార్ రూమ్ భేటీ తర్వాత ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ విషయాన్ని వెల్లడించారు. ఈ మేనిఫెస్టోలో సామాజిక సంక్షేమ పథకాలతోపాటు, 25 గ్యారంటీలను కాంగ్రెస్ ప్రకటించనుంది. 'న్యాయ్ పిల్లర్ల' పేరుతో 25 గ్యారంటీలను ఐదు భాగాలుగా విభజించింది. పి. చిదంబరం ఆధ్వర్యంలోని పార్టీ కమిటీ ప్రజల నుంచి సలహాలు, సూచనలు స్వీకరించింది.

డానియల్ కాహ్నెమన్ మృతి



శాన్‌ఫ్రాన్సిస్కో : నోబెల్ బహుమతి గ్రహీత, ప్రముఖ కాగ్నిటివ్ సైకాలజిస్ట్ డానియల్ కాహ్నెమన్ (90) బుధవారం మరణించారు. ఇజ్రాయెల్ మూలాలున్న ఆయన.. మనుషులు నిర్ణయాలు తీసుకునే విధానంపై లోతైన పరిశోధనలు చేశారు. ఆయన పలు యూనివర్శిటీల్లో అధ్యాపక, పరిశోధన బాధ్యతలు నిర్వర్తించారు. డానియెల్ కాహ్నెమాన్, ఆయన సహచరుడు అమోస్ ట్వర్స్కీలు ఆర్థిక శాస్త్ర రంగాన్ని పునర్‌నిర్మించారు. మనుషులు 'హేతుబద్ధ నటులు' అని, ఏ కారు కొనాలి, ఏ ఉద్యోగం ఎంపిక చేసుకోవాలని వంటి విషయాల్లో ఎంపికను స్పష్టంగా అంచనా వేయగలరని వివరించారు. వీరు 2011లో విడుదల చేసిన పరిశోధనా పుస్తకం "థింకింగ్, ఫాస్ట్ అండ్ స్లో" అత్యధికంగా అమ్ముడైంది. కాహ్నెమాన్‌కు 2002లో నోబెల్ బహుమతి లభించింది. అనిశ్చిత పరిస్థితుల్లో మనుషులు తీసుకునే నిర్ణయాల తీరును ఆర్థికశాస్త్రంతో అనుసంధానం చేస్తూ ఆయన చేసిన పరిశోధనకు ఈ ప్రతిష్ఠాత్మక అవార్డు దక్కింది. మనిషి నిర్ణయాలు తార్కికంగా ఉంటాయని ఎకనమిక్ థియరీ భావిస్తే, అనిశ్చిత పరిస్థితుల్లో మాత్రం మనుషులు ఇందుకు భిన్నంగా ప్రవర్తిస్తారని ఆయన తన పరిశోధనలతో రుజువు చేశారు.

మాల్దీవులకు చైనా సాయం

మాలె: మాల్దీవుల్లో తాగునీటి కొరతను అధిగమించేందుకు చైనా సాయం చేసింది. చైనా పంపిన నీటిని త్వరలో అన్ని ప్రాంతాలకు సరఫరా చేయనున్నట్లు మాల్దీవులు వెల్లడించింది. సహాయంలో భాగంగా తాజాగా 1,500 టన్నుల తాగునీటిని మాల్దీవులకు చైనా అందజేసింది. టిబెట్‌లోని హిమనీ నదాల నుంచి ఈ నీటిని సేకరించింది. గతేడాది నవంబరులో టిబెట్ అటానమస్ రీజియన్ ఛైర్మన్ యాన్ జిన్హాయ్ మాల్దీవుల్లో పర్యటించారు. ఆ సందర్భంగా తాగునీటి కొరతను అధిగమించేందుకు సాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఆ హామీ ఇప్పుడు కార్యరూపం దాల్చింది. కాగా, మాల్దీవులకు పొరుగు దేశాలు తాగునీటిని అందించడం ఇదే తొలిసారి కాదు. 2014లో 'ఆపరేషన్ నీర్' పేరిట మాల్దీవులకు మొదటివిడతలో 375 టన్నుల తాగునీటిని భారత్ సరఫరా చేసింది. తర్వాత మరో రెండు వేల టన్నుల నీరు పంపింది.





ఉధృతంగా సిపిఎం అభ్యర్థుల ప్రచారం

లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో పశ్చిమ బెంగాల్‌లో సిపిఎం అభ్యర్థులు ఉధృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. వీరికి ప్రజల నుంచి మంచి మద్దతు లభిస్తోంది. ముర్షిదాబాద్ నియోజవర్గంలో ఎండి సలీం, బిష్ణుపూర్‌లో సీతల్ చంద్ర కెబర్తా గురువారం ప్రచారం నిర్వహించారు.



మీ కోసం

అల్లం, వెల్లుల్లి ముద్ద చేసేటప్పుడు కొద్దిగా నూనె వేస్తే పేస్టు మెత్తగా వస్తుంది. ఎక్కువ రోజులు నిల్వ ఉంటుంది.

జీవన సౌరభం

వినేందుకు కటువుగా అనిపించినా మీ గురించి వాస్తవాలు చెప్పే వారి సలహాలు తీసుకోవడం మంచిది.

సున్నప్పిడత



వంట పూర్తి చేసి అప్పడాలు, గుమ్మడి వడియాలు వేయించి పళ్ళెంలో పెట్టింది సౌమ్య. భోజనాలకు సిద్ధం చేయడానికి వరండాలోకి వెళ్ళింది. ఈలోపు రుద్ర, గరిట పట్టుకుని నెమ్మదిగా గదిలోకి వెళ్ళి వేయించిన అప్పడాల మీద ఒక్క మొట్టు మొట్టాడు. అంతే అప్పడాలన్నీ ముక్కలుముక్కలు అయిపోయాయి. అది చూసిన సౌమ్యకి కోపం చిర్రెత్తుకొచ్చింది. 'నూరు అప్పడాలకు ఒకటే సొడ్డు' అన్నట్లు ఉదయం నుంచి అన్నీ పాడు పనులే చేస్తున్నావ్' అని రుద్ర చెవిని గట్టిగా నులిమింది. దాంతో ఆరున్నొక్క రాగం తీస్తూ వసారాలో ఉన్న ముని మామ్మ లక్ష్మీ నరసమ్మ దగ్గరికి వెళ్లాడు రుద్ర.

'అయ్యో ఏమైంది బంగారం. అమ్మెందుకు కొట్టింది. నువ్వు బుద్ధి కదా!' అంది మునిమామ్మ. 'అలాగే వెనకేసుకు రండి. అందుకే వాడికి కొమ్ములొస్తున్నాయి. సున్నప్పిడత గాడు. అప్పడాలు పిండి చేశాడు, తోమిన సామాన్లు అన్నీ కింద పరిచేసాడు. ఆరిన బట్టలు తడిపేసాడు' అని తిట్టింది సౌమ్య.

'వాడికేం తెలుస్తుంది చిన్నవాడు. ఏది చెయ్యాలో, ఏది చెయ్యకూడదో మనం చెప్పాలి' అంది ముని మామ్మ. అమ్మ అటు వెళ్లగానే 'మామ్మ గారూ... సున్నప్పిడత అంటే ఏమిటి?' అని ఏడుపు ఆపి అమాయకంగా అడిగాడు రుద్ర.

'పూర్వం అందరూ భోజనం చేసిన తరువాత తాంబూలం వేసుకునేవారు. దానికోసం అందరి ఇళ్లల్లో చిన్న కుండ పిడతల్లో సున్నం ఉంచుకునేవారు. దానిని సున్నపు పిడత అనేవారు. ఓసారి సీతాపతి పంతులు గారి ఇంట్లో ఉన్న నీలాంటి అల్లరోడు ఆ సున్నప్పిడతని పగులగొట్టాడు. ఇల్లూ వాకిలి సున్నం అయ్యింది. వాళ్ళమ్మ ఎన్ని సార్లు కడిగి శుభ్రం చేసినా తెల్లగా మరక ఉండిపోయింది. 'ఒక పనికి రెండు పనులంటే ఇవే' సున్నప్పిడత వెధవ అని తిట్టింది. అప్పటి నుంచి పాడు పనులు చేసే అల్లరి పిల్లల్ని 'సున్నప్పిడత' అని పిలవడం వాడుకలోకి వచ్చింది. అందుకే మీ అమ్మ నిన్ను అలా అంది' అని వివరంగా చెప్పింది మునిమామ్మ.

'సరే మామ్మ, ఇక నుండి అల్లరి చేయకుండా బుద్ధిగా ఉంటాను' అంటూ ముని మామ్మ గారి మంచి నీళ్ళ చెంబును తన్నుకుంటూ వెళ్ళాడు రుద్ర. 'హారీ సున్నప్పిడతా!' అంటూ ముని మామ్మ నోరెళ్ళబెట్టారు.


- కాశీ విశ్వనాథం పట్రాయుడు,
94945 24445.

నేను గీసిన బొమ్మ



- వై.ఉన్నతి,
4వ తరగతి,
జెమిని స్కూలు,
బ్రాడీపేట, గుంటూరు.





లెక్క చేయండి

పిల్లలూ, ఇక్కడ కొన్ని బొమ్మలను అంకెలుగా గణించి లెక్క చేశాం. క్లూ ఆధారంగా ఆ అంకెలను కనిపెట్టండి చూద్దాం.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

ఆమె సంకల్పం దృఢమైనది..

ఆమె.. ఫలానా వాళ్ల కోడలు, ఆమె.. ఫలానా అతని భార్య, ఆమె.. ఆ బిడ్డకు తల్లి వంటి ఆమెకంటూ ఓ గుర్తింపు లేని వాతావరణంలో పుట్టి పెరిగిన ఓ మహిళ, తన కంటూ ప్రత్యేక స్థానం కావాలని చిన్నప్పటి నుండి కలలుగంది. చదువుతోనే అది సాధ్యమని నమ్మి గ్రాడ్యుయేషన్ చేసింది. ఆ తరువాత ఉపాధ్యాయ వృత్తిని ఎంచుకుని బాలికా విద్య కోసం అహర్నిశలు పాటుపడింది. ఫలితంగా మూడేళ్ల క్రితమే ఆమెకు జాతీయ ఉపాధ్యాయురాలిగా దేశ వ్యాప్తంగా గుర్తింపు వచ్చింది. ఆమె ఎవరంటే- బీహార్‌కి చెందిన చందనా దత్. శిక్షామిత్రగా ఈ అవార్డు అందుకున్న తొలి మహిళ ఆమె. ఈ విజయం వెనుక ఆమె ఎన్నో ఆటుపోట్లు చవిచూసింది. బోధకురాలిగా విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపడంతోనే సరిపెట్టుకోకుండా, వారి కుటుంబాలను ఉపాధి మార్గంలో నడిపిస్తోంది.



బీహార్ మధుబనిలోని రాంతీ ప్రాథమికోన్నత పాఠశాలలో చందనా దత్ (49) శిక్షామిత్రగా విధులు నిర్వహిస్తున్నారు. ఆ ప్రాంతంలో వివాహితలను తమ సొంత పేర్లతో పిలవరు. వారి మొదటి బిడ్డ తల్లి, అతని భార్య, ఆ ఇంటి కోడలు.. ఇవే ఆమె గుర్తింపు చిహ్నాలు. 'నా చిన్నతనం నుండి మా ఇంట్లో, చుట్టుపక్కల ఇలాంటి వాతావరణం ఉండేది. నాకు అది నచ్చేది కాదు. ఏదైనా సాధించి నాకంటూ ప్రత్యేక గుర్తింపు సాధించాలని ఎంతో పట్టుదలగా ఉండేదాన్ని. నా అక్కలు ఇద్దరూ గ్రాడ్యుయేషన్ పూర్తి కాకుండానే వివాహాలు చేసుకుని అత్తారిళ్లకి వెళ్లిపోయారు. నేను మాత్రం పట్టుబట్టి గ్రాడ్యుయేషన్ పూర్తయ్యేదాకా పెళ్లి చేసుకోలేదు. ఉన్నత విద్య చదువుకున్నాను' అంటూ తన గతాన్ని గుర్తుచేసుకున్నారు చందనా.

తక్కువ వేతనంతోనే..

2005లో చందన శిక్షా మిత్రగా విధులు చేపట్టారు. శిక్షా మిత్రలకి చాలా తక్కువ వేతనం ఉంటుంది. అలా ఇంటర్మీడియట్ విద్యార్హతతో చందన రూ.1500 జీతం నుండి పనిచేయడం మొదలుపెట్టారు. 'నేను స్కూలుకు వెళ్లే సరికి 400 నుండి 500 మంది విద్యార్థులు మాత్రమే ఉన్నారు. వారు కూడా సరిగ్గా హాజరు కావడం లేదు. బాలికల సంగతి సరేసరి. పిల్లలను ఎలాగైనా స్కూలుకు రప్పించాలని మా టీచర్ల బృందం తీర్మానించుకున్నాం' అంటున్న చందన స్కూలు చుట్టుపక్కల ఉన్న ముస్లిం కాలనీలు, షెడ్యూల్ కులాల కాలనీలకు క్రమం తప్పకుండా వెళ్లేవారు. పిల్లలకు, వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించేవారు.

నెలల బిడ్డతో..

ఇదంతా అందరూ చేసేదే.. డ్రాపౌట్స్‌ని స్కూలుకి రప్పించేందుకు ఎంతోమంది టీచర్లు ఇలాంటి పద్ధతులనే పాటిస్తారు. కానీ చందనా అంతటితోనే ఆగిపోలేదు. నెలల బిడ్డను చంకన పెట్టుకుని, ఇళ్లిళ్లు తిరిగారు. 'ఎండలో, బిడ్డతో ఇలా తిరగడం అవసరమా?' అని ఎంతోమంది ఎద్దేవా చేశారు. 'ఈ మాత్రం జీతానికి ఇంత చేయాలా?' అని బంధువులు చెవులు కొరుక్కున్నారు. అయినా ఆమె వెనుకంజ వేయలేదు. క్రమంగా బాలికల హాజరు పెరిగింది. మొదట 10 శాతం ఉన్న హాజరు ప్రస్తుతం 60 శాతానికి పెరిగింది.

కోవిడ్ సమయంలో ...

'పిల్లలను స్కూలుకు పంపించేందుకు వారి తల్లిదండ్రులు ఒప్పుకునేవారు కాదు. చాలామంది ఇళ్లల్లో ఆడపిల్లలు, వారి తమ్ముళ్లను, చెల్లెళ్లను చూసుకోవడానికి ఉండిపోయేవారు. అమ్మానాన్న పనికి వెళితే ఆ చిన్నబిడ్డలకు ఆ ఆడపిల్లే ఆసరా మరి. అలా ఇంటికే పరిమితమైన పిల్లలకు వయసు రాకుండా పెళ్లిళ్లు చేయడం అక్కడ సర్వసాధారణం. ఈ పరిస్థితుల్లో మార్పు రావాలని నేను చాలా ప్రయత్నం చేశాను. కోవిడ్ సమయంలో మా ప్రాంతంలో ఎన్నో



కుటుంబాలు ఉపాధి లేక విలవిల్లాడాయి. ముందు, ఆ కుటుంబాలకు ఏదైనా ఆదాయం చూపించాలని ఆలోచించాను. మా ప్రాంతంలో మిథిలా కళారూపాలు చాలా ప్రసిద్ధిగాంచాయి. ఆ కళారూపాలతో ఫేస్ మాస్కులు ఎలా తయారు చేయవచ్చో ఆ కుటుంబాలకు నేర్పాను' అంటున్న చందన లాక్‌డౌన్ సమయంలో అందరిలా ఇంటికే పరిమితం కాకుండా, తన విద్యార్థులతో ఆ కాలనీలకు వెళ్లి మాస్కుల ఆర్డర్ ఇచ్చారు. ఉత్పత్తులు తయారయ్యాక వాటిని విక్రయించే బాధ్యత ఆమే స్వయంగా తీసుకున్నారు. అలా 10 వేల మాస్కులు విక్రయించారు. చందన గురించి ఇంతవరకే చెప్పుకుంటే చాలదు. ఆ కుటుంబాల మహిళలకు అక్షరాలు కూడా నేర్పారు. ఆ ఇళ్లల్లో ఉన్న తన విద్యార్థులనే అందుకు పురమాయించారు. అలా ప్రతి ఇంట్లో పిల్లలు తల్లులకు విద్య నేర్పేలా చేశారు.

రెండు దశాబ్దాలుగా శిక్షా మిత్రగా పనిచేస్తున్న చందన, కళారూపాలు తయారుచేయడంలో, సాహిత్య రంగంలో కూడా ప్రావీణ్యం ఉంది. మిథిలా ఆర్ట్ నేర్చుకునే క్రమంలో మైథిలీ లిపిలో మాస్టర్ డిగ్రీ చేశారు. విద్యార్థులకు మైథిలీ లిపితో పాటు ఆంగ్లం కూడా బోధిస్తారు. ఇంకా తన అభిరుచి ప్రకారం ఖైతీ, నేపాలి, బజ్జిక, భోజ్‌పురి భాషల్లో కూడా మాస్టర్స్ చేశారు. భాషలు నేర్చుకోవడమే కాదు, ఆయా భాషల్లో కథలు, కవితలు కూడా రాస్తున్నారు.

కవితలు, పిల్లల కథలు రాస్తున్న చందన మొట్టమొదట రచన 'గంగా స్నాన్'. మైథిలీ భాషలో అది ప్రచురితమైంది. ఆ తరువాత 'చాహక్' పేరుతో పిల్లల కోసం చేసిన రచనలను ప్రచురించారు. తన కూతురుతో ఆ పుస్తకానికి కవర్‌పేజీ చేయించి ఆమెను కూడా భాగం చేశారు. 'దళిత మైథిలీ కథ సంచయాన్'లో ఆమె రచనలు ప్రచురితమయ్యాయి. డజనుకు పైగా కథల పుస్తకాలు అచ్చు వేయించారు. టీచర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తూ సాహిత్య రంగంలో కూడా కృషి చేస్తున్న చందనాను రాష్ట్ర ప్రభుత్వం పలు సత్కారాలతో గౌరవించింది. అలా 2021లో జాతీయ ఉత్తమ టీచర్‌గా కేంద్రం ఇచ్చిన సత్కారంతో ఆ పురస్కారం అందుకున్న తొలి శిక్షామిత్రగా ఆమె చరిత్ర సృష్టించారు.

'ఆమె'ని పేరుతో పిలవడానికి కూడా ఇష్టపడని సమాజంలో కళాకారిణిగా, రచయిత్రిగా, కవయిత్రిగా, ఉపాధ్యాయినిగా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న చందనా దత్ లాంటి వాళ్లు మనచుట్టూ ఎంతోమంది..







'పుష్ప - ది రోర్' గా పార్టు 3

అల్లు అర్జున్ హీరోగా సుకుమార్ దర్శకత్వంలో 2021లో వచ్చిన పుష్ప సినిమా హిట్ అయిన విషయం తెలిసిందే. ఈ చిత్రానికిగాను హీరో, సంగీత దర్శకుడు జాతీయస్థాయి అవార్డులు అందుకున్నారు. తాజాగా ఈ కథ మూడో పార్టుకు పుష్ప-3కి 'పుష్ప ది రోర్' టైటిల్‌ను ఖరారు చేసినట్లుగా సమాచారం. మొదటి భాగాన్ని 'పుష్ప : ది రైజ్'తో ప్రారంభించిన చిత్రబృందం దానికి సీక్వెల్‌గా 'పుష్ప: ది రూల్' పార్ట్-2గా రూపొందిస్తున్నారు. తర్వాత 'పుష్ప: ది రోర్' పేరుతో పార్ట్-3 తెరకెక్కించి కథను ముగించనున్నారని సమాచారం. ఇప్పటికే అల్లు అర్జున్, సుకుమార్ పార్ట్-3పై స్పందించిన విషయం తెలిసిందే. ప్రస్తుతం పార్ట్ 2 షూటింగ్ జరుగుతోంది. ఆగస్టు 15న ఇది విడుదల కానుంది.

యువతను ఆకట్టుకుంటుంది : సిద్ధు జొన్నలగడ్డ



టిల్లు స్క్వేర్ సినిమా యువతను బాగా ఆకట్టుకుంటుందని హీరో సిద్ధు జొన్నలగడ్డ అన్నారు. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య ఈ సినిమాను నిర్మించారు. 'డీజే టిల్లు'కు సీక్వెల్‌గా శుక్రవారం నాడు 'టిల్లు స్క్వేర్' సినిమా విడుదల కానుంది. గురువారం మీడియాతో హీరో సిద్ధు జొన్నలగడ్డ మాట్లాడారు. "డీజే టిల్లు విడుదల సమయంలో ప్రేక్షకుల్లో అంచనాల్లేవు. హీరో పాత్రను చూసి ప్రేక్షకులు సర్‌ప్రైజ్ అయ్యారు. ఇప్పుడు అదే పాత్రతో మరోసారి మ్యాజిక్ చేయాల్సిరావటంతో కాస్త ఒత్తిడి ఉండటం సహజం. అయితే ఒత్తిడిని జయించి మెరుగైన అవుట్‌పుట్‌ని అందించటానికి కృషిచేశాం. టిల్లు పాత్ర సీక్వెల్‌లో ఇంకా ఎక్కువ ఎనర్జిటిక్‌గా ఉంటుంది. చాలా సర్‌ప్రైజ్‌లు, షాక్‌లు ఉంటాయి. ఆద్యంతం నవ్వుకుంటూనే ఉంటారు. పార్ట్-3 కూడా వచ్చే అవకాశం ఉంది. ఇప్పటికే కథ సిద్ధమైంది.' అని వివరించారు.

'మనమే'లో ఫస్ట్ సింగిల్ విడుదల



హీరో శర్వానంద్ నటిస్తున్న 35వ చిత్రం 'మనమే'. శ్రీరామ్ ఆదిత్య దర్శకత్వంలో పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై టిజి విశ్వప్రసాద్ నిర్మించారు. కృతిశెట్టి హీరోయిన్. వివేక్ కూచిభొట్ల సహ నిర్మాత. కృతి ప్రసాద్, ఫణివర్మ ఎగ్జిక్యూటివ్ నిర్మాతలు. ఏడిద రాజా అసోసియేట్ ప్రొడ్యూసర్. ఈ సినిమాలోని ఫస్ట్ సింగిల్ 'ఇక నా మాట' పాటను చిత్రబృందం విడుదల ద్వారా మ్యూజిక్ ప్రమోషన్స్‌ను ప్రారంభించింది. కృష్ణచైతన్య రాసిన పాటకు హేషమ్ అబ్దుల్ వహాబ్ సంగీతాన్ని అందించారు. లండన్‌లోని అద్భుతమైన ప్రదేశాల్లో విష్ణు శర్మ, జ్ఞాన శేఖర్ చిత్రీకరించారు. శాస్త్రి వర్మ కొరియోగ్రఫీ చేశారు. చైల్డ్ ఆర్టిస్ట్ విక్రమ్ ఆదిత్య కీలకపాత్రలో నటిస్తున్నాడు.

కార్తీక్ సుబ్బరాజుతో సూర్య




'జిగర్‌తండా' చిత్ర దర్శకుడు కార్తీక్ సుబ్బరాజుతో సూర్య ఓ సినిమా చేయనున్నారు. దీనికి సంబంధించి ప్రకటనను కార్తీక్ సుబ్బరాజు ఎక్స్ వేదికగా ప్రకటించారు. సూర్య 44 రానున్న ఈ ప్రాజెక్ట్ సంబంధించి మరిన్ని వివరాలను త్వరలోనే వెల్లడించనున్నట్లు చిత్రబృందం తెలిపింది. ఈ సినిమాను సూర్య సొంత నిర్మాణ సంస్థ 2డీ ఎంటర్‌టైన్‌మెంట్స్ నిర్మించనుంది.



'ఫ్యామిలీ స్టార్' ట్రైలర్

విజయ్ దేవరకొండ హీరోగా పరశురామ్ దర్శకుడిగా, గోపీ సుందర్ మ్యూజిక్ డైరెక్టర్‌గా 'ఫ్యామిలీ స్టార్' సినిమా తెరకెక్కింది. మృణాల్ ఠాకూర్ హీరోయిన్‌గా నటించారు. తాజాగా గురువారం ఈ సినిమా నుండి చిత్రబృందం ట్రైలర్ రిలీజ్ చేశారు. 'స్వామీ, నువ్వు కొత్తగా నా లైఫ్‌లో బ్రేకులేమీ ఇవ్వాల్సిన పని లేదు. ఉన్నదాన్ని మాత్రం చెడగొట్టకు' అని అంటున్న హీరో డైలాగులతో ట్రైలర్ మొదలైంది. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై దిల్ రాజు, శిరీష్ ఈ చిత్రాన్ని నిర్మించారు. ఏప్రిల్ 5న తెలుగు, తమిళ, హిందీ భాషల్లో రిలీజ్ కానుంది.


పెళ్లి కాదు.. నిశ్చితార్థం..



అదితి రావు హైదరీ-సిద్ధార్థ్ సీక్రెట్‌గా పెళ్లి చేసుకున్నారనే వార్తలు బుధవారం నుండి వినిపిస్తున్నాయి. ఈ క్రమంలో.. తాజాగా, సిద్ధార్థ్- అదితి రావు హైదరీ గురువారం తమ ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో ఒక పోస్ట్ పెట్టి పెళ్లిపై స్పష్టత ఇచ్చారు. అతను ఒకే చెప్పడంతో ఎంగేజ్‌మెంట్ చేసుకున్నాము అని, రింగ్ పెట్టుకున్న ఫొటోను అదితి షేర్ చేశారు. అలాగే సిద్ధార్థ్ కూడా ఆమె ఎస్ చెప్పడంతో నిశ్చితార్థం చేసుకున్నామని అదే ఫొటోను పోస్టు చేశారు.

ఆదుకున్న రియాన్

45 బంతుల్లో 84 పరుగులు
ఢిల్లీపై 12పరుగుల తేడాతో రాజస్తాన్ గెలుపు



జైపూర్: ఇండియన్ ప్రిమియర్ లీగ్(ఐపిఎల్) సీజన్-17లో రాజస్తాన్ రాయల్స్ మరో విజయాన్ని సొంతం చేసుకుంది. సవాయ్ మాన్‌సింగ్ స్టేడియంలో ఢిల్లీ క్యాపిటల్స్‌తో గురువారం జరిగిన మ్యాచ్‌లో రాజస్తాన్ జట్టు 12పరుగుల తేడాతో సంచలన విజయాన్ని నమోదు చేసుకుంది. తొలిగా బ్యాటింగ్‌కు దిగిన రాజస్తాన్ నిర్ణీత 20 ఓవర్లలో 5వికెట్ల నష్టానికి 185పరుగులు చేయగా.. అనంతరం ఢిల్లీని 175పరుగులకే పరిమితం చేసింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన రాజస్తాన్‌ను తొలుత ఢిల్లీ బౌలర్లు కట్టడి చేశారు. ముకేశ్ కుమార్ తన తొలి ఓవర్లోనే డేంజరస్ ఓపెనర్ యశస్వీ జైస్వాల్(5) బౌల్డ్ చేశాడు. ఆ కాసేపటికే కెప్టెన్ సంజూ శాంసన్(15), జోస్ బట్లర్(11)లు డగౌట్‌కు చేరారు. దీంతో రాజస్తాన్ 36 పరుగులకే 3 కీలక వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఆ తర్వాత రాజస్తాన్ వికెట్లు చేజార్చుకోకపోయినా.. 10 ఓవర్లు పూర్తయ్యేసరికి 3వికెట్ల నష్టానికి 53పరుగులే చేసింది. దీంతో జట్టు స్కోర్ 130 దాటడమే కష్టమనిపించింది. ఈ క్రమంలో ఢిల్లీ ముందు కనీసం పోరాడగలిగే స్కోరైనా ఉంచుతుందా? అనే సందేహాలను పటాపంచలు చేస్తూ.. నాలుగో స్థానంలో వచ్చిన అశ్విన్ అశ్విన్(29)తో పరాగ్ జతకట్టి స్కోర్ బోర్డును పరుగులు పెట్టించాడు. వీళ్లిద్దరూ 50పరుగుల భాగస్వామ్యం నెలకొల్పడంతో రాజస్థాన్ కోలుకుంది. చివర్లో హెట్‌మైర్(14నాటౌట్) అండతో రెచ్చిపోయిన పరాగ్ ఆఖరి ఓవర్లో చితక్కొట్టాడు. వరుసగా 4, 4, 6, 4, 6 1 బాదాడు. రియాన్(84నాటౌట్) రాణించడంతో రాజస్తాన్ 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 185 పరుగులు చేసింది. ఢిల్లీ బౌలర్లలో ముకేశ్, నోకియా, కుల్దీప్, ఖలీల్, అక్షర్‌లకు తలా ఒక్కో వికెట్ దక్కాయి.

ఛేదనలో ఢిల్లీ ధాటిగానే ఇన్నింగ్స్‌ను ఆరంభించింది. ఓపెనర్ వార్నర్(49), మిచెల్ మార్ష్(23)కి తోడు స్టబ్స్(44నాటౌట్), పంత్(28), అక్షర్(15నాటౌట్) బ్యాటింగ్‌లో రాణించారు. చివరి 2ఓవర్లలో 19పరుగులు చేయాల్సిన ఢిల్లీని రాజస్తాన్ బౌలర్లు అద్భుతంగా కట్టడి చేసి మ్యాచ్‌ను మలుపు తిప్పారు. రాజస్తాన్ బౌలర్లు బర్గర్, చాహల్‌లకు రెండేసి, ఆవేశ్ ఖాన్‌కు ఒక వికెట్ దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ రియాన్ పరాగ్‌కు లభించింది.

ఐపిఎల్‌లో నేడు

రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు
×
కోల్‌కతా నైట్‌రైడర్స్

వేదిక: ఎం.చిన్నస్వామి స్టేడియం, బెంగళూరు; రా.7.30గంllలకు

క్వార్టర్స్‌కు సింధు

స్పెయిన్ మాస్టర్స్ బ్యాడ్మింటన్ టోర్నీ



మాడ్రిడ్: స్పెయిన్ మాస్టర్ బ్యాడ్మింటన్ టోర్నీ మహిళల సింగిల్స్ క్వార్టర్‌ఫైనల్లోకి పివి సింధు ప్రవేశించింది. గురువారం జరిగిన ప్రి క్వార్టర్‌ఫైనల్లో సింధు వరుససెట్లలో చైనీస్ తైపీ షట్లర్ హంగ్-యు-సన్‌ను చిత్తుచేసింది. కేవలం 36నిమిషాల్లో ముగిసిన ఈ పోటీల్లో సింధు 21-14, 21-13తో తైపీ ప్లేయర్‌ను ఓడించింది. ప్రపంచ ర్యాంకింగ్స్‌లో సింధు 12వ స్థానంలో ఉండగా.. హంగ్-యు-సన్ ర్యాంక్ 63. సింధు చివరిసారిగా 2022లో సింగపూర్ ఓపెన్ సూపర్-500 టైటిల్‌ను చేజిక్కించుకుంది. ఇక పురుషుల డబుల్స్‌లో 8వ సీడ్ అర్జున్-ధృవ్ కపిల జోడీ క్వార్టర్స్‌కు చేరారు. వీరు 21-17, 21-19తో స్కాట్లాండ్ జంటను చిత్తుచేశారు. ఇక మిక్స్‌డ్ డబుల్స్‌లో సుమిత్‌రెడ్డి-సిక్కిరెడ్డి క్వార్టర్స్‌కు చేరారు. ప్రి క్వార్టర్స్‌లో వీరు 22-20, 21-18తో అమెరికాకు చెందిన స్మిత్-అలిసన్‌లను చిత్తుచేశారు.

విహారికి షోకాజ్ నోటీస్

విశాఖపట్నం: ఆంధ్ర క్రికెటర్ హనుమ విహారికి ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్(ఎసిఎ) షోకాజ్ నోటీస్ పంపింది. అర్థాంతరంగా కెప్టెన్సీ నుంచి వైదొలగడంతో పాటు భవిష్యత్‌లో ఆంధ్రాకు ఆడనని చెప్పడానికి కారణాలేమిటో చెప్పాలని ఆదేశించింది. 'గత నెలలో విహారి ఎందుకు అలాంటి కామెంట్స్ చేశాడో తెలుసుకోవాలి అనుకుంటున్నాం. ఇప్పటివరకూ అతడు మమ్మల్ని కలువలేదు. అతడు ఏమైనా చెప్పదలచుకునేందుకు ఇదొక మంచి అవకాశం. ఆంధ్రా క్రికెట్‌కు విహారి చేసిన సేవను మేము గుర్తిస్తున్నాం. అతడు దేశవాళీలో పలు స్థానాల్లో ఆడాడు' అని ఓ అధికారి తెలిపారు. ఈ ఏడాది జరిగిన రంజీట్రోఫీ తొలి మ్యాచ్ అనంతరం అనూహ్య కెప్టెన్సీ నుంచి తప్పుకున్నాడు. సీజన్ ముగిసిన అనంతరం భవిష్యత్‌లో ఆంధ్రా జట్టుకు ఆడనని వెల్లడించాడు. ఓ రాజకీయ నాయకుడి కుమారుడి కోసం నన్ను బలి చేశారు' అని విహారి తన ఇన్‌స్టాగ్రామ్‌లో రాసుకొచ్చాడు. దాంతో, ఆంధ్రా క్రికెట్‌పై తీవ్ర స్థాయిలో విమర్శలు వెల్లువెత్తిన విషయం తెలిసిందే. రాజకీయ బలమున్న పృథ్వీ రాజ్‌కు వత్తాసు పలికి తనను కెప్టెన్సీ నుంచి తప్పుకోవాలని ఒత్తిడి తెచ్చారని ఆవేదనకు గురయ్యాడు. విహారి ఆంధ్రా తరఫున 37 ఫస్ట్ క్లాస్ మ్యాచ్‌లు ఆడాడు. అంతకంటే ముందు అతడు హైదరాబాద్‌కు ఒక సీజన్ మొత్తం ప్రాతినిధ్యం వహించాడు.

అందరి చూపు రస్సెల్‌పైనే..

నేడు బెంగళూరు-కోల్‌కతా మ్యాచ్



బెంగళూరు: కోల్‌కతా నైట్‌రైడర్స్ స్టార్ బ్యాటర్ ఆండీ రస్సెల్‌పైనే అందరి కళ్లూ ఉన్నాయని ఆ ఫ్రాంచైజీ ప్రధాన కోచ్ చంద్రకాంత్ పండిట్ తెలిపారు. సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో ఈడెన్ గార్డెన్స్‌లో జరిగిన మ్యాచ్‌లో జమైకాకు చెందిన రస్సెల్ ఆకాశమే హద్దుగా చెలరేగి ఆడాడు. కేవలం 25బంతుల్లో 3ఫోర్లు, 7భారీ సిక్సర్లతో 64పరుగులు చేశాడు. మయాంక్ మర్కండే వేసిన 16 ఓవర్‌లో తొలి బంతికి డీప్ మిడ్‌వికెట్ మీదుగా 91 మీటర్ల సిక్స్, నాలుగో బంతికి 102 మీటర్ల సిక్స్, ఐదో బంతిని లాంగాన్ మీదుగా (96 మీటర్లు) స్టాండ్స్‌లోకి పంపాడు. టాప్, మిడిలార్డర్‌లో కంటే లోయర్ ఆర్డర్‌లో బ్యాటింగ్‌కే ప్రాధాన్యతనిస్తానని రస్సెల్ కూడా అంగీకరించాడు. మరోవైపు బెంగళూరు జట్టు ఆడిన 2 మ్యాచుల్లో ఒక మ్యాచ్‌లో నెగ్గి, మరో మ్యాచ్‌లో ఓటమిపాలైంది. దీంతో ఈ మ్యాచ్ ఇరుజట్లకు కీలకం కానుంది.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68